

- ఓటర్లకు డబ్బుల పంపిణీపై ప్రధాన పార్టీల సమీక్ష
- అటు అధిష్ఠానం, ఇటు అభ్యర్థుల ఆరా
- ఇరు పార్టీల్లో ఎనిమిది స్థానాల్లో పంపకం సరిగ్గా జరగలేదన్న అనుమానాలు
- సీరియస్‌గా ఉన్న అధినేతలు

ఎవరెంత నొక్కారు..?

ఓట్ల కొనుగోలుకు నియోజకవర్గాల వారీ కేటాయించిన డబ్బు ఎంతమేరకు ఓటర్లకు చేరింది? నేతలు ఎంత నొక్కేశారు? అన్న అంశం జిల్లాలో చర్చనీయాంశమైంది. దీనిపై వైసీపీ, టీడీపీ అగ్రనేతలు పరిశీలనలు ప్రారంభించారు. మరోవైపు అభ్యర్థులు కూడా తాము ఇచ్చిన డబ్బు ఓటర్లకు ఎంతవరకు పంపిణీ అయ్యిందన్న దానిపై దృష్టి సారించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాలకు డబ్బులు కేటాయించే విషయమై ప్రధాన పార్టీల అధిష్ఠానాలు జాగ్రత్తలు తీసుకున్నాయి. రంగంలో ఉన్న అభ్యర్థులు కూడా అదేస్థాయిలో పని చేశారు. అయినప్పటికీ అనేకచోట్ల ఓటర్లకు మొత్తం డబ్బులు అందలేదన్న ప్రచారం జరుగుతోంది. కొందరు పంచకుండా మధ్య లోనే నొక్కేశారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఇటు వైసీపీ, అటు టీడీపీ అధిష్ఠానాలు ప్రత్యేక పరిశీలన చేపట్టాయి. ప్రధానంగా అధికార పార్టీలో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. మొత్తంగా డబ్బు స్వాహాపర్వం జిల్లాలో అలజడి రేపుతోంది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇరుపార్టీల అధిష్ఠానాలు ఆయా పార్టీల తరఫున కనీసం నాలుగేసి నియోజకవర్గాల్లో డబ్బు పంపిణీ సక్రమంగా జరగలేదన్న అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. గతం కన్నా డబ్బుతో ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఈ పర్యాయం ఇరుపార్టీలు అధిక ప్రాధాన్యం ఇచ్చిన విషయం విదితమే. అంతేకాక ఉమ్మడి జిల్లాలో ఒకరిద్దరు మినహా ఇరు పార్టీల అధిష్ఠానాలు ఆయా అభ్యర్థులకు డబ్బును కూడా సమకూర్చాయి. వైసీపీ ముందుగా అభ్యర్థులకు నిర్దేశించిన టార్గెట్ ప్రకారం డబ్బును డిపాజిట్ చేయించుకొని అనంతరం ఆ మొత్తంతోపాటు పార్టీపరంగా ఇవ్వాల్సినంత ఇచ్చేసింది. పార్లమెంట్ అభ్యర్థుల వాటాగా నిర్దేశించిన సొమ్మును కూడా వైసీపీ అధిష్ఠానం తీసుకొని అభ్యర్థులకు చేర్చింది. ఒకట్రెండు చోట్ల ప్రత్యేక సమస్యలు ఎదురైతే అక్కడ ఎలా ఆర్థిక సహకారం ఇవ్వాలో పార్లమెంట్ అభ్యర్థులకు తెలియజేసింది. టీడీపీ మాత్రం నియోజకవర్గాల వారీగా ఒక అవగాహనతో ముందుకు సాగింది. పార్లమెంట్ అభ్యర్థులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఆయా నియోజకవర్గాలకు వారి ద్వారా ఆర్థిక చేయూతను అందించింది. అధికార వైసీపీ ప్రతి నియోజకవర్గంలో ఓటుకు రూ.2వేలు తగ్గకుండా ఇవ్వాలని అభ్యర్థులపై ఒత్తిడి చేసినట్లు సమాచారం. స్థానికంగా అవకాశం ఉన్న వారు అదనంగా ఇచ్చినా సంతోషమని సంకేతం ఇచ్చి ఆ రకంగా ఒత్తిడి కూడా పెంచారు. అయితే ఇరుపార్టీల్లో కొందరు అభ్యర్థులు పార్టీ నిర్దేశించిన ప్రకారం ఓట్ల కొనుగోలుకు డబ్బులు ఇవ్వలేదన్న అనుమానాలతో పరిశీలన ప్రారంభించారు. దీనికితోడు నియోజకవర్గాల్లో ఎంతమంది ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయాలన్న విషయాన్ని అధిష్ఠానాలే నిర్దేశించాయి. ప్రస్తుతం ఆ ప్రకారం ఓటు రేటు అమలు చేశారా, అవసరమైన సంఖ్యలో ఓటర్లకు డబ్బులు అందించారా లేదా అన్న విషయంపై పార్టీ పెద్దలు దృష్టి సారించడం విశేషం.

కొన్నిచోట్ల టీడీపీ అభ్యర్థుల వెనకడుగు

టీడీపీ చాలావరకు ఓటుకు రూ.1,500 ఇచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో పంపిణీ చేశారన్న అభిప్రాయం ఆ పార్టీలో నెలకొంది. ఒంగోలు, అద్దంకి, చీరాలలో ఓటుకు రూ.2వేల ప్రకారం డబ్బులు పంపిణీలో ముందున్నారన్న భావనలో ఆ పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. పర్చూరులో కొన్ని చోట్ల రూ.1,500 మరికొన్నిచోట్ల రూ.2వేలు ప్రకారం ఇచ్చారు. అదీ ఎక్కువ సంఖ్యలో పంపిణీ జరిగిన ట్లు భావిస్తున్నారు. గిద్దలూరులో ఓటుకు రూ.1,500 ప్రకారం పంచినప్పటికీ మొత్తం ఓటర్లకు డబ్బులు చేరలేదనే అనుమానం ఉంది. వైపాలెంలో ఓటుకు రూ.1,000 పంపిణీ చేయడంపై ఆ పార్టీ అధిష్ఠానం ప్రత్యేక పరిశీలన చేపట్టింది. మార్కాపురంలో ఓటుకు రూ.1500 ఎక్కువ మందికి ఇవ్వగలిగినప్పటికీ ఆపార్టీ చేయూతనిచ్చిన రీతిలో పంపిణీకి అభ్యర్థి ప్రాధాన్యం ఇవ్వలేదన్న అనుమానం నెలకొంది. పార్టీ తగు రీతిలో సహకారం ఇవ్వకపోయినప్పటికీ దర్శిలో టీడీపీ అభ్యర్థి ప్రత్యర్థి కన్నా మిన్నగా ముందడుగు వేశారనే అవగాహనకు ఆపార్టీ వచ్చింది. కందుకూరులో పార్లమెంట్ అభ్యర్థి ద్వారా చేయూత అందినప్పటికీ అసెంబ్లీ అభ్యర్థి డబ్బులు పంపిణీలో వెనకడుగు వేశారన్న అనుమానం ఆ పార్టీ అధిష్ఠానంలో నెలకొన్నట్లు తెలిసింది.

నాలుగైదు చోట్ల పంపిణీ సరిగ్గా లేదని వైసీపీ అనుమానం

అధికార వైసీపీ విషయాని కొస్తే కనిగిరి, సంతనూతలపాడుతోపాటు మార్కాపురం, అద్దంకి పర్చూరులాంటి నియోజకవర్గాల్లో ఆశించిన మేరకు డబ్బులు పంపిణీ జరగలేదన్న అనుమానంతో ఆ పార్టీ అధిష్ఠానం పరిశీలన చేపట్టినట్లు తెలిసింది. గిద్దలూరు, కొండపి తదితర చోట్ల ఓటర్లందరికీ డబ్బుల విషయంలో కొంత వైఫల్యం చోటుచేసుకున్నదనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ప్రతి నియోజకవర్గంలో ఓటుకు రూ.2వేల ప్రకారం పంపిణీ చేయాలని వైసీపీ అధిష్ఠానం నిర్దేశించింది. ఆ ప్రకారం అభ్యర్థులు ముందుగా డిపాజిట్ చేయగా వాటితోపాటు పార్టీ నుంచి డబ్బులు అందించినట్లు కూడా తెలుస్తోంది. కనిగిరి, ఎస్ఎన్‌పాడులాంటి చోట్ల ఓటుకు రూ.1,500 ప్రకారం వైసీపీ అభ్యర్థులు పంపిణీ చేశారు. మార్కాపురంతోపాటు మరికొన్ని నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లకు అదేస్థాయిలో డబ్బులు అందలేదని తెలుస్తోంది. దీంతో వైసీపీ అధిష్ఠానం ఈ విషయంపై ప్రత్యేక పరిశీలన చేపట్టింది. ఓటుకు రూ.1,500 ప్రకారం ఇచ్చినట్లుగా కనిగిరి, ఎస్ఎన్‌పాడులపై నిర్ధారణకు వచ్చిన పార్టీ పెద్దలు అన్ని ప్రాంతాల్లో సమానంగా డబ్బులు అందించడంలో వెనుకడుగు వేసినట్లు కొన్ని నియోజకవర్గాలపై అనుమానంతో పరిశీలనలు చేపట్టారు. ఒంగోలు, దర్శి, వైపాలెం.. ఆ తర్వాత కందుకూరు, కొండపి, అద్దంకి, చీరాల, పర్చూరు, గిద్దలూరులాంటి చోట్ల ఓటుకు రూ.2వేల ప్రకారం వైసీపీ పక్షాన డబ్బులు పంపిణీ జరిగినా నిర్దేశించిన సంఖ్యలో ఓటర్లకు అందలేదన్న అనుమానం నెలకొంది. గిద్దలూరులో 60శాతం లోపే డబ్బులు పంపిణీ జరిగినట్లు తేల్చారు. కొండపిలో ఎంపీ అభ్యర్థి సహకరించకపోయినా అసెంబ్లీ అభ్యర్థి ఓటుకు రూ.2వేల లెక్కన పంపినా కిందిస్థాయిలో పంపిణీలో లోపం జరిగినట్లు గుర్తించారు. అదేరకమైన పరిస్థితి చీరాల, పర్చూరు, అద్దంకిల్లో కూడా నెలకొన్నట్లు పార్టీ అధిష్ఠానం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ఎర్రగొండపాలెం, దర్శి, ఒంగోలు, చీరాలలో మాత్రం వైసీపీ పక్షాన ఈ విషయంలో ఎలాంటి లోపం జరగలేదనే భావనకు వచ్చినట్లు సమాచారం.

స్థానిక నేతల వైఖరిపై కన్ను

అనేక నియోజకవర్గాల్లో రెండు పార్టీల తరఫున పోటీల్లో ఉన్న అభ్యర్థులు వారు నియమించుకున్న సొంత మనుషుల ద్వారా డబ్బు పంపిణీ జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అయినప్పటికీ సమస్య ఎదురైన నియోజకవర్గాల వారు స్థానిక నేతలకు అవసరమైన ప్రాధాన్యం ఇచ్చారు. కొన్నిచోట్ల పూర్తిగా స్థానిక నేతలకే అప్పగించారు. అయితే ఈ విషయంపై అధిష్ఠానం పలు అనుమానాలతో ప్రత్యేక పరిశీలన చేపట్టిన నేపథ్యంలో కిందిస్థాయిలో మండల, గ్రామనేతల వైఖరిపై చర్చ మొదలైంది. తాము పంపిన డబ్బులు ఎంతమేరకు ఓటర్లకు చేరాయి. ఎంతమేరకు దారి మళ్లాయి అనే విషయంపై అభ్యర్థులు నిశితమైన పరిశీలన చేపట్టడం విశేషం. అటు ఇరుపార్టీల అధినేతలు, ఇటు నియోజకవర్గ స్థాయిలో అభ్యర్థులు డబ్బు పంపిణీపై పరిశీలనలు చేపట్టడంతో భవిష్యత్తులో ఈ వ్యవహారం ఆయా పార్టీల్లో ఏస్థాయిలో కలకలం సృష్టించబోతుందన్న అంశం చర్చనీయాశమైంది.



పోలీసు అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

- అధికారులకు పలు సూచనలు

ఒంగోలు (కలెక్టరేట్), మే 22 : ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో వచ్చేనెల 4వతేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. బుధవారం సాయంత్రం రైజ్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ ఏర్పాట్లను ఆయన చూశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతపై పోలీస్ అధికారులతో చర్చించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద నిరంతర నిఘా కొనసాగించాలన్నారు. ఇతరులు లోపలికి రాకుండా తనిఖీలు చేయాలని సూచించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల సీల్‌ను పరిశీలించి అక్కడి రిజిస్టర్‌లో సంతకం చేశారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్వో సుబ్బారెడ్డితోపాటు పలువురు అధికారులు ఉన్నారు.



మరో రూపాయి పెరుగుదల

- ఒంగోలు-1లో పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.323

ఒంగోలు, మే 22 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్‌లో బుధవారం కూడా జోరు కొనసాగింది. మేలురకం, మీడియం, లోగ్రేడ్ ఇలా అన్నింటినీ బయ్యర్లు పోటీపడి కొనుగోలు చేశారు. మేలురకం గరిష్ఠ ధర మరో రూపాయి పెరిగింది. మంగళవారం కిలోకు రూ.322 లభించగా బుధవారం 323కు చేరింది. ఒంగోలు-1 వేలంకేంద్రంలో ఆ ధర లభించింది. ఇతర కేంద్రాల్లోనూ గరిష్ఠ ధరలు రూ.320కి అటు ఇటుగా పలికాయి. ఇక మీడియం రకం బేళ్ల కిలో రూ.300పైనే ఉండగా.. లోగ్రేడ్‌లో నాణ్యమైన బ్రౌన్, ఇతర రకాల ధర కూడా కిలో రూ.270 పైనే దక్కింది. వారం క్రితం వరకు నోబిడ్‌లు కొంతమేర ఉంటుండగా ప్రస్తుతం వాటి సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. ఇప్పటివరకూ సుమారు 53 మిలియన్ కిలోల పొగాకు కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.243పైగానే ధర లభించింది.



భారీ సంస్కరణలు

డిజిటల్ ఆన్‌లైన్ విధానంలో ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం

- స్పాట్ వాల్యుయేషన్ విధానానికి ఇక స్వస్తి

ఒంగోలు(విద్య), మే 22: ఇంటర్మీడియేట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనంలో భారీ సంస్కరణలకు బోర్డు శ్రీకారం చుట్టింది. ప్రప్రథమంగా డిజిటల్ ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని అమలుకు రాష్ట్రంలో ఆరు ప్రాంతీయ రిసెప్షన్ అండ్ స్కానింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులోభాగంగా ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో ఒక సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇది ప్రకాశం, బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాలకు ప్రాంతీయ రిసెప్షన్ అండ్ స్కానింగ్ సెంటర్‌గా పనిచేస్తుంది. పరీక్షా కేంద్రాల నుంచి వచ్చిన జవాబుపత్రాలను ఆయా సెంటర్లలో నియమితులైన అధికారులు స్కానింగ్ చేస్తారు. డిజిటల్ ఆన్‌లైన్ విధానంలో జవాబుపత్రాలను మూల్యాంకనం చేసేందుకు అధ్యాపకులను ఇంటర్ బోర్డు ఎంపిక చేస్తుంది. వారి మెయిల్, పాస్‌వర్డ్ వివరాలు కూడా ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో ఉంచుతుంది. ఆర్ఆర్ఎస్‌సీ సెంటర్లలో స్కానింగ్ చేసిన జవాబుపత్రాలు క్లౌడ్‌లోకి వెళ్తాయి. అక్కడి నుంచి ర్యాండమ్‌గా ఇంటర్ బోర్డు ఎంపికచేసిన అధ్యాపకుల లాగిన్‌కు అప్‌లోడ్ చేయడం ద్వారా జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుంది. ఒక జిల్లాలోని ఎగ్జామినర్‌కు ఇతర జిల్లాల విద్యార్థుల జవాబుపత్రాలు వచ్చేవిధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎగ్జామినర్లు రోజుకు 60 జవాబుపత్రాలు మూల్యాంకనం చేయాలి. ఒక జవాబుపత్రం మూల్యాంకనం పూర్తయి సబ్మిట్ కొట్టగానే కంప్యూటర్/ల్యాప్‌టాప్ తెరపై మరో జవాబుపత్రం ప్రత్యక్షమవుతుంది. వెబ్ కెమెరా నిఘాలో ఈ మూల్యాంకనం జరగాల్సి ఉంది. ఆయా కళాశాలల్లో ఎగ్జామినర్ల మూల్యాంకనాన్ని సంబంధిత ప్రిన్సిపాల్స్ పర్యవేక్షించాలి. ఎగ్జామినర్లు ఒకరి బదులు మరొకరు మూల్యాంకనం చేసే అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఈ విధానంతో ఎగ్జామినర్లు వ్యయ ప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి మూల్యాంకన కేంద్రానికి వచ్చి అక్కడ పేపర్లు దిద్దే శ్రమ లేకుండాపోతుంది. అధ్యాపకులు తాము పనిచేస్తున్న కళాశాలల్లోనే మూల్యాంకనం చేస్తారు. నూతన విధానంపై అధ్యాపకులకు బుధవారం ఏకేవీకే కళాశాలలో శిక్షణ ఇచ్చినట్లు ఆర్ఐవో సైమన్ విక్టర్ తెలిపారు.



కిర్గిస్థాన్‌లో భారతీయులపై దాడి చేస్తున్న దృశ్యం

మమ్మల్ని కాపాడండి.. ఇంటికి చేర్చండి..!

- ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవాలని వేడుకోలు
- కిర్గిస్థాన్‌లో భారతీయ విద్యార్థులపై దాడులు
- భయంగుప్పిట్లో రాష్ట్ర వైద్య విద్యార్థులు
- వారంరోజులుగా నిద్రాహారాలు, తిండి కరువు

వివరాలు మెయిన్‌లో..

ఆ రెంటిపైనే..

- దర్శి, చీరాలపై బెట్టింగ్‌రాయుళ్ల దృష్టి
- రోజురోజుకూ పెరుగుతున్న పందేలు
- ఆ ఫలితాల వైపే అందరి చూపు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)


ఎన్నికల ఫలితాలపై ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని దర్శి, చీరాల నియోజకవర్గాల్లో జరుగుతున్న బెట్టింగ్‌ల తీరు ఆసక్తికరంగా కనిపిస్తోంది. ఆ రెండు చోట్లా ఆరంభంలో వైసీపీకి విజయావకాశాలు ఎక్కువ అన్న భావన వ్యక్తమైంది. దీంతో పరిశీలకులు, బెట్టింగ్ రాయుళ్లు పెద్దగా పట్టించుకోలేదు. పోలింగ్ అనంతరం అక్కడ కూటమి విజయావకాశాలపై కూడా నమ్మకం పెరిగింది. దీంతో ఆ రెండు చోట్లా ఏం జరిగింది? బెట్టింగ్‌లు అధికంగా ఎందుకు జరుగుతున్నాయి? అన్న చర్చ అందరిలో ప్రారంభమైంది.

దర్శిలో మారిన పరిణామాలు

దర్శి అభ్యర్థిని వైసీపీ ముందుగానే ప్రకటించింది. ఆ నియోజకవర్గంతో సంబంధం ఉన్న శివప్రసాద్‌రెడ్డికి అవకాశం ఇచ్చింది. అంతకన్నా ముందుగానే ఆయన అధిష్ఠానం సూచనతో క్షేత్రస్థాయిలో పర్యటనలు ప్రారంభించారు. అప్పటికి టీడీపీ పక్షాన ఆ నియోజకవర్గానికి ఇన్‌చార్జి కూడా లేరు. ఆ స్థానాన్ని జనసేనకు కేటాయిస్తూ అధికారికంగానే సమాచారం ఇచ్చారు. జనసేన తరఫున ఎక్కడో అమెరికాలో ఉండే పక్క జిల్లా వ్యక్తిని ఇన్‌చార్జిగా నియోజకవర్గానికి పంపారు. దీంతో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వైసీపీకి విజయావకాశాలు ఉన్నాయన్న ప్రచారం జరిగింది. అయితే అనూహ్య పరిణామాల మధ్య అక్కడ టీడీపీ రంగంలోకి రావడం, అందులో మహిళా అభ్యర్థిని పోటీకి దించడం కూటమికి కలిసొచ్చింది. పైగా డాక్టర్ లక్ష్మి వాక్చాతుర్యంతో, చొరవగా దూసుకెళ్లడం ప్లస్ పాయింట్ అయ్యింది. దీనికితోడు టీడీపీ జనసేన పార్టీలు సమష్టిగా పనిచేశాయి. కూటమి నుంచి పోటీ తీవ్రత పెరగ్గానే వైసీపీ వైపు నుంచి ప్యాకేజీలు, ప్రలోభాలు పెరిగిపోయాయి. ఆ విషయంలో టీడీపీ అభ్యర్థి ఎక్కడా తగ్గలేదు. ప్రధాన సామాజికవర్గాలు రెండూ కూటమివైపు నిలవగా వైసీపీలో ఉన్న సామాజికవర్గంలో చీలిక కనిపించింది. పోలింగ్ రోజు టీడీపీ కూటమి సేనలు ఎక్కడా తగ్గలేదు. బొట్లపాలెంలో వైసీపీ అరాచకాలను అడ్డుకుని కూటమి అభ్యర్థి సానుభూతిని కూడా సంపాదించారు. వైసీపీకి పూర్తిగా బలమైన ఎర్రఓబినేనిపల్లిలో కూటమి ఏజెంట్లను బయటకు నెట్టినా కొద్దిసమయంలోనే తిరిగి లోపలికి వెళ్లి పోలింగ్ జరిగే విధంగా చేశారు. పరిస్థితులన్నీ సమీక్షించుకుని కాబోలు నియోజకవర్గంలో గెలుపోటములపై భారీగా బెట్టింగ్ నడుస్తోంది. ఇక్కడ గెలుపోటములపై జిల్లాలోనే కాక రాష్ట్రస్థాయిలో కూడా జోరుగా పందేలు జరుగుతుండటం విశేషం. తొలుత వైసీపీ గెలుపునకు అనుకూలంగా పందేలు కాసిన వారు రూపాయికి రూపాయిన్నర పందెం కట్టారు. ఇప్పుడు రూపాయికి రూపాయి అంటూ గెలుపుపై జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. వైసీపీకి పది వేలు ఆధిక్యత వస్తుందంటూ ప్రారంభంలో సాగిన పందెం ప్రస్తుతం కనిపించడం లేదు. టీడీపీ వైపున గెలుపునకు అనుగుణంగా భారీగా పందేలు జరుగుతున్నాయి. నియోజకవర్గ స్థాయిలో మండలాల వారీ ఆధిక్యతలపై కూడా జోరుగా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి.

చీరాల ఫలితంపై ఆసక్తి

చీరాల అసెంబ్లీ స్థానంలో గెలుపోటములపై కూడా పోలింగ్ అనంతరం బెట్టింగ్‌లు పెరిగాయి. ఎన్నికల సమరం ప్రారంభానికి ముందు వైసీపీకి అనుకూలమైన ఫలితం వస్తుందన్న ప్రచారం సాగింది. సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే బలరాం కుమారుడు వెంకటేష్ ఆ పార్టీ అభ్యర్థి కావడం, నియోజకవర్గంలో బడుగు, బలహీనవర్గాల ఓటర్లు అధికంగా ఉండటం కూడా ఆ రకమైన అంచనాకు కారణమయ్యాయి. అయితే మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కాంగ్రెస్ వైపున రంగంలోకి రావడంతో ఫలితంపై ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం వైసీపీ, టీడీపీ కూటమిల్లో గెలుపు ఎవరిదనే దానిపై బెట్టింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. కాంగ్రెస్ తరఫున పోటీచేసిన ఆమంచి వైసీపీ ఓట్లకు గండికొడతారనేది ఒక అంచనా. దానికితోడు టీడీపీ కూటమి అభ్యర్థి బీసీ వర్గానికి చెందిన వారు కావడం, పోల్ మేనేజ్‌మెంట్‌లో తగ్గకపోవడం ఒక కారణమైంది. మొత్తం పరిస్థితిని సమీకించుకున్న బెట్టింగ్‌రాయుళ్లు టీడీపీ విజయావకాశాలు మెరుగుపడి, వైసీపీకి సన్నగిల్లాయన్న భావనతో పందేల్లో మార్పులు చేశారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఫలితాలు ఎలా ఉండబోతున్నా వైసీపీకి టీడీపీ కూటమి నుంచి తీవ్ర పోటీ ఏర్పడి విజయావకాశాలు ఒకవైపు లేవన్న సంకేతమే బెట్టింగ్‌లు పెరగడానికి కారణమైంది.





ప్రాణం తీసిన గుంతలు

- బైక్ పైనుంచి పడి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి
- యద్దనపూడి-పర్చూరు రోడ్డులో ఘటన
- ఆయన అలవలపాడు ప్రాథమిక పాఠశాలలో టీచర్

వివరాలు లోపలి పేజీల్లో..

కొనసాగిన ఆరోగ్యశ్రీ సేవలు

- నెట్‌వర్క్ ఆసుపత్రుల నుంచి కోఆర్డినేటర్‌కు అందని సమ్మె నోటీసు
- ఊపిరిపీల్చుకున్న యంత్రాంగం

ఒంగోలు (కలెక్టరేట్), మే 22 : జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో బుధవారం ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగాయి. ప్రభుత్వం బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఆస్పత్రుల యాజమాన్యాలు మరోసారి ఆరోగ్యశ్రీ ట్రస్టుకు సమ్మె నోటీసులు ఇచ్చాయి. అయితే బుధవారం నుంచి నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తామని ప్రకటించినా ఆ ప్రభావం జిల్లాలో కనిపించలేదు. అన్ని ఆస్పత్రులలో సేవలు కొనసాగాయి. ఆరోగ్యశ్రీ సేవలను నిలుపుదల చేయాలంటే ముందస్తుగా జిల్లాలో కూడా సంబంధిత కోఆర్డినేటర్‌కు సమ్మె నోటీసు ఇవ్వాల్సి ఉంది. కానీ బుధవారం సాయంత్రం వరకు నెట్‌వర్క్ ఆసుపత్రుల నుంచి ఆయనకు ఎలాంటి నోటీసు ఇచ్చిన దాఖలాలు లేవు. దీంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

పెళ్లింట విషాదం

పెండ్లి కుమారుడి తండ్రి హఠాన్మరణం

శోకసంద్రంలో కుటుంబసభ్యులు




నాగేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న విజయ్‌కుమార్, నాగేశ్వరరావు (ఫైల్)

నాగులుప్పలపాడు, మే 22: పెళ్లింట విషాదం నెలకొంది. బంధుమిత్రుల సమక్షంలో వైభవంగా వివాహ వేడుక సిద్ధంగా ఇంతలోనే ఆ కుటుంబాన్ని విధి కాటేసింది. ఇంటి యజమాని గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. దీంతో ఆ కుటుంబసభ్యులు విషాద వదనంలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళితే.. చదలవాడ అంబేద్కర్‌నగర్‌కు చెందిన అంబడిపూడి నాగేశ్వరరావు, శాంతికుమారి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో పెద్ద కుమారుడు మధుకు గుంటూరు జిల్లా నిడుముక్కల గ్రామానికి చెందిన యువతితో వివాహం నిశ్చయమైంది బుధవారం ఉదయం 11 గంటలకు వివాహం జరగాల్సి ఉంది. వేకువజాము నుంచే పెండ్లి కుమారుడి తండ్రి అంబడిపూడి నాగేశ్వరరావు (47)పెళ్ళి పనుల్లో నిమగ్నమయ్యారు అంతకుముందే కాస్తంత వర్షం కురవడంతో వివాహ వేడుకకు ఆటంకం ఏర్పడుతుందని సన్నిహితులు వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. కాబోయే కోడల్ని వివాహ సమయానికి తీసుకు వచ్చేందుకు బాడుగ కారు మాట్లాడి పంపించారు, కుటుంబసభ్యులు అందరూ ఎవరికి వారే పెళ్ళి పనుల్లో ఉన్నారు. ఉదయం 7 గంటల సమయంలో హఠాత్తుగా నాగేశ్వరరావుకు గుండెపోటు వచ్చి అక్కడే కుప్పకూలారు. వెంటనే కుటుంబసభ్యులు, బంధువులు 108వాహనంలో ఒంగోలు తరలించారు. అయితే అప్పటికే నాగేశ్వరరావు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు చెప్పారు. వివాహాన్ని జరిపించి అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి చదలవాడకు వచ్చి నాగేశ్వరరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

పెరుగుతున్న పొగాకు ధరలు

● టంగుటూరులో కిలో రూ.320



టంగుటూరులో కొనసాగుతున్న పొగాకు వేలం

టంగుటూరు, మే 22 : పొగాకు ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈవారం ప్రారంభంలో గరిష్ఠ ధర కిలో రూ.306 ఉండగా బుధవారానికి అది రూ.320కు చేరింది. ముమ్ముందు ఇంకా పెరుగుతాయని రైతులు ఆశిస్తున్నారు. బుధవారం కారుమంచి రైతులకు చెందిన 436 బేళ్లను వేలానికి అనుమతించారు. అందులో 406 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన 30 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. మేలురకం గరిష్ఠ ధర కిలో రూ.320 పలికింది. కనిష్ఠ ధర రోజులాగానే రూ.205 దగ్గర ఆగిపోయింది. సరాసరి ధర రూ.262.93 దక్కింది. కొనుగోళ్లలో 14 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి : మేలురకం పొగాకు ధర కొండపి వేలం కేంద్రంలో కిలో రూ.320 పలికింది. పది రోజులుగా రోజూ కిలోకు రూ.3 నుంచి రూ.4 వరకూ ధర పెరుగుతూ వస్తోంది. బుధవారం చతుకుపాడు, కె.అగ్రహారం, మూగచింతల, నెన్నూరుపాడు, గుర్రప్పడియ గ్రామాలకు చెందిన రైతులు 1,077 పొగాకు బేళ్లను వేలానికి తీసుకువచ్చారు. 1,018బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు.

సఖీ సెంటర్ పరిశీలన



మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

ఒంగోలునగరం, మే 22: ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో ఉన్న సఖీ సెంటర్‌ను బుధవారం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సందర్శించారు. ఈ సఖీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలను ఆమె అడిగి తెలుసుకున్నారు. లైంగిక దాడికి గురై ఆశ్రయం పొందిన బాలికను ఆమె పరామర్శించారు. సఖీ సెంటర్‌లో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. సఖీ సెంటర్‌లో ఆశ్రయం పొందుతున్న బాలికలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బాలికల హక్కులకు భంగం కలుగకుండా చూడాలని ఆదేశించారు. రిమ్స్‌లో గైనిక్‌వార్డు సమీపంలో ప్రత్యేక ఊయల ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీశిశు సంక్షేమాధికారి మాధురి, ఒంగోలు అర్బన్ సీడీపీవో ఫణిరాజకుమారి, సీడీబ్ల్యూసీ సభ్యురాలు వంశీలత, రిమ్స్ సూపరింటెండెంట్ దుర్గాభవానీ, సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ జ్యోతిసుప్రియ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్యకేంద్రాల్లో వైద్య సేవలు సక్రమంగా అందించాలి

● డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 22: పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ డి.సురేష్‌కుమార్ ఆదేశించారు. ఒంగోలులోని వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌సీహెచ్, చైల్డ్‌హెల్త్, ఇమ్యునిజేషన్, టీబీ, లెప్రసి, ముఖహాజరుతో పాటు జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను పూర్తిచేసేలా వి.దంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆరోగ్యకార్యకర్త ప్రతి గర్భిణి పేరు సకాలంలో రిజిస్టర్ చేసి వారి వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టర్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రసవం, అనంతరం వరకు అందించాల్సిన సేవలను విధిగా అందించాలని చెప్పారు. అనుమానిత దగ్గుతో బాధపడుతున్న రోగులను గళ్ళ పరీక్ష కోసం వారికి కేటాయించిన ల్యాబ్‌కు పంపాలన్నారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీపీఎం డాక్టర్ వాణిశ్రీ, డీపీహెచ్ఎన్‌వో సుగుణమ్మ, డీపీవో సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

● ఆర్ఐవో సైమన్‌విక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐవో సైమన్‌విక్టర్

ఒంగోలు(విద్య), మే 22: జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐవో) ఎ.సైమన్‌విక్టర్ ఆదేశించారు బుధవారం ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 43, ద్వితీయ సంవత్సరం వారికి 28 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 15,291 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7,075మంది మొత్తం 22,366మంది హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలకు ఆయా కళాశాలల్లోని సీనియర్ లెక్చరర్లను, ప్రైవేటు కళాశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో అక్కడి ప్రిన్సిపాల్స్‌ను అదనపు చీఫ్ సూపరింటెండెంట్లుగా నియమించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. విద్యార్థుల జవాబుపత్రాల బండిళ్ళను డిపాజిట్ ప్రక్రియలో ఏ మాత్రం తేడా వచ్చినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఐఈవో కె.శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన గుంతలు

బైకు పైనుంచి పడి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

యద్దనపూడి-పర్చూరు రోడ్డులో ఘటన




రోడ్డుపై పడివున్న వినోద్‌కుమార్ మృతదేహం, వినోద్‌కుమార్ (ఫైల్)



గుంతలను గ్రావెల్‌తో చదును చేయిస్తున్న ఎస్ఐ చౌదరి

యద్దనపూడి, (మార్టూరు) మే 22 : తారు రోడ్లు పల్లెల్లో ఉన్న డొంక రోడ్ల కన్నా దారుణంగా తయారయ్యాయి. నిగనిగలాడే తారు రోడ్ల గుంతలు పడి రెండేళ్లయినా పట్టించుకోని ప్రభుత్వ వైఖరికి, అధికారుల నిర్లక్ష్యానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు నిండు ప్రాణం బలైంది. ఈ సంఘటన యద్దనపూడి మండలంలో బుధవారం ఉదయం జరిగింది. యద్దనపూడి నుంచి పర్చూరు వెళ్లే రోడ్డులో యద్దనపూడి గ్రామశివార్లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మండలంలోని పోలూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తాళ్లూరి వినోద్‌కుమార్ (37) మృతి చెందారు. అతను ఉమ్మడి ప్రకాశం దర్శి నియోజకవర్గం కురిచేడు మండలం అలవలపాడు ఎంపీపీ ప్రాథమిక స్కూలులో సెకండరీ గ్రేడ్‌టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమార్‌కు భార్య స్వప్న, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రమాదం జరిగిందిలా..

పోలూరు గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ ఉద్యోగరీత్యా పెద దర్శిలో నివాసం ఉంటున్నారు. అతను ఎన్నికలు నిమిత్తం పోలూరు గ్రామానికి ఓటు వేయడానికి తన ఇద్దరు కుమారులతో వచ్చారు. అనంతరం సెలవులు కావడంతో అడపాదడపా పెదదర్శి వెళ్లి వస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఉదయం పెదదర్శి నుంచి ద్విచక్రవాహనంపై పోలూరు గ్రామానికి వస్తున్నారు. గత కొంత కాలంగా యద్దనపూడి నుంచి పర్చూరు వరకు ఉన్న తారురోడ్డు చాలా చోట్ల గుంతలు పడి పూర్తిగా దెబ్బతిన్నది. ఈ విషయాన్ని వినోద్‌కుమార్ గమనించలేదో ఏమోగానీ యద్దనపూడి గ్రామ పొలిమేర దాటిన తర్వాత పర్చూరు రోడ్డులో గుంతలలో అదుపు చేయలేక బైక్‌తో సహా రోడ్డుపై పడి పోయాడు. దాంతో వెంటనే అతని తల వెనుక భాగాన బలమైన దెబ్బ తగలడంతో విపరీతంగా రక్తస్రావం అయింది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ విషయాన్ని అటుగా వెళ్తున్న కొంతమంది ద్విచక్రవాహనదారులు గమనించి పర్చూరు 108కి సమాచారం ఇచ్చారు. అంతేగాకుండా ఈ ప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి 5 కి.మీ. దూరంలో ఉన్న పోలూరు గ్రామం నుంచి బంధువులు సంఘటనా స్థలానికి వచ్చారు. ఈ ప్రమాదంపై సమాచారం అందడంతో ఎస్ఐ జీవీఎస్.చౌదరి సిబ్బందితో వచ్చారు. అయితే అప్పటికే అతను చనిపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వినోద్ సోదరుడు సామ్యేలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టు మార్టమ్ చేయించగా సాయంత్రం బంధువులు మృతదేహాన్ని పోలూరు గ్రామానికి తీసుకు వెళ్లారు.

ఘటనపై స్పందించిన ఎస్ఐ

రోడ్డుపై భారీగా గుంతలు ఉండడంతో ఉపాధ్యాయుడు మృతి చెందడం, కుటుంబ యజమానికి కోల్పోవడంపై ఎస్ఐ జీవీఎస్.చౌదరి ఆవేదనకు గురయ్యారు. మరోసారి ఈ రోడ్డుపై ఘటన జరుగకుండా ఉండేలా మార్టూరు మండలంలోని కోలలపూడి, వలపర్ల గ్రావెల్ క్వారీల నుంచి టిప్పర్లతో గ్రావెల్‌ను తెప్పించి కి.మీ పైగా గుంతల్లో మట్టిని పోసి చదును చేయించారు.

విద్యాదీవెన ఫీజులు కాలేజీలకు చెల్లించాలి

● డీడీ లక్ష్మానాయక్



మాట్లాడుతున్న డీడీ లక్ష్మానాయక్

ఒంగోలు నగరం, మే 22: రాష్ట్ర ప్రభుత్వం విద్యాదీవెన పథకం కింద తల్లుల ఖాతాలకు విడుదల చేసిన ఫీజు సొమ్మును సంబంధిత కళాశాలలకు చెల్లించేలా వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.లక్ష్మానాయక్ పేర్కొన్నారు. బుధవారం విద్యాదీవెన, వసతిదీవెన పథకాలపై ఆయన ఒంగోలులోని అంబేద్కర్‌భవన్‌లో జిల్లాలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, కళాశాలల కో ఆర్డినేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లక్ష్మానాయక్ మాట్లాడుతూ జిల్లాలో డిగ్రీ ఆపైన చదువుతున్న ఎస్సీఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం విద్యార్థులకు 2013-14 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యాదీవెన, వసతిదీవెన లబ్ధి చేకూరేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పథకాలకు సంబంధించిన జాయింట్ బ్యాంకు ఖాతాలు అప్‌డేట్ కాలేదో గుర్తించి వాటిని వెంటనే ఆ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యాదీవెన కింద విడుదలైన ఫీజు నగదును ఆయా కళాశాలలకు జమ చేయని తల్లులకు నోటీసులు జారీ చేయాలన్నారు. ఈ నోటీసులను నవశకం లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని తల్లులకు అందజేయాలని చెప్పారు. గడచిన త్రైమాసకం వరకు విడుదలైన నిధులను కళాశాలలకు చెల్లించని తల్లులకు వారి ఖాతాలకు ప్రభుత్వం జమ చేసిన ఫీజు సొమ్మును చెల్లించేలా కౌన్సిలింగు నిర్వహించాలని ఆదేశించారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన దరఖాస్తుల వెరిఫికేషన్‌ను వెంటనే పూర్తి చేసి నవశకం లాగిన్‌లో కారణాలను అప్‌డేట్ చేయాలని కోరారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యాదీవెన ఫీజులను నేటికీ కళాశాలలకు జమ చేయని తల్లులను గుర్తించి వారి వివరాలను సెక్రటరీయేట్ నవశకం లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్‌పీసీఐ పెండింగ్‌లో ఉన్న ఎస్సీ విద్యార్థుల ఆధార్ వివరాలను బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేయాలన్నారు. విద్యాదీవెన, వసతిదీవెన విద్యార్థులకు సకాలంలో అందేలా నిర్ణీత సమయంలో అప్‌డేట్ చేయని అధికారులపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అధికారులు ఉదయశ్రీ, దానయ్య, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పశువైద్య సేవలను సక్రమంగా అందించాలి

● జేడీఏ బేబీరాణి



శిక్షణ పూర్తి చేసుకున్న పశుసంవర్థక సహాయకులతో జేడీఏ బీబీరాణి

ఒంగోలు(కలెక్టరేట్), మే 22: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అందుబాటులో ఉండి పశువులకు అవసరమైన పశువైద్య సేవలను అందించాలని జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ కె.బేబీరాణి పేర్కొన్నారు. ఇటీవల నియమితులైన 62మంది పశుసంవర్థక సహాయకులకు 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. బుధవారం ఒంగోలులోని డీఎల్‌డీఏ సమావేశపుహాలులో జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో బేబీరాణి మాట్లాడారు. పశుసంవర్థకశాఖలో ఉద్యోగం రావడం అభినందనీయమన్నారు. రైతులకు మంచి సేవలు అందించే అదృష్టం సహాయకులకు దక్కిందని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణలో నైపుణ్యం చూపించిన పశువైద్య సహాయకులు ఎస్.రవి, సీహెచ్.నీరజ, ఎస్కే.తస్లీం, పి.శివప్రసాద్‌లకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి డాక్టర్ షేక్ కాలేషా, ఉపసంచాలకులు రమేష్‌బాబు, శిక్షణ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, రిసోర్స్‌పర్సన్స్ బసవ శంకరరావు, నాగభూషణం, పశువైద్యులు సాంబశివరావు, సాహితీ, స్వాతి, డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దామచర్ల పూర్ణచంద్రరావు తదితరులు

'రావిపాటి'కి ఘన నివాళి

కొండపి, మే 22 : మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు, శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉపాసకులు రావిపాటి మధుసూదనరావు ప్రథమ వర్ధంతిని బుధవారం చోడవరంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు టీడీపీ నాయకులు, ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారిలో సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు, హర ఎక్స్‌పోర్ట్స్ అధిపతి పోతినేని హరిప్రసాద్, గొర్రెపాటి రామయ్య చౌదరి, పోకూరి రవీంద్రబాబు, ఈదర ప్రభాకర్, రావెళ్ల వెంకట రఘునాథ్‌బాబు, నన్నూరి సుబ్బరామయ్య, ముప్పరాజు శ్రీనివాసరావు, జీఆర్‌కెహెచ్ ప్రసాద్, రావిపాటి బాలకృష్ణ, మధుసూదనరావు కుమారుడు లక్ష్మీ నరసింహచౌదరి తదితరులు ఉన్నారు.

ఇలవర మాజీ సర్పంచ్ చిన్నమ్మ మృతి



బొడ్డపాటి చిన్నమ్మ

కొండపి, మే 22 : మండలంలోని ఇలవర (నేతివారిపాలెం) గ్రామ మాజీ సర్పంచ్ బొడ్డపాటి చిన్నమ్మ (91) వయోభారంతో బుధవారం మృతి చెందారు. ప్రస్తుత టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమందనాయుడికి తల్లి అయిన ఆమె 2001లో ఇలవర సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. స్వగృహంలో ఉంచిన చిన్నమ్మ భౌతికకాయాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు, ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్యచౌదరి, మండలంలోని పలుగ్రామాల టీడీపీ, ఇతర నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థులకు వివిధ పోటీలు



కథలు చదువుతున్న విద్యార్థి

టంగుటూరు, మే 22 : టంగుటూరు విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి గ్రంథపాలకుడు వర్ధనరాజు బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఉంచుకోకుండా విజ్ఞాన కేంద్రానికి పంపించాలని కోరారు.

అవీ..ఇవీ..

జిల్లాకు చేరిన 1,185 సర్వీసు ఓట్లు



సర్వీసు ఓట్లను పరిశీలిస్తున్న ఝాన్సీలక్ష్మి, నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), మే 22: ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 1,185 సర్వీసు ఓట్లు జిల్లాకు వచ్చాయని జిల్లా పోస్టల్ ఓటింగ్ పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ కె.ఝాన్సీలక్ష్మి తెలిపారు. బుధవారం జిల్లాకు చేరిన సర్వీసు ఓట్లను రాజకీయ పక్షాల సమక్షంలో ప్రత్యేక బాక్సులో వేశారు. రిజిస్టర్ పోస్టు ద్వారా ఒంగోలు పార్లమెంట్‌కు సంబంధించి వచ్చిన సర్వీసు ఓట్లను లెక్కించి ప్రత్యేక బాక్సులో వేస్తున్నట్లు ఆమె చెప్పారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో సర్వీసు ఓట్లు 132 ఉండగా ఒంగోలు ఆర్డీవో కార్యాలయానికి బుధవారం మూడు ఓట్లు వచ్చాయన్నారు. ఏ రోజుకు ఆ రోజు వచ్చే సర్వీసు ఓట్లను ప్రత్యేకంగా భద్రపరుస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాజకీయపార్టీల ప్రతినిధులు క్రాంతికుమార్, రసూల, బి.రాజశేఖర్, రమణారెడ్డి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి సింహవాహన సేవ

మద్దిపాడు, మే 22: మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం స్వామి వారికి సింహవాహన సేవ, రాత్రికి హనుమద్వాహన సేవలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, రాజశేఖర్‌అయ్యంగార్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు జరిగాయి. దేవస్థాన కార్యనిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి



జీవాలకు టీకాలు వేస్తున్న డాక్టర్ రమేష్‌బాబు, సిబ్బంది

మద్దిపాడు, మే 22: పశువుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశుగణాభివృద్ధి శాఖ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం ఘడియపూడి కాలనీలో జీవాలకు గొంతు వాపు వ్యాధి రాకుండా టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు, జీవాల్లో టీకాలు రోగనిరోధక శక్తి పెంచుతుందన్నారు. టీకాల కార్యక్రమం బుధవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు జరుగుతుందని చెప్పారు. డాక్టర్ కాలేషావలి మాట్లాడుతూ పశువులకు వేసవికాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. ఏడీఏ సుగన్యారావ్ మాట్లాడుతూ టీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీవారిని దర్శించుకున్న మాగుంట



ఆలయం వద్ద మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), మే 22: ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆయన వెంట కుటుంబ సభ్యులు ఉన్నారు.

టీడీపీ నాయకుడికి బీఎన్ నివాళి

నాగులుప్పలపాడు, మే 22: కనపర్తి గ్రామంలో అనారోగ్యంతో మరణించిన టీడీపీ నాయకుడు కుక్కల వెంకటనారాయణరెడ్డి మృతదేహానికి బుధవారం కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి నివాళులర్పించారు. మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, టీడీపీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, ఏడుగుండ్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ చాట్ల నారాయణ, కుక్కల నాగార్జునరెడ్డి, అయ్యప్పరెడ్డి, చిన్నంగారి శ్రీను, గుమ్మవేణు, దేవరపల్లి సురేష తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘ నాయకుల హర్షం



మాట్లాడుతున్న సంజీవ్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 22: జనసేన పార్టీ అధినేత కె.పవన్‌కల్యాణ్‌కు ఐక్యరాజ్యసమితిలో మాట్లాడేందుకు ఆహ్వానం రావడం అత్యంత అరుదైన అవకాశమని కాపు సంఘం నాయకులు పేర్కొన్నారు. ఒంగోలు నగరం రామనగర్‌లో బుధవారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సంజీవకుమార్ మాట్లాడుతూ ఉన్నతమైన వ్యక్తిత్వం గల పవన్‌కళ్యాణ్ ఐక్యరాజ్యసమితిలో మాట్లాడేందుకు అవకాశం దక్కటం అభినందనీయమని చెప్పారు. ప్రజలకు తోడుగా ఉండి దేశ ప్రగతికి తోడ్పాటు అందించేందుకు ఆయన ఎప్పుడూ ముందు ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.రామ్‌రాజ్‌కుమార్, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, తంజావూరు శ్రీనివాసమూర్తి, పాలెం సురేష్‌బాబు, బండారు శ్రీనివాసరావు, ముత్యాల నాగేశ్వరరావు, సుబ్బయ్య, చెన్నంశెట్టి శివ, పోకల రాంబాబు, తాటి ఆంజనేయులు, రావెళ్ళ వెంకట్రావు, శనగల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీప్రతిభ విద్యార్థికి ఉత్తమ ర్యాంకు



వెంగలసురేంద్రబాబును అభినందిస్తున్న చైర్మన్ వెంకటేశ్వర్లు

ఒంగోలు(విద్య), మే 22 : రాష్ట్రంలోని ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఆర్‌డీసీ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీప్రతిభ విద్యాసంస్థల విద్యార్థి గుమ్మా వెంగలసురేంద్రబాబు రాష్ట్రస్థాయిలో 51వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కాలేజీలో సురేంద్రబాబును చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ సీతారామాంజనేయులు, సీఈవో జయప్రకాష్‌నారాయణ అభినందించారు.

1లోపు దరఖాస్తులు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), మే 22: వెంకటగిరిలోని శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ టెక్నాలజీలో మూడు, రెండు సంవత్సరాల(లేటరల్ ఎంట్రీ) హ్యాండ్లూమ్ అండ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమో కోర్సులో ప్రవేశం కోసం వచ్చేనెల 1వతేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ వి.భీమయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. వివరాలకు 9399936872, 9866169908 సెల్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు డీఈఈసెట్ పరీక్ష

ఒంగోలు(విద్య), మే 22: ప్రభుత్వ డైట్ కళాశాలలు, ప్రైవేటు డీఈడీ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న డీఈఈసెట్ ప్రవేశపరీక్ష శుక్రవారం ఒంగోలు సౌత్ మామిడిపాలెంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ద చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా భవన్‌లో జరుగుతుందని డీఈవో సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షకు సంబంధించి ఏమైనా సవరణలు ఉంటే ముందుగా డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. జిల్లాలో 64 మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నారని వెల్లడించారు. వివరాలకు 8125264606 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

హనుమంతవాహనంపై వేణుగోపాలస్వామి

నాగులుప్పలపాడు, మే 22 : ఉప్పుగుండూరు గ్రామంలో వెంచేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజు బుధవారం రాత్రి హనుమంతవాహనంపై శ్రీరామమూర్తి అవతారంలో దర్శనమిచ్చారు. పురవీధుల్లో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈవో శ్రీనివాసరావు, చైర్మన్ పెంట్యాల శ్రీనివాసరావు, అర్చకులు శ్రీధర్‌బాబు, వేణు, సుబ్బారావు పర్యవేక్షించారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి



కథ చెబుతున్న చిన్నారి

కొండపి, మే 22: వేసవి శిక్షణలో భాగంగా బుధవారం కొండపి గ్రంథాలయం ఆవరణలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు.

అమెరికావాసులకు బాలిక దత్తత



అమెరికాకు చెందిన దంపతులకు బాలికను దత్తత ఇస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు నగరం, మే 22: పుట్టిన వెంటనే తల్లి ఆ శిశువును పురిట్లోనే వదిలేసి వెళ్లిపోయింది. ఇన్నేళ్లు ప్రభుత్వం ఒంగోలులో ఏర్పాటు చేసిన శిశుగృహే ఈ పాపకు తల్లీదండ్రి అయ్యింది. శిశుగృహను నిర్వహించే స్త్రీశిశుసంక్షేమశాఖ అధికారులే ఆ పాపకు నవ్వ అనే పేరు పెట్టారు. ఐదేళ్లపాటు ఇక్కడే పెరిగిన ఈ బాలిక నేడు అమెరికా దేశపౌరురాలిగా మారనుంది. నేడు ఆ బాలికకు ఓనీడ దొరికింది. కన్నబిడ్డలా చూసుకునే తల్లిదండ్రులు ఆ బాలికకు సొంతమయ్యారు. హైదరాబాద్‌కు చెందిన అజయ్‌గోపి, మృదులప్రియదర్శిని అమెరికాలోని జార్జియ రాష్ట్రంలో స్థిరపడిపోయారు. సొంతంగా సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టుకుని చాలాకాలంగా అ క్కడే ఉండిపోయారు. తమకు పిల్లలు లేరనే బాధలేకుండా సొంత తెలుగు గడ్డపై పుట్టిన బాలికనే దత్తత తీసుకోవాలని ఆ దంపతులు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వానికి దత్తత కోసం దరఖాస్తు చేసుకోగా దత్తత ప్రక్రియ అంతా పూర్తి చేసి బుధవారం ఆ బాలికను జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా అమెరికా దంపతులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ మాధురి, జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు లేని బైక్‌లు స్వాధీనం



కె.ఉప్పలపాడులో స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లతో సీఐ, ఎస్సై, సిబ్బంది

కొండపి, మే 22 : మండలంలోని కె.ఉప్పలపాడులో బుధవారం సీఐ పాండురంగారావు ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 10 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా గ్రామంలోని కూడలిలో సీఐ మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొండపి, మర్రిపూడి, పొన్నలూరు ఎస్సైలు కృష్ణబాజీబాబు, బసవరాజు, రాజేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గరికమెట్లలో

చీమకుర్తి : చీమకుర్తి పట్టణపరిధిలోని గరికమెట్లలో బుధవారం సీఐ దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఎస్ఐ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



పృథులగిరిపై శాంతికల్యాణం నిర్వహిస్తున్న ఉభయదాతలు

మర్రిపూడి, మే 22 : లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు బుధవారం పృథులగిరిపై అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు నారాయణం వెంకట రమణాచార్యులు, ఆదిశేషాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి మూలవిరాట్‌కు తిరుమంజనసేవ చేశారు. అనంతరం స్వామివారికి 108 రజిత పుష్పాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఈసందర్భంగా ఉభయదాతలు పమిడిమర్రి కృష్ణమూర్తి, ఝాన్సీలక్ష్మి దంపతుల చేతులమీదుగా శాంతి కల్యాణం జరిపించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి : పట్టణంలోని వాసవి కళ్యాణమండపంలో నృశింహస్వామి జయంతి మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విఖానస సుధర్మసేవాసమితి ఆధ్వర్యంలో, టీటీడీ అర్చకుడు పరాంకుశం కృష్ణశాయి భట్టాచార్యుల పర్యవేక్షణలో వివిధ స్తోత్ర పారాయణ మహాయజ్ఞంను నిర్వహించారు.

గుర్తుతెలియని మృతదేహం

పీసీపల్లి, మే 22 : మండలంలోని మారెళ్ల సమీపంలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పీసీపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు... పీసీపల్లి నుంచి మారెళ్ల వెళ్లే మార్గంలో కంకరమిల్లు సమీపంలో మృతదేహం ఉంది. అతని శరీరంపై బ్లూ రంగు చొక్కా, తెలుపు, బ్లూ చారలు కలిగిన లుంగీ ధరించిన సుమారు 60సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని కనిగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు పీసీపల్లి పోలీసులకు(సెల్‌నెంబరు9121102213) సమాచారం ఇవ్వాలని కోరారు.

పాము కాటుతో వ్యవసాయ కూలీ మృతి

బల్లికురవ, మే 22 : మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో వ్యవసాయ కూలీ భూక్యా రమేష్‌నాయక్ (44) పాము కాటుతో మృతి చెందారు. బుధవారం కేసు నమోదు చేసిన్నట్లు ఏఎస్ఐ బండి శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొప్పెరపాడు ఎస్టీ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీ రమేష్‌నాయక్ పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం పొలం వెళ్లి పశువులకు పచ్చి మేత తెస్తుండగా పాము కాటు వేసింది. ఇవేమి పట్టించుకోని అతను బైకుపై మేత తీసుకొని ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో ఒక్కసారిగా నురగులు కక్కుతూ పడిపోయాడు. వెంటనే బంధువులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలోపే మృతి చెందారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. రమేష్ నాయక్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

వేటపాలెం(చీరాలటౌన్), మే 22 : ద్విచక్ర వాహనం, స్కూటీ ఢీకొన్న ఘటనలో ఎక్స్ సర్వీస్ ఉద్యోగి పరిస్థితి విషమంగా ఉండగా, మరో ఇద్దరు తీవ్ర గాయలతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన బుధవారం వేటపాలెం మండలం అక్కాయిపాలెం సమీపంలోని జాతీయ రహదారిలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం చీరాల పాపరాజు తోటకు చెందిన విన్నకోట శ్రీకాంత్ అదే ప్రాంతంలోనే నెట్‌సెంటర్ నడుపుతుంటారు. అలాగే కొత్తపేటకు చెందిన కేలా శ్రీకాంత్ కూలి పనులు చేస్తుంటాడు. వీరిద్దరూ ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. బాపట్ల మండలం బేతపూడి గ్రామానికి చెందిన కావూరి సుబ్బారెడ్డి ఇటీవల ఆర్మీ సర్వీసు ముగించుకుని స్వగ్రామం వచ్చారు. ఇతను స్కూటీపై ఒంగోలు వైపు నుంచి చీరాల వస్తున్నారు. ఈ క్రమంలో రెండు వాహనాలు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. దీంతో స్థానికులు 108లో క్షతగాత్రులను చీరాల ఏరి యా వైద్యశాలకు తరలించారు. అయితే ఎక్స్ ఆర్మీ సుబ్బారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. మిగిలిన ఇద్దరు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరో ఇద్దరికి గాయాలు ● కనిగిరి సమీపంలో డీసీఎం వ్యాన్, మినీ లారీ ఢీకొనడంతో ఘటన

కనిగిరి, మే 22 : ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్‌ను మినీ లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం కనిగిరి పట్టణ సమీపంలోని పామూరు హైవే రోడ్డుపై డిగ్రీ కళాశాల వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన రోజువారీ భవన నిర్మాణ కార్మికులు 15 మంది స్లాబ్ వేసేందుకు సామగ్రితో డీసీఎం వ్యాన్‌లో కనిగిరి వెళ్తున్నారు. అదేవిధంగా విజయవాడ నుంచి కనిగిరి మీదుగా కడప వైపు వెళ్తున్న మినీ లారీ వస్తుంది. ఈ క్రమంలో మినీ లారీ డ్రైవర్ కునుకు తీయటంతో రోడ్డుకు మరో వైపు ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ వెనుకు భాగాన్ని ఢీకొట్టింది. దీంతో వ్యాను వెనుక చక్రాలు ఊడి స్లాబ్ సామగ్రితో సహా తిరగబడింది. దీంతో అవన్నీ పైన పడడంతో ఉప్పు రమాదేవి(51) తీవ్ర గాయాలపాలైంది. స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందింది. అదేవిధంగా మాచవరం గ్రామానిక చెందిన సుశీలకు, మినీ లారీ డ్రైవర్ సురేష్‌కు గాయాలయ్యాయి. వీరిరువురు స్థానిక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు.



ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వైభవంగా లక్ష్మీనరసింహుని జయంతి

● అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

అద్దంకిటౌన్, మే 22 : శింగరకొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంతి మహోత్సవ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు స్వామివారిని విశేషంగా అలంకరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, కల్యాణం తిలకించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి ఎస్.కోటిరెడ్డి, పాలక మండలి చైర్మన్ ఎస్.కొండలరావు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులను కల్యాణ వేదిక వద్దకు తీసుకువస్తున్న భక్తులు

నేడు లక్ష తమలపాకుల పూజ

పౌర్ణమి సందర్భంగా గురువారం శింగరకొండలోని శ్రీప్రసన్నాంజనేయస్వామివారికి లక్ష తమలపాకుల పూజ వేదపండుతులు, అర్చకులచే జరుగుతుందని ఆలయ ఈవో టీ సుభద్ర బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 7:30 గంటల నుంచి పూజా కార్యక్రమం జరుగుతుందని భక్తులు అందరు పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి దర్శించుకోవాలని ఆమె కోరారు.

భక్తిశ్రద్ధలతో శాంతి కల్యాణం.

పంగులూరు : మండలంలోని రామకూరు గ్రామంలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి జయంతి వేడుకలు ఘ నంగా జరిగాయి. శ్రీ లక్ష్మీనృసింహ స్వామి వారి జయంతి సందర్భంగా బుధవారం ఆలయంలో పుణ్యాహవాచనం, అభిషేక కార్యక్రమం, శాంతి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి ఆత్మకూరి లక్ష్మీతులసిరావు నేతృత్వంలో శాస్త్రోక్తంగా జరిగిన జయంతి వేడుకలలో ఒంగోలు మున్సిపల్ మాజీ చైర్మన్ యక్కల తులసీరావు దంపతులు, యక్కల వంశస్థులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

పంట కాలువలో పూడికతీత!

పనులు చేయించిన ఉత్తర అమెరికా సంఘం ● మన గ్రామం.. మన బాధ్యత కింద అభివృద్ధి

నాట్స్ అధ్యక్షుడు బాపయ్యను సన్మానించిన గ్రామస్థులు

బల్లికురవ, మే 22 : వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేలా ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో పంట కాలువలలో పూడికతీ పనులు చేపట్టారు. మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన మాదాల రాజేంద్ర ఉత్తర అమెరికాలో స్థిరపడ్డారు. పలు సమస్యలను రైతులు నాట్స్ సంఘం దృష్టికి తీసుకు వెళ్లగా ఆ సంఘ అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరి మన గ్రామం.. మన బాధ్యత అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం గుంటుపల్లి గ్రామంలో పంట కాలువలో పూడిక తీత పనులను రైతుల సమక్షంలో చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఐ ఉద్యోగులు ఎక్కడ స్థిరపడినా పుట్టిన గ్రామాలపై మమకారం ఉంటుందన్నారు. తెలుగు సంఘం నాట్స్ ఆధ్వర్యంలో కొంత కాలంగా గ్రామీణ ప్రాంతాలలో సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. గుంటుపల్లి నుంచి కొత్తపాలెం వరకు సాగర్ నీరు వచ్చే పంట కాలువను అభివృద్ధి పరిచి 250 ఎకరాలకు సక్రమంగా నీరు అందిచేలా చర్యలు చేపట్టి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు. గతంలో కూడా రోడ్ల వెంబడి ఉన్న తుమ్మచెట్లను తొలగించామన్నారు. దేవాలయాల అభివృద్ధికి నిధులు అందించామన్నారు. ఈ సందర్భంగా గుంటుపల్లి గ్రామానికి వచ్చిన తెలుగు సంఘం అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరికి రైతులు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, గ్రామ పెద్దలు మాదాల సాంబయ్య, గొల్లపూడి పూర్ణయ్య, రైతులు పాల్గొన్నారు.



పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న నాట్స్ అధ్యక్షుడు బాపయ్య

కార్యకర్త కుటుంబానికి టీడీపీ సాయం

మేదరమెట్ల, మే 22 : రావినూతల గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త ఓరుగంటి వెంకట్రావు గత కొంతకాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతూ కిమోథెరపీ చేయించుకుంటున్నారు. బుధవారం రావినూతల తెలుగుదేశం పార్టీ నాయకులు లక్షా50వేల రూపాయలు వెంకట్రావుకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కారుసాల నాగేశ్వరరావు(బాబు), మోపర్తి లక్ష్మీనారాయణ, కారుసాల గురుబాబు, చెబ్రోలు నాగేశ్వరరావు, కారుసాల సుబ్బయ్య, అనుబ్రోలు ప్రభాకరరావు, రామినేని శ్రీనివాసరావు, కావూరి వరప్రసాద్‌రావు, పి న్నక రవి, కృష్ణపురపు ఆంజనేయులు, నాగూరి అంజనేయులు పాల్గొన్నారు.



వెంకట్రావుకు సాయమందిస్తున్న రావినూతల నాయకులు

అధికారులపై వివక్ష తగదు

కుల వివక్ష చూపుతూ బదిలీలు దారుణం

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

అద్దంకిటౌన్, మే 22 : ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ అధికారులపైనే వివక్ష పూరింతంగా వ్యహరిస్తూ వారిని మాత్రమే సస్పెండ్, బదిలీలు చేయడం దారుణమని, వాటిని ఆపాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు అన్నారు. బుధవారం అద్దంకి అంబేడ్కర్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం వారిని మాత్రమే బదిలీ చేయడం ఓసీ అధికారులను సమర్థిస్తున్నట్లు, వారిని వెనకేసుకొస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డి నివేదికలు పంపడం, సీఈసీ దానిని అమలు చేస్తూ విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. పల్నాడు కలెక్టర్ శివశంకర్‌ను ఏ తప్పు చేయకపోయినా కేవలం ఎస్సీ అనే భావనతో విధులకు దూరం చేయడం దుర్మార్గమని, దీనిని ఐక్య వేదిక ఖండిస్తుందని, వారిని వెంటనే విధులలోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్.నాగేశ్వరరావు, జె.శ్రీమన్నారాయణమూర్తి, రాధాకృష్ణమూర్తి, బుజ్జిబాబు, హనుమంతరావు, విశ్వతేజ పాల్గొన్నారు.

ఎగ్‌బాకింది..!

కొండెక్కిన కోడిగుడ్ల ధరలు

ఒక్కోటి హోల్‌సేల్ రూ.6, రిటైల్ రూ.8

బెంబేలెత్తుతున్న సామాన్యులు

పామూరు, మే, 22 : మార్కెట్‌లో మటన్, చికెన్ ధరలు ఆకాశన్నంటాయి. సామాన్యులకు అందుబాటులో ఉండే కోడిగుడ్డు సైతం ప్రియంగా మారింది. నిన్న మొన్నటి వరకు ఒక్కో గుడ్డు ధర రూ.5 పలికగా, నేడు రూ.8కి ఎగబాకింది. ఎండా కాలం కావడంతో కోళ్ల ఉత్పత్తి ఆశాజనకంగా లేకపోవడం, వలన సరఫరా తగ్గి, డిమాండ్ పెరిగింది. తీవ్రంగా కాస్తున్న ఎండల వల్ల కోళ్లు చనిపోతున్నాయని, దాంతో చికెన్ ధర పెరిగిందని, అదేవిధంగా కోడిగుడ్డు ధర కూడా పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం 30 కోడి గుడ్లు రూ.180 ధర పలుకుతోంది. హోల్‌సేల్‌గా ఒక కోడిగుడ్డు రూ.6 కాగా, రిటైల్ ధర రూ.8 వరకు ఉంది. కోడిగుడ్డు ధరలు కూడా అందుబాటులో లేకపోవడంతో సామాన్యులు అల్లాడుతున్నారు.



నిద్రలో జారి కింద పడి వృద్ధుడు మృతి

వెలిగండ్ల, మే 22 : ప్రమాదవశాత్తు వృద్ధుడు నిద్రలో బెంచీ మీద నుంచి జారి కింద పడి మృతి చెందిన సంఘటన హుస్సేన్‌పురంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... హుస్సేన్‌పురానికి చెందిన ఈర్ల గురవయ్య(60) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. మంగళవారం సాయంత్రం రోడ్డు పక్కన రావి చెట్టు దగ్గర ఉన్న బల్లపై పడుకొని నిద్రిస్తున్న సమయంలో దొర్లి కింద పడటంతో తలకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతనిని కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

ఓట్ల లెక్కింపు అనంతరం అలజడులు సృష్టిస్తే చర్యలు : సీఐ

పామూరు, మే, 22 : ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని పామూరు సీఐ ఎం రామానాయక్ హెచ్చరించారు. స్పెషల్ పార్టీ పోలీసులతో పామూరులోని ఎర్రచేలు, అబ్దుల్‌కలాం సెంటర్, విరువూరు రోడ్ తదిత ర ఏరియాల్లో కార్డన్ సెర్చ్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడించే సమయంలో ఎలాంటి అలజడులు సృష్టించినా, బాణసంచా కాల్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల ఎస్ఐలు ఎం సైదుబాబు, ప్రేమ్‌కుమార్, శివ పాల్గొన్నారు. బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు నారాయణస్వామి దేవాలయ వార్షికోత్సవం

ముండ్లమూరు, మే 22 : మండలంలోని తూర్పుకంభంపాడు గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవతా మూర్తి నారాయణ స్వామి ఆలయం 8వ వార్షికోత్సవం గురువారం జరగనుంది. ఆలయం నిర్మించి ఎనిమిది సంవత్సరాలు కావటంతో గ్రామస్తులంతా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

13 ఎకరాల భూమిని దానం చేస్తున్న ఉన్నం సోదరులు

గ్రామంలో పుట్టి పెరిగి విజయవాడలో నివాసం ఉంటున్న ఉన్నం ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఉన్నం నరసింహారావు, రామాంజనేయులు తమకు సంబంధించిన గ్రామంలో ఉన్న 13 ఎకరాల భూమిని గ్రామంలోని దేవాతామూర్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు నిర్వాహకులు నరసింహారావు తెలిపారు. తాము అందజేస్తున్న భూమిని గ్రామంలో ఉన్న దేవతలకు వివిధ పండుగల సందర్భంగా పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహించేందుకు భూమి మీద వచ్చే కౌలును వినియోగించటం జరుగుతుందని తెలిపారు. దీంతో దేవతామూర్తులకు భూమి విరాళం అందజేసిన ఉన్నం సోదరులకు తూర్పు కంభంపాడు గ్రామం మొత్తం సన్మానిస్తున్నారు.

నేడు మారెళ్లలో అంకాళమ్మ జాతర

ముండ్లమూరు, మే 22 : మండలంలోని మారెళ్లలో వేంచేసి ఉన్న గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారి 61వ జాతర మహోత్సవం గురువారం జరగనుంది. ఈ జాతరకు ఆలయం ముస్తాబైంది. ప్రతి ఏడాది మే నెలలో జాతర వస్తుంది. భక్తులు, గ్రామానికి చెందిన బంధువులు, ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు జాతరకు రెండు రోజుల ముందుగానే మారెళ్ల చేరుకోవటం ఆనవాయితీ. ఇప్పటికే గ్రామ మంతా భక్తులతో పండుగ వాతావరణం సంతరించుకుంది. దేవాలయాన్ని విద్యుత్ దీపాలంకరణలతో తీర్చిదిద్దారు. రెండు రోజుల నుంచి గణపతి పూజతో జాతర ప్రారంభమైంది. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయలేదు.

సర్వేను బాధ్యతగా నిర్వహించాలి

దొనకొండ, మే 22 : మండలంలో దివ్యాంగులను గుర్తించేందుకు వచ్చే నెల 9వ తేదీ వరకు నిర్వహించే సర్వేను నూరుశాతం పూర్తి చేసేలా బాధ్యతగా నిర్వహించాలని జిల్లా సర్వశిక్షా అభియాన్ ఏఎంవో, ఐఈ కో-ఆర్డినేటర్ ఎం రమేష్‌బాబు సూచించారు. మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల సర్వేను ఆయన బుధవారం తనిఖీ చేశారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రంలో మండల సీఆర్‌పీలతో సమావేశం ఏర్పాటు చేసి ఓఎస్‌సీ సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. సకాలంలో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. మండలానికి మంజూరైన విద్యాకానుక స్టాక్‌ను పరిశీలించారు. పాఠశాలలకు పంపిణీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 షేక్ అమీర్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

25 నుంచి మండల స్థాయి కబడ్డీ పోటీలు

దొనకొండ, మే 22 : మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా దొనకొండ ఒబ్బాపురం అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ నుంచి మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ టీడీపీ తెలుగు యువత కార్యదర్శి కుందుర్తి లక్ష్మణ్ తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండవ బహుమతిగా రూ.10 వేలు, మూడవ బహుమతిగా రూ.7వేలు నగదు బహుమతితో పాటు, విన్నర్స్, రన్నర్స్, మ్యాన్ ఆఫ్‌ది సీరీస్, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌లకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 24వ తేదీ సాయంత్రం లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 8008045401 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

మీసేవా సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు

కనిగిరి, మే 22 : కనిగిరి పట్టణంలోని వివిధ మీసేవా సెంటర్లపై డీఎల్‌డీవో సాయికుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీ సేవా కేంద్రాల్లోని ఎంట్రీ రికార్డులను పరిశీలించారు. వివిధ రకాల సేవలకు వసూలు చేస్తున్న నగదు వివరాలను కష్టమర్ల నుంచి అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని రెండూ మీ సేవా కేంద్రాలు పనిచేయకపోవటంపై ఆరా తీశారు. అదేవిధంగా మీసేవా కేంద్రాల్లో అందించే సేవా రుసుం వివరాల పట్టికను ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రికార్డులు పొందుపరిచే విధానంపై వారికి తగు సూచనలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే కేంద్రాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ఇంకొల్లు, మే 22 : ఇంకొల్లులోని పావులూరురోడ్డులో ఉన్న పోలేరమ్మ ఆలయంలో చోరీ జరిగిన సంఘటన బుధవారం వెలుగు చూపింది. బుధవారం గుడికి కరి నాగేంద్రమ్మ అనే మహిళ శుభ్రం చేయడానికి వచ్చి చూడగా విగ్రహానికి ఉన్న వెండి, బంగారు వస్తువులు అపహరించినట్లు గుర్తించి ఆలయకమిటీ సభ్యులకు తెలిపింది. వీటి విలువ సుమారు రూ.2.20లక్షలు ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

పంప్‌బాయ్స్ కావలెను

■ సాయిరత్న ఫిల్లింగ్ స్టేషన్, ఒంగోలు, కర్నూలు రోడ్డు RTC బస్‌స్టాండ్ ప్రక్కన, పెట్రోలు బంకు నందు ఆయిల్ ఫిల్ చేయుటకు పంప్‌బాయ్స్ & గర్ల్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సెల్: 9177124567

AJO-183918

PLOTS FOR SALE

■ ప్లాట్ ఫర్ సేల్, నూతన వెంచర్స్ ఒంగోలు కార్పోరేషన్‌లో BMR అర్జున్ విల్లాస్ వెనుక, 100% క్లియర్ టైటిల్‌తో రెసిడెన్షియల్ ప్లాట్స్ అందుబాటులో... సంప్ర॥ సెల్: 89852 86627, 98497 60806

AJO-183725

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

ఆంధ్రజ్యోతి

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888

చీమకుర్తి : 96525 55752

చీరాల : 99859 21376

మార్కాపురం : 99859 21358

కందుకూరు : 97036 18697

కనిగిరి : 99854 11483

గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥

Asst-Cir-Manager. 9985411484



విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న
జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్, ఎంఈవో శ్రీనివాసరెడ్డి

విద్యాకానుక కిట్లు ప్రతిఒక్కరికీ అందాలి

పొదిలి, మే 22 : విద్యాకానుక కిట్లు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం. రమేష్ కోరారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యాకానుక కిట్లతోపాటు బుక్స్‌కూడా వస్తాయని, వాటిని ప్రతి ఒక్కరికి అందించాలని సూచించారు. అదే విధంగా మండలంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు వెంటనే రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా మండల శాఖాధికారుల పర్యవేక్షణలో సహితవిద్యా రిసోర్స్‌పర్సన్స్ ఆధ్వర్యంలో సర్వే జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం నాడు - నేడు, నిష్టకోర్సులు, సీడబ్ల్యూఎస్ఎన్ సర్వే, విద్యాంజలి రిజిస్ట్రేషన్‌లపై సీఆర్పీలతో రివ్యూమీటింగ్ నిర్వహించారు. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎం. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకులు శేషుకుమార్

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, మే 22: విజ్ఞానం పెంపుకోసం గ్రంథాలయాలు ఉపయోగించుకోవాలని శ్రీ సాధన డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.శేషకుమార్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి విద్యార్థులకు గణితంలో మెలుకువలు, ఏకాగ్రత, న్యూటన్ సిద్ధాంతాలు వివరించారు. గ్రంథ పాలకుడు జీవీ శివారెడ్డి విద్యార్థులకు కథలు చెప్పించటం, పుస్తకాలు చదివించటం, సమీక్ష చేయించటంతో పాటు చదరంగం నేర్పించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

గిద్దలూరు, మే 22 : గిద్దలూరులోని శాఖా గ్రంథాలయాలన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కె.ఆదిలక్ష్మి తనిఖీ చేశారు. 50 రూపాయలు డిపాజిట్ చేసి గ్రంథాలయంలోని పుస్తకాలను ఇంటికి తీసుకుని వెళ్ళి చదువుకుని తెచ్చి ఇచ్చే అవకాశం ఉందన్నారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంచుకోవచ్చని పేర్కొన్నారు. వారం రోజులుగా జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సందర్శించారు. కథలు చదివించడం, చెప్పించడం, రాయించడం, స్పోకెన్ ఇంగ్లీషు, ఆటలు నేర్చుకోవడంలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందచేశారు. ఈకార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, శిక్షణ శిబిరం ఫ్యాకల్టీలు పోలిరెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

పెద్ద దోర్నాల, మే 22: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం యోగా, నృత్యం, కథలు చదివించడం, వినిపించడం, కోకో వంటి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు సుబ్బారెడ్డి, యోగా మాస్టారు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న విద్యార్థులు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● ఆర్ఐవో సైమన్‌విక్టర్

ఒంగోలు(విద్య), మే 22: జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐవో) ఎ.సైమన్‌విక్టర్ ఆదేశించారు బుధవారం ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 43, ద్వితీయ సంవత్సరం వారికి 28 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 15,291 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7,075మంది మొత్తం 22,366 మంది హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలకు ఆయా కళాశాలల్లోని సీనియర్ లెక్చరర్లను, ప్రైవేటు కళాశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో అక్కడి ప్రిన్సిపాల్స్‌ను అదనపు చీఫ్ సూపరింటెండెంట్లుగా నియమించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. విద్యార్థుల జవాబుపత్రాల బండిళ్లను డిపాజిట్ ప్రక్రియలో ఏ మాత్రం తేడా వచ్చినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఆకట్టుకున్న పోలీసు బలగాల మాక్ డ్రిల్

మార్కాపురం, మే22: సార్వత్రిక ఎన్నికల అనంతరం జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ జరుగనుంది. ఇప్పటికే ఎన్నికల రోజున జరిగిన ఘర్షణలను దృష్టిలో పెట్టుకుని జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ జిల్లా వ్యాప్తంగా అల్లర్లు జరిగితే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియజేస్తూ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం సాయంత్రం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో పోలీసు బలగాలు నిర్వహించిన ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. ముందుగా పోలీసులే అల్లరి మూకల వేషధారణలో గొడవలు చేశారు. రాళ్లు విసరడం, పెట్రోల్ బాంబులు వేయడం, దుకాణాలు మూసివేయించడం తదితర సంఘ వ్యతిరేక కార్యకలాపాలు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ముందుగా హెచ్చరించడం, లాఠీచార్జ్ చేయడం, భాష్పవాయు గోళాలు ప్రయోగించడం, ఫైర్ ఇంజన్‌తో నీటిని కొట్టి మంటలు ఆర్పడం, కాల్పులకు దిగడం, చివరిగా గాయపడిన వారిని హుటాహుటిన అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించడం తదితర విన్యాసాలను కళ్లకు కట్టినట్లు చూపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) ఎమ్ఎస్ఎస్ అశోక్‌బాబు, మార్కాపురం డీఎస్పీ ఎం.బాలసుందరరావు, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, టౌన్, రూరల్ ఎస్సైలు అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వర్లు నాయక్, ఏఆర్, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అల్లరి మూకలకు హెచ్చరికగా ఫైరింగ్ చేస్తున్న పోలీసు బలగాలు



లాఠీచార్జి చేసి చెదరగొడుతున్న పోలీసులు



వాటర్ కేనన్‌తో గుంపును చెదరగొడుతున్న ఫైర్ సిబ్బంది

నృసింహుడికి ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, మే 22: స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆయలంలో నృసింహస్వామి జయంతి బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నృసింహ సుదర్శన చక్రానికి నరసింహస్వామికి పంచామృతాల అభిషేకం, అర్చనలు నిర్వహించారు. నమ్మాళ్వార్ తిరునక్షత్ర మహోత్సవం పురస్కరించుకుని చెన్నకేశవస్వామి, వికాస తరంగిణి మహిళా సభ్యుల ఆధ్వర్యంలో ప్రబంధ పారాయణం, భజనలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో నారసింహుడు



లక్ష్మీనరసింహస్వామి
ఉత్సవ విగ్రహాలను కొండపైకి తీసుకుని వెళుతున్న భక్తులు

వైభవంగా కల్యాణ మహోత్సవం

గిద్దలూరు, మే 22 : పట్టణంలోని కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో తిరునాళ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు బుధవారం ధ్వజారోహణ సేవ, అగ్నిసేవ నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను భక్తులు ఊరేగింపుగా కొండపైకి తీసుకుని వెళ్ళారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సత్యదేవునికి గజ వాహన సేవ

మార్కాపురం వన్‌టౌన్, మే 22: పట్టణంలోని 9వ వార్డులో వెలసియున్న శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అర్చకులు గౌరిశంకర శర్మ మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యదేవుని ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి గజ వాహనంపై నగరోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బాసాని సుధాకర్, కార్యదర్శి సుబ్బారావు, సహాయ కార్యదర్శులు నూనె రామిరెడ్డి, ఉమామహేశ్వరరావు, కోశాధికారి కామిశెట్టి సుధాకర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.



గజవాహనంపై సత్యదేవుడు

భక్తిశ్రద్ధలతో నరసింహస్వామి జయంతి

కొమరోలు, మే 21: స్థానిక శ్రీ నరసింహస్వామి దేవాలయంలో బుధవారం నరసింహస్వామి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ సమేత శ్రీ నరసింహ స్వామి కల్యాణ కార్యక్రమాన్ని అర్చకులు ఓరుగంటి సదాశివయ్య నిర్వహించారు. మండలంలోని భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదానాన్ని నిర్వహించారు. మండలంలోని తాటిచర్ల మోటు కొండపైన వెలసిన శ్రీ లక్ష్మీ సమేత ఉగ్రనరసింహస్వామి దేవాలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త తాటిచర్ల కుమారస్వామి తెలిపారు. స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా ఉదయం స్వామి వారికి పురుషసూక్తి, పంచామృత అభిషేకాలు, నూతన వస్త్ర అలంకరణ, నవగ్రహ, సుదర్శన హోమాలు దంపతులచే నిర్వహించారు. కార్యక్రమాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



విశేష అలంకరణలో లక్ష్మీనరసింహుడు




లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

పెద్దదోర్నాల, మే 22: స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జన్మదిన వేడుకలను బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు నరసింహస్వామిని సుందరంగా అలంకరించారు.అనంతరం లక్ష్మీదేవి అమ్మవారికి నరసింహస్వామికి కల్యాణం జరిపించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చినమస్తాదేవికి ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం, మే 22: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారి ఎదురుగా ఉన్న చిన్నమస్తాదేవికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినమస్తాదేవి అమ్మవారి జన్మదినం సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు పాలంక ప్రసాదశర్మ ఆధ్వర్యంలో ఎర్రగులాబీలతో పూజ, కూష్మాండ బలి కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది, మహిళా భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అర్చకులు ప్రసాద్



సంఘటనా స్థలం వద్ద ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్ఐ

లారీ, ట్రక్కు ఢీ ఇద్దరికి గాయాలు

మార్కాపురం రూరల్, మే 22: మండలంలోని నికరంపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై లారీ, బొలెరో ట్రక్కు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఐరన్ లోడ్‌తో కుంట వైపు లారీ వెళతుండగా అనంతపురం నుంచి అమరావతి జాతీయ రహదారిపై నికరంపల్లి వద్ద వంతెనపై బొలెరో ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో లారీ డ్రైవర్‌కు, బొలెరో ట్రక్ వాహనం నడుపుతున్న డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గాయాలైన ఇద్దరు డ్రైవర్లు స్థానిక సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలాన్ని మార్కాపురం రూరల్ ఎస్ఐ వెంకటేశ్వరనాయక్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మోటార్ వాహనాలతో పోలీసులు

గుడిమెట్టలో కార్డన్ సెర్చ్

గిద్దలూరు, మే 22 : రాచర్ల మండలం గుడిమెట్ట గ్రామంలో పోలీసులు ఆకస్మికంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని అన్ని ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరూ అల్లర్లకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని, ప్రజలందరూ కలిసిమెలసి ఉండాలని రూరల్ సీఐ దాసరి ప్రసాద్ సచించారు. అల్లర్లు చేసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్డన్ సెర్చ్‌లో రాచర్ల, కొమరోలు ఎస్సైలు హరిబాబు, మధుసూదన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం ,పక్కన మృతుడు వెంకటేశ్వర్లు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొనకనమిట్ల, మే 22 : మండలంలోని పెదారికట్ల బ్రహ్మంగారి గుడి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనచోదకుడు మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. అందిన వివరాల ప్రకారం పెదారికట్ల గ్రామానికి చెందిన రాచకుంట వెంకటేశ్వర్లు తన ద్విచక్రవాహనంపై పని నిమిత్తం చినారికట్ల గ్రామం వెళ్ళి వస్తుండగా ఎదురుగా గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్లు (32) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య కోటేశ్వరి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న కొనకనమిట్ల ఎస్ఐ మాధవరావు ఘటనా స్థలం చేరుకొని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాము కాటుతో వ్యవసాయ కూలీ మృతి

బల్లికురవ, మే 22 : మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో వ్యవసాయ కూలీ భూక్యా రమేష్‌నాయక్ (44) పాము కాటుతో మృతి చెందారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొప్పెరపాడు ఎస్టీ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీ రమేష్‌నాయక్ మంగళవారం సాయంత్రం పొలం వెళ్లి పశువులకు పచ్చి మేత తెస్తుండగా పాము కాటు వేసింది. ఇవేమి పట్టించుకోని అతను బైకుపై మేత తీసుకొని ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో ఒక్కసారిగా నురగలు కక్కుతూ పడిపోయాడు. వెంటనే బంధువులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలోపే మృతి చెందారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. రమేష్ నాయక్‌కు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మార్టూరులో రోటరీ కళా పరిషత్ నాటిక పోటీలు

27 నుంచి 29 వరకు నిర్వహణ

మార్టూరు, మే 22 : శ్రీకారం స్వచ్ఛంద సేవా సంస్థ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మార్టూరులో ఈ నెల 27, 28, 29వ తేదీలలో 14వ ఉభయ రాష్ట్రాల నాటికల పోటీలను మార్టూరు మద్ది సత్యనారాయణ కంపెనీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు శ్రీకారం సంస్థ అధ్యక్షుడు కందిమళ్ల సాంబ శివరావు, రోటరీ అధ్యక్షుడు తాళ్లూరి సాంబశివరావు తెలిపారు. అందుకు సంబంధించి బుధవారం స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో శ్రీకారం రోటరీ ప్రతినిధులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కందిమళ్ల సాంబశివరావు మాట్లాడుతూ మార్టూరులో రోటరీ కళా పరిషత్ నాటిక పోటీలను నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రోటరీ చరిత్రలోనే మార్టూరు రోటరీ కళా పరిషత్ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. రోటరీ ప్రజా సేవా కార్యక్రమాలతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించాలనే సదుద్దేశంతో కళా పరిషత్ నాటికల పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. దాదాపుగా 125 మంది కళాకారులు, సాంకేతిక నిపుణులతో ఈ నాటికల ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ పోటీలలో పాల్గొనే నాటికలలో ఉత్తమ ప్రదర్శన, ద్వితీయ ఉత్తమ ద్వితీయ ప్రదర్శన, తృతీయ ఉత్తమ ప్రదర్శన ప్రత్యేక ప్రదర్శనా బహుమతులతో పాటు 15 మంది కళా కారులకు వ్యక్తిగత బహుమతులను అందజేస్తామని తెలిపారు.

ప్రదర్శనకు ఎంపికైన నాటికలు

మూడు రోజులు జరగనున్న కళా పరిషత్ నాటికల పోటీలలో ప్రదర్శించడానికి 10 నాటికలను ఎంపిక చేశారు. నాటికల పోటీలు ప్రారంభం రోజున 27వ తేదీ సోమవారం రాత్రి మూడు నాటికలను ప్రదర్శిస్తారు. వాటిలో తొలుత శ్రీ అమృత లహరి ఆర్ట్స్ విజయవాడ వారిచే నాన్నా నేనొచ్చేస్తా నాటిక తరువాత తెలుగు కళా సమితి విశాఖ వారిచే నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక, అనంతరం కళా నికేతన్ వీరన్నపాలెం వారిచే రాజుగారి గోచీ నాటికను ప్రదర్శిస్తారు. ఇక 28 వతేదీ మంగళవారం రాత్రి మొదటిగా శ్రీకారం రోటరీ కళా పరిషత్ వారితో ప్రత్యేక ప్రదర్శనగా రైతు భారతం నాటికను ప్రదర్శిస్తారు. అనంతరం రసఝరి పొన్నూరు వారితో కాపలా నాటికను, తరువాత కళాంజలి హైదరాబాద్ వారిచే రైతే రాజు నాటికను, మైత్రి కళా నిలయం విజయవాడ వారిచే బంధం నాటికను ప్రదర్శిస్తారు. చివరగా 29 వతేదీ బుధవారం రాత్రి తొలుత అభినయ గుంటూరు వారిచే ఇంద్రప్రస్థం నాటిక, చైతన్య కళా భారతి కరీంనగర్ వారిచే చీకటి పువ్వు నాటిక, శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారితో కౌసల్యా సుప్రజారామ నాటిక, తరువాత వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారిచే రాత నాటికను ప్రదర్శిస్తారు. సమావేశంలో చెన్నుపాటి బసవరాములు, జాష్టి సాంబ శివరావు, రావి అంకమ్మ చౌదరి, దొడ్డా రమేష్, చెరుకూరి నాగేశ్వరరావు, షేక్ కాజా హుస్సేన్, ఇంటూరి ఆంజనేయులు, చెరుకూరి అంజిబాబు, ఎం.ఈశ్వర ప్రసాద్, గరిమిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కళా పరిషత్ నాటికల పోటీల
వివరాలను తెలియజేస్తున్న రోటరీ శ్రీకారం సభ్యులు

ప్రాణం తీసిన గుంతలు

బైకుపైనుంచి పడి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

యద్దనపూడి-పర్చూరు రోడ్డులో ఘటన

టీచర్ పనిచేసేది కురిచేడు మండలం అలవపాడులో..

యద్దనపూడి, (మార్టూరు) మే 22 : తారు రోడ్లు పల్లెల్లో ఉన్న డొంక రోడ్ల కన్నా దారుణంగా తయారయ్యాయి. నిగ నిగ లాడే తారు రోడ్లు గుంతలు పడి రెండేళ్లయినా పట్టించుకోని ప్రభుత్వ వైఖరికి, అధికారుల నిర్లక్ష్యానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు నిండు ప్రాణం బలైంది. ఈ సంఘటన యద్దనపూడి మండలంలో బుధవారం ఉదయం జరిగింది. యద్దనపూడి నుంచి పర్చూరు వెళ్లే రోడ్డులో యద్దనపూడి గ్రామ శివార్లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మండలంలోని పోలూరు గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తాళ్లూరి వినోద్ కుమార్ (37) మృతి చెందారు. అతను ఉమ్మడి ప్రకాశం దర్శి నియోజకవర్గం కురిచేడు మండలం అలవలపాడు గ్రామంలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో సెకెండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమార్‌కు భార్య స్వప్న, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రమాదం జరిగిందిలా..

పోలూరు గ్రామానికి చెందిన వినోద్ కుమార్ ఉద్యోగరీత్యా పెద దర్శిలో నివాసం ఉంటున్నారు. అతను ఎన్నికలు నిమి త్తం పోలూరు గ్రామానికి ఓటు వేయడానికి తన ఇద్దరు కుమారులతో వచ్చారు. అనంతరం సెలవులు కావడంతో అడపాదడపా పెద దర్శి వెళ్లి వస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఉదయం పెద దర్శి నుంచి ద్విచక్రవాహనంపై పోలూరు గ్రామానికి వస్తున్నారు. గత కొంత కాలంగా యద్దనపూడి నుంచి పర్చూరు వరకు ఉన్న తారు రోడ్డు చాలా చోట్ల గుంతలు పడి పూర్తిగా దెబ్బతిన్నది. ఈ విషయాన్ని వినోద్ కుమార్ గమనించలేదో ఏమోగానీ యద్దనపూడి గ్రామ పొలిమేర దాటిన తర్వాత పర్చూరు రోడ్డులో గుంతలలో అదుపు చేయలేక బైక్‌తో సహా రోడ్డుపై పడి పోయాడు. దాంతో వెంటనే అతని తల వెనుక భాగాన బలమైన దెబ్బ తగలడంతో విపరీతంగా రక్తస్రావం అయింది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ విషయాన్ని అటుగా వెళ్తున్న కొంత మంది ద్విచక్రవాహనదారులు గమనించి పర్చూరు 108కి సమాచారం ఇచ్చారు. అంతేగాకుండా ఈ ప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి 5 కి.మీ. దూరంలో ఉన్న పోలూరు గ్రామం నుంచి బంధువులు సంఘటనా స్థలానికి వచ్చారు. ఈ ప్రమాదంపై సమాచారం అందడంతో ఎస్ఐ జీవీఎస్ చౌదరి సిబ్బందితో వచ్చారు. అయితే అప్పటికే అతను చనిపోవడంతో మృతదేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వినోద్ సోదరుడు సామ్యేలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టు మార్టమ్ చేయించగా సాయంత్రం బంధువులు మృతదేహాన్ని పోలూరు గ్రామానికి తీసుకు వెళ్లారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ (ఇన్‌సెట్లో ఉపాధ్యాయుడు తాళ్లూరి వినోద్‌కుమార్ (ఫైల్)

ఘటనపై స్పందించిన ఎస్ఐ

రోడ్లపై భారీగా గుంతలు ఉండడంతో ఉపాధ్యాయుడు మృతి చెందడం, కుటుంబ యజమానికి కోల్పోవడంపై ఎస్ఐ జీవీఎస్ చౌదరి ఆవేదనకు గురయ్యారు. వెంటనే స్పందించారు. మరోసారి ఈ రోడ్డుపై ఘటన జరుగకుండా ఉండేలా మార్టూరు మండలంలోని కోలలపూడి, వలపర్ల గ్రావెల్ క్వారీల నుంచి టిప్పర్లతో గ్రావెల్‌ను తెప్పించి గుంతలను పూడ్చివేయించారు. కిలో మీటర్‌కు పైగా గుంతల్లో మట్టిని పోసి చదును చేయించారు.

చెత్త సంపద కేంద్రాలు.. అలంకారప్రాయం

● గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానం
● మరుగునపడిన చెత్త రిక్షాలు
● పట్టించుకోని అధికారులు

తాళ్లూరు, మే 22 : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు ప్రభుత్వాలు లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. గ్రీన్‌అంబాసిడర్లకు కొన్ని నెలలుగా జీతాలు చెల్లించకపోవటంతో వారు విధులకు దూరంగా ఉన్నారు. చెత్త సేకరించేందుకు పంచాయతీలకు కేటాయించిన రిక్షాలు తుప్పుపడుతున్నాయి. పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.


డంపింగ్‌కేంద్రాల వద్ద పేరుకుపోతున్న చెత్త నిల్వలు

గత టీడీపీ ప్రభుత్వ కాలంలో చెత్తసంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో రోజువారీ విడుదలయ్యే చెత్తను సేకరించి ఆ కేంద్రాలకు తరలించాలన్నది లక్ష్యం. మండలంలోని 16 పంచాయతీలలో ఆ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పాలకులు పట్టించుకోకపోవడంతో కొంతకాలంగా గ్రామాల్లో రోడ్ల వెంట, చెత్త సంపద తయారీ కేంద్రాల వద్ద చెత్త కుప్పలుకుప్పలుగా పేరుకుపోయింది. తాళ్లూరులోని చెత్త సంపద తయారీ కేంద్రం నామరూపాలు కూడా కన్పించటం లేదంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. మిగిలిన కొన్ని గ్రామాల్లో ఆ కేంద్రాలకు చెత్త సేకరణ నామమాత్రంగా జరుగుతోంది.

ఘనవ్యర్థాల నిర్వహణ ద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని వృద్ధి చేసేందుకు, ఓడీఎస్ గ్రామాలుగా తీర్చిదిద్ది ప్రభుత్వ ప్రోత్సాహం పొందేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. హరిత రాయబారులకు వేతనాలు చెల్లించకపోవటంతో విధులకు రావటం మానేశారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ప్రజలు వాపోతున్నారు.

ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన చెత్తసంపద తయారీ కేంద్రాల్లో ఒక్క కేంద్రం నుంచి ఎరువు తయారు చేసిన దాఖలాలు


మాధవరంలో అలంకారప్రాయంగా చెత్తసంపద కేంద్రం

లేవు. ఆలాగే గృహాల నుంచి రోజువారీ విడుదలయ్యే చెత్తను ఆ కేంద్రాలకు తరలించేందుకు ప్రభుత్వం పంచాయతీలకు రిక్షాలను అందజేసింది. చెత్తను వేసేందుకు ప్రతి ఇంటికి రెండుచొప్పున డబ్బాలు పంపిణీ చేసింది. గతంలో చెత్తను సేకరించిన హరిత రాయబారులు చెత్త ఎక్కడ వేయాలో తెలియక రోడ్ల వెంబడే పడవేసి వెళుతున్నారు. అన్ని గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకురాకపోవటంతో ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్తను, వ్యర్థపదార్థాలను పడవేస్తుండటంతో గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొంది. ప్రభుత్వ నిధులతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు వృథాగా పడిఉండటంతో అధికారుల తీరును ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. అధికారులు మాత్రం వీటిని వినియోగంలోకి తీసుకురావాలంటే ఖర్చుతో కూడుకున్న పని అని చేతులెత్తేస్తున్నారు. చెత్త తీసుకెళ్లే రిక్షాలు వాడకపోవటంతో తుప్పుబట్టిపోతున్నా పట్టించుకోవటం లేదు. ప్రభుత్వం స్పందించి అలంకారప్రాయంగా ఉన్న చెత్తసంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకరావాలని, తుప్పుపడుతున్న చెత్తతోలు రిక్షాలు వినియోగంలోకి తీసుకొచ్చి గ్రామాల్లో అపరిశుభ్రతలేకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎగ్‌బాకింది...!

కొండెక్కిన కోడిగుడ్ల ధరలు

ఒక్కోదాని ధర హోల్‌సేల్ రూ.6, రిటైల్ రూ.8

అల్లాడిపోతున్న సామాన్యులు

పామూరు, మే, 22 : మార్కెట్‌లో మటన్, చికెన్ ధరలు ఆకాశన్నంటాయి. సామాన్యులకు అందుబాటులో ఉండే కోడిగుడ్డు సైతం ప్రియంగా మారింది. నిన్న మొన్నటి వరకు ఒక్కో గుడ్డు ధర రూ.5 పలికగా, నేడు రూ.8కి ఎగబాకింది. ఎండా కాలం కావడంతో కోళ్ల ఉత్పత్తి ఆశాజనకంగా లేకపోవడం, వలన సరఫరా తగ్గి, డిమాండ్ పెరిగింది. తీవ్రంగా కాస్తున్న ఎండల వల్ల కోళ్లు చనిపోతున్నాయని, దాంతో చికెన్ ధర పెరిగిందని, అదేవిధంగా కోడిగుడ్డు ధర కూడా పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం 30 కోడిగుడ్లు రూ.180 ధర పలుకుతోంది. హోల్‌సేల్‌గా ఒక కోడిగుడ్డు రూ.6 కాగా, రిటైల్ ధర రూ.8 వరకు ఉంది. కోడిగుడ్డు ధరలు కూడా అందుబాటులో లేకపోవడంతో సామాన్యులు అల్లాడుతున్నారు.



25 నుంచి మండల స్థాయి కబడ్డీ పోటీలు

దొనకొండ, మే 22 : టీడీపీ వ్యవస్థాపకులు దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా దొనకొండ ఒబ్బాపురం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ నుంచి మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ టీడీపీ తెలుగు యువత కార్యదర్శి కుందుర్తి లక్ష్మణ్ తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండవ బహుమతిగా రూ.10 వేలు, మూడవ బహుమతిగా రూ.7వేలు నగదు బహుమతితో పాటు, విన్నర్స్, రన్నర్స్, మ్యాన్ అఫ్‌ది సీరీస్, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌లకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 24వ తేదీ సాయంత్రం లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 8008045401 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

నిద్రలో జారి కింద పడి వృద్ధుడు మృతి


గురవయ్య (ఫైల్)

వెలిగండ్ల, మే 22 : ప్రమాదవశాత్తు వృద్ధుడు నిద్రలో బెంచీ మీద నుంచి జారి కింద పడి మృతి చెందిన సంఘటన హుస్సేన్‌పురంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... హుస్సేన్‌పురానికి చెందిన ఈర్ల గురవయ్య(60) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. మంగళవారం సాయంత్రం రోడ్డు పక్కన రావి చెట్టు దగ్గర ఉన్న బల్లపై పడుకొని నిద్రిస్తున్న సమయంలో దొర్లి కింద పడటంతో తలకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతనిని కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

ఓట్ల లెక్కింపు అనంతరం అలజడులు సృష్టిస్తే చర్యలు


కార్డన్ సెర్చ్‌లో బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

పామూరు, మే, 22 : ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని పామూరు సీఐ ఎం రామానాయక్ హెచ్చరించారు. స్పెషల్ పార్టీ పోలీసులతో పామూరులోని ఎర్రచేలు, అబ్దుల్ కలాం సెంటర్, విరువూరు రోడ్ తదితర ఏరియాల్లో కార్డన్ సెర్చ్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల పలితాలు వెల్లడించే సమయంలో ఎలాంటి అలజడులు సృష్టించినా, బాణసంచా కాల్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల ఎస్ఐలు ఎం సైదుబాబు, ప్రేమ్‌కుమార్, శివ పాల్గొన్నారు. బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు నారాయణ స్వామి దేవాలయ వార్షికోత్సవం

ముండ్లమూరు, మే 22 : మండలంలోని తూర్పుకంభంపాడు గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవతా మూర్తి నారాయణ స్వామి ఆలయం 8వ వార్షికోత్సవం గురువారం జరగనుంది. ఆలయం నిర్మించి ఎనిమిది సంవత్సరాలు కావటంతో గ్రామస్తులంతా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

13 ఎకరాల భూమిని దానం చేస్తున్న ఉన్నం సోదరులు

గ్రామంలో పుట్టి పెరిగి విజయవాడలో నివాసం ఉంటున్న ఉన్నం ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఉన్నం నరసింహారావు, రామాంజనేయులు తమకు సంబంధించిన గ్రామంలో ఉన్న 13 ఎకరాల భూమిని గ్రామంలోని దేవాతామూర్తుల పేరిట రిజిష్ట్రేషన్ చేస్తున్నట్లు నిర్వాహకులు నరసింహారావు తెలిపారు. తాము అందజేస్తున్న భూమిని గ్రామంలో ఉన్న దేవతలకు వివిధ పండుగల సందర్భంగా పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహించేందుకు భూమి మీద వచ్చే కౌలును వినియోగించటం జరుగుతుందని తెలిపారు. దీంతో దేవతామూర్తులకు భూమి విరాళం అందజేసిన ఉన్నం సోదరులకు తూర్పు కంభంపాడు గ్రామం మొత్తం సన్మానిస్తున్నారు.

నేడు మారెళ్లలో అంకాళమ్మ 61వ జాతర

ముండ్లమూరు, మే 22 : మండలంలోని మారెళ్లలో వేంచేసి ఉన్న గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారి 61వ జాతర మహోత్సవం గురువారం జరగనుంది. ఈ జాతరకు ఆలయం ముస్తాబైంది. ప్రతి ఏడాది మే నెలలో జాతర వస్తుంది. భక్తులు, గ్రామానికి చెందిన బంధువులు, ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు జాతరకు రెండు రోజుల ముందుగానే మారెళ్ల చేరుకోవటం ఆనవాయితీ. ఇప్పటికే గ్రామ మంతా భక్తులతో పండుగ వాతావరణం సంతరించుకుంది. దేవాలయాన్ని విద్యుత్ దీపాలంకరణలతో తీర్చిదిద్దారు. రెండు రోజుల నుంచి గణపతి పూజతో జాతర ప్రారంభమైంది. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయలేదు.

దివ్యాంగుల సర్వేను బాధ్యతగా నిర్వహించాలి


విద్యాకానుక స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏఎంవో రమేష్‌బాబు

దొనకొండ, మే 22 : మండలంలో దివ్యాంగులను గుర్తించేందుకు వచ్చే నెల 9వ తేదీ వరకు నిర్వహించే సర్వేను నూరుశాతం పూర్తి చేసేలా బాధ్యతగా నిర్వహించాలని జిల్లా సర్వశిక్షా అభియాన్ ఏఎంవో, ఐఈ కో-ఆర్డినేటర్ ఎం రమేష్‌బాబు సూచించారు. మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల సర్వేను ఆయన బుధవారం తనిఖీ చేశారు. అనంతరం మండల విద్యా వనరుల కేంద్రంలో మండల సీఆర్‌పీలతో సమావేశం ఏర్పాటు చేసి ఓఎస్‌సీ సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. సకాలంలో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. మండలానికి మంజూరైన విద్యాకానుక స్టాక్‌ను పరిశీలించారు. పాఠశాలలకు పంపిణీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 షేక్ అమీర్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కనిగిరి సమీపంలో డీసీఎం వ్యాన్, మినీ లారీ ఢీ

ఈ ఘటనలో మరో ఇద్దరికి గాయాలు

కనిగిరి, మే 22 : ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్‌ను మినీ లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం పట్టణ సమీపంలోని పామూరు హైవే రోడ్డుపై డిగ్రీ కళాశాల వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన రోజువారీ భవన నిర్మాణ కార్మికులు 15 మంది స్లాబ్ వేసేందుకు సామగ్రితో డీసీఎం వ్యాన్‌లో కనిగిరి వెళ్తున్నారు. అదేవిధంగా విజయవాడ నుంచి కనిగిరి మీదుగా కడప వైపు వెళ్తున్న మినీ లారీ వస్తుంది. ఈ క్రమంలో మినీ లారీ డ్రైవర్ కునుకు తీయటంతో రోడ్డుకు మరో వైపు ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ వెనుకు భాగాన్ని ఢీకొట్టింది. దీంతో వ్యాను వెనుక చక్రాలు ఊడి స్లాబ్ సామగ్రితో సహా తిరగబడింది. దీంతో అవన్నీ పైన పడడంతో ఉప్పు రమాదేవి(51) తీవ్ర గాయాలపాలైంది. స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందింది. అదేవిధంగా మాచవరం గ్రామానికి చెందిన సుశీలకు, మినీ లారీ డ్రైవర్ సురేష్‌కు గాయాలయ్యాయి. వీరిరువురు స్థానిక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సంఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు.


రోడ్డు ప్రమాద ఘటనలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మీసేవా సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు

కనిగిరి, మే 22 : కనిగిరి పట్టణంలోని వివిధ మీసేవా సెంటర్లపై డీఎల్‌డీవో సాయికుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీ సేవా కేంద్రాల్లోని ఎంట్రీ రికార్డులను పరిశీలించారు. వివిధ రకాల సేవలకు వసూలు చేస్తున్న నగదు వివరాలను కష్టమర్ల నుంచి అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని రెండూ మీ సేవా కేంద్రాలు పనిచేయకపోవటంపై ఆరా తీశారు. అదేవిధంగా మీసేవా కేంద్రాల్లో అందించే సేవా రుసుం వివరాల పట్టికను ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రికార్డులు పొందుపరిచే విధానం, నమోదు వివరాల వంటి వాటిపై వారికి తగు సూచనలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే కేంద్రాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.


మీ సేవా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో సాయికుమార్

రబీలో పంట నష్టం వివరాలు సేకరించాలి

ఏడీఏ రమణ

కనిగిరి, మే 22 : రబీలో సాగు చేసి పంట నష్ట పోయిన వివరాలను సేకరించాలని ఏడీఏ ఈవీ రమణ చెప్పారు. స్థానిక ఏవో కార్యాలయంలో బుధవారం కనిగిరి మండల స్థాయి వ్యవసాయ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ లోటు వర్షపాతం దృష్ట్యా నియోజకవర్గంలోని 6మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినట్లు చెప్పారు. ఆ మేరకు రబీలో సాగు చేసి 33శాతం కన్నా అధికంగా నష్టపోయిన రైతుల జాబితా సిద్ధం చేయాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. గత రబీ సీజన్‌లో సాగు చేసిన జొన్న, మినుము, నువ్వులు, పొద్దుతిరుగుడు, పెసర, అలసంద, ఉలవ, ఆముదం పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. పంటను నష్టపోయిన రైతుల జాబితాలను ఈనెల 25వ తేదీలోపు సిద్ధం చేసి రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని చెప్పారు. 29వ తేదీన జిల్లా వ్యవసాయాధికారికి తుది జాబితాను నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఏవో జ్యోత్స్నాదేవి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీఏ రమణ

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న అధికారులు

దొనకొండ, మే 22 : విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్ విజయలక్ష్మీ సూచించారు. దొనకొండలోని గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు సుమతి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు కథలు చదవటం, కథలు చెప్పటం, దేశభక్తి గీతాలు పాడటం తదితర పోటీలను బుధవారం నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు లెక్చరర్ విజయలక్ష్మీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో అనేక రకాల కథల పుస్తకాలు, విజ్ఞానానికి సంబంధిచి అనేక రకాల పుస్తకాలు ఉంటాయని, వాటిని ఉపయోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

అంగరంగ వైభవంగా వసంతోత్సవం


స్వామి గ్రామోత్సవం

పామూరు, మే, 22 : మండలంలోని కంభాలదిన్నె పంచాయతీ రేణిమడుగు గ్రామంలో శ్రీ కోదండరామ దేవస్థానంలో సీతారామ స్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా బుధవారం వసంతోత్సవం నిర్వహించారు. ముందుగా స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో అలంకరించి గ్రామోత్సం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. అనంతరం భక్తులకు దేవస్థానం తరఫున అన్నదానం చేశారు.

ఉపాధి కూలీలకు రూ.300


పనులను పరిశీలిస్తున్న ఏపీడీ

పీసీపల్లి, మే 22 : ఉపాధి హామీ పథకంలో నిబంధనల మేరకు పనిచేస్తే ఒక్కో మనిషికి రోజుకు రూ.300 కూలి లభిస్తుందని ఏపీడీ రాజారావు చెప్పారు. మండలంలోని వెంగళాయపల్లి, వేపగుంపల్లి, ముద్దపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని కూలీలతో ఆయన మాట్లాడుతూ అందరూ సమయపాలన పాటించాలన్నారు. టీఏలు ఇచ్చే కొలతల మేరకు పనులు చేయాలని చెప్పారు. పనికి వచ్చిన ప్రతిఒక్కరూ రోజూ ఆన్‌లైన్‌లో హాజరు వేయించుకున్న తరువాతు మస్టర్లలో సంతకాలు చేయాలన్నారు.

రేపు డీఈఈసెట్ పరీక్ష

ఒంగోలు(విద్య), మే 22: ప్రభుత్వ డైట్ కళాశాలలు, ప్రైవేటు డీఈడీ కళాశా లల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న డీఈఈసెట్ ప్రవేశపరీక్ష శుక్రవారం ఒంగోలు సౌత్ మామిడిపాలెంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ద చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా భవన్‌లో జరుగుతుందని డీఈవో సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

మారెళ్ల సమీపంలో గుర్తుతెలియని మృతదేహం

పీసీపల్లి, మే 22 : మండలంలోని మారెళ్ల సమీపంలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పీసీపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు... పీసీపల్లి నుంచి మారెళ్ల వెళ్లే మార్గంలో కంకర మిల్లు సమీపంలో మృతదేహం ఉంది. అతని శరీరంపై బ్లూ రంగు చొక్కా, తెలుపు, బ్లూ చారలు కలిగిన లుంగీ ధరించిన సుమారు 60సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని కనిగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పీసీపల్లి పోలీసులకు(సెల్‌నెంబరు9121102213) సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

పాము కాటుతో వ్యవసాయ కూలీ మృతి

బల్లికురవ, మే 22 : మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో వ్యవసాయ కూలీ భూక్యా రమేష్‌నాయక్ (44) పాము కాటుతో మృతి చెందారు. బుధవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బండి శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొప్పెరపాడు ఎస్టీ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీ రమేష్‌నాయక్ పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం పొలం వెళ్లి పశువులకు పచ్చి మేత తెస్తుండగా పాము కాటు వేసింది. ఇవేమి పట్టించుకోని అతను బైకుపై మేత తీసుకొని ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో ఒక్కసారిగా నురగులు కక్కుతూ పడిపోయాడు. వెంటనే బంధువులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలోపే మృతి చెందారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. రమేష్ నాయక్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

వేటపాలెం(చీరాలటౌన్), మే 22 : ద్విచక్ర వాహనం, స్కూటీ ఢీకొన్న ఘటనలో ఎక్స్ సర్వీస్ ఉద్యోగి పరిస్థితి విషమంగా ఉండగా, మరో ఇద్దరు తీవ్ర గాయలతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన బుధవారం వేటపాలెం మండలం అక్కాయిపాలెం సమీపంలోని జాతీయ రహదారిలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం చీరాల పాపరాజు తోటకు చెందిన విన్నకోట శ్రీకాంత్ అదే ప్రాంతంలోనే నెట్ సెంటర్ నడుపుతుంటారు. అలాగే కొత్తపేటకు చెందిన కేలా శ్రీకాంత్ కూలి పనులు చేస్తుంటాడు. వీరిద్దరూ మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. అలాగే బాపట్ల మండలం బేతపూడి గ్రామానికి చెందిన కావూరి సుబ్బారెడ్డి ఇటీవల ఆర్మీ సర్వీసు ముగించుకుని స్వగ్రామం వచ్చారు. ఇతను స్కూటీపై ఒంగోలు వైపు నుంచి చీరాల వస్తున్నారు. ఈ క్రమంలో రెండు వాహనాలు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. దీంతో స్థానికులు 108లో క్షతగాత్రులను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే ఎక్స్ ఆర్మీ సుబ్బారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. మిగిలిన ఇద్దరు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Atmakur బ్రాంచి ... [illegible]

SCHEDULE

[illegible]

Perepi Venugopal, D.Com., D.L., Advocate, Tekkomitta, Nellore. Cell: 8374260528

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

పంప్‌బాయ్స్ కావలెను

సాయిరత్న ఫిల్లింగ్ స్టేషన్, ఒంగోలు, కర్నూలు రోడ్డు RTC బస్‌స్టాండ్ ప్రక్కన, పెట్రోలు బంక్ నందు ఆయిల్ ఫిల్ చేయుటకు పంప్‌బాయ్స్ & గర్ల్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సెల్: 9177124567

AJO-183918

PLOTS FOR SALE

ప్లాట్ ఫర్ సేల్, నూతన వెంచర్స్ ఒంగోలు కార్పోరేషన్‌లో BMR అర్జున్ విల్లాస్ వెనుక, 100% క్లియర్ టైటిల్‌తో రెసిడెన్షియల్ ప్లాట్స్ అందుబాటులో... సంప్ర॥ సెల్: 89852 86627, 98497 60806

AJO-183725

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్థంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥

Asst-Cir-Manager. 9985411484





పోలింగ్ తర్వాత వైసీపీ మూకలు తగలబెట్టిన కారు



పల్నాడు వదిలి.. పరార్!



మహిళపైనా పిన్నెల్లి దౌర్జన్యం..

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలింగ్ కేంద్రంలోకి దూసుకెళ్లి ఈవీఎంను నేలకేసి కొట్టి వీధి రౌడీలా ప్రవర్తించారు. ఈ ఘటనపై పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యేను ఓ మహిళ నిలదీశారు. ఈ క్రమంలో పిన్నెల్లి ఆమెపై దుర్భాషలాడారు. దౌర్జన్యం చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

అవును.. ఇన్నాళ్టికి పాపం పండిందంటున్నారు బాధితులు. ఇన్నాళ్లు చంబల్‌లోయను తలపించే అరాచకం మాచర్ల నియోజకవర్గంలో జరిగిందని చెబుతున్నారు. పిన్నెల్లి సోదరులు చేసిన విధ్వంసాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎమ్మెల్యే ఏకంగా పోలింగ్ బూత్‌లో ఈవీఎం విధ్వంసం చేస్తున్న వీడియో కలకలం రేపింది. ఓటమి భయంతో బూత్‌లలోకి చొరబడి దాడులకు తెగబడిన దృశ్యాలు వారి అరాచకానికి పరాకాష్టగా నిలిచాయి. ఈవీఎం విధ్వంసం కేసులో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరారీలో ఉన్నట్లు సమాచారం.. హైదరాబాద్‌లో పోలీసులు పిన్నెల్లిని బుధవారం అదుపులోకి తీసుకున్నారని ప్రచారం... ఈ రెండూ నిర్ధారణ కాకపోయినా రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యవహారం సంచలనం రేకెత్తించింది.



పాలువాయిగేట్ గ్రామంలోని 202 పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మల్లికా గార్గ్







పోలింగ్ తర్వాత రోజు వైసీపీ మూకల దాడులు

ప్రాణ భయంతో పొలాల్లో దాక్కున్నా..

- పాల్వాయి గేటు పోలింగ్ బూత్ టీడీపీ ఏజెంట్ శేషగిరిరావు

గుంటూరు, మాచర్లటౌన్: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన రౌడీ మూకలతో రాడ్లు, కర్రలు, గొడ్డలి, మారణాయుధాలతో నాపై దాడికి దిగారు.. నా తలపగిలినా వదిలిపెట్టకుండా మారణాయుధాలతో దాడి చేస్తుంటే ప్రాణ భయంతో పొలాల్లోకి పరుగులు తీశా.. పిన్నెల్లి సోదరుల నుంచి నాకు, నా కుటుంబానికి ప్రాణ హాని ఉంది.. రక్షణ కల్పించండి.. అంటూ పాల్వాయి గేటు గ్రామానికి చెందిన టీడీపీ ఏజెంట్ నంబూరు శేషగిరిరావు ఆవేదన వ్యక్తం చేశారు.. గుంటూరులోని టీడీపీ మాచర్ల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఫోన్లో పరామర్శించిన చంద్రబాబు

ఎమ్మెల్యే అభ్యర్థి పీఆర్కే ఈవీఎం ధ్వంసం, శేషగిరిరావు ధైర్యంగా అడ్డుకోవడం వంటివి మీడియా ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబు తెలుసుకున్నారు. టీడీపీ నేత చప్పిడి రాము ఫోన్ ద్వారా శేషగిరిరావును టీడీపీ అధినేత చంద్రబాబు పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు.



- పిన్నెల్లి బ్రదర్స్ కోసం పోలీసుల వేట

- ఈవీఎం విధ్వంసం చేసిన ఎమ్మెల్యే పిన్నెల్లి
- వీడియో వెలుగులోకి రావడంతో పరారీ
- హైదరాబాదులో గాలిస్తున్న ఏపీ, తెలంగాణ పోలీసు బృందాలు
- పోలీసుల అదుపులో ఉన్నాడంటూ వదంతులు
- నిర్ధారించని పోలీసులు
- సినిమా ఫక్కీలో పిన్నెల్లి కోసం పోలీసులు ఛేజింగ్

నరసరావుపేట, మే 22: పోలింగ్ రోజు ఈవీఎం, వీవీప్యాట్లను ధ్వంసం చేసి అరాచకం సృష్టించిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరారీలో ఉన్నాడు. హైదరాబాబులో పోలీసులు పిన్నెల్లిని బుధవారం అదుపులోకి తీసుకున్నారని ప్రచారం. అయితే పోలీసుల అధికారులు ఈ విషయాన్ని నిర్ధారించలేదు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విశ్వప్రయత్నాలు చేశారు. పట్టుకునేందుకు పోలీసులు కూడా అదే రేంజ్ వేటాడుతున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ మల్లికాగార్గ్ పిన్నెల్లిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పిన్నెల్లి విదేశాలకు పారిపోయేందుకు యత్నిస్తున్నట్లు పోలీసులు అనుమానంతో అన్ని ఎయిర్ పోర్టులలో ఏపీ పోలీసులు అప్రమత్తం చేశారు. లుకౌట్ నోటీసులు జారీ చేశారు.

పిన్నెల్లిని శాశ్వతంగా రాజకీయ బహిష్కరణ చేయాలి: జూలకంటి

ఈవీఎంను పగలగొట్టిన ఘటనలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని రాజకీయాల నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. అరాచకాలకు పాల్పడిని వైసీపీ నేతలను కౌంటింగ్ ఏజెంట్లుగా కూడా అనుమతించ కూడదని చెప్పారు. ఈసీ స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎస్ జవహర్‌రెడ్డి కనుసన్నల్లో వైసీపీ మూకలు దాడులకు యత్నించాయని బ్రహ్మారెడ్డి ఆరోపించారు.

పది సెక్షన్లతో కేసుల నమోదు..

ఐపీసీ, ప్రజాప్రాతినిధ్య చట్టం, పీడీపీపీ చట్టాల పరిధిలో 10 సెక్షన్లతో పిన్నెల్లిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. 143, 147, 448, 427, 353, 452, 1202, చట్టం 131, 135 సెక్షన్లతో కేసులు నమోదయ్యాయి. 20న పిన్నెల్లిపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. పిన్నెల్లిపై అదనపు సెక్షన్లు కూడా పెట్టేందుకు కోర్టులో మెమో పోలీసులు దాఖలు చేశారు. పిన్నెల్లిపై హత్యాయత్నం కేసు కూడా నమోదు చేసే అవకాశం ఉంది. ఈవీఎంల ధ్వంసం ఘటనపై ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటి వరకు ఎందుకు ఎమ్మెల్యేను అరెస్టు చేయలేదని మండిపడింది. పిన్నెల్లిని తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించింది. ఈ ఘటనపై వెనువెంటనే నివేదిక ఇవ్వాలని పేర్కొంది. ఈ మేరకు సీఈవో ముకేశ్ కుమార్‌కు ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

వెబ్ కెమెరాలో దృశ్యాల పరిశీలన

ఈ ఘటనకు సంబంధించి వెబ్ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను కేంద్ర ఎన్నికల అధికారులు నిశితంగా పరిశీలించారు. ఈ విషయాన్ని ఈసీ చాలా తీవ్రంగా పరిగణించింది. ఈ వీడియో బయటికి రాకముందు మాచర్ల నియోజకవర్గంలో ఎక్కడా గొడవలు చేయలేదని ఎమ్మెల్యే పిన్నెల్లి బుకాయించాడు. మాచర్ల అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఆర్వో.. పిన్నెల్లి చేత ప్రమాణం చేయించారు. ఎన్నికల నిబంధనలను అనుసరిస్తానని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతానని ప్రమాణం చేశారు. ఇందుకు విరుద్ధంగా ఈవీఎం ధ్వంసం చేసిన పిన్నెల్లిని ఎన్నికల నియమావళి ప్రకారం కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి..

పోలింగ్ రోజున పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. టీడీపీ శ్రేణులపై దాడులతో పాటు ఓటమి భయంతో పిన్నెల్లి సోదరులు బూత్‌లలోకి స్వయంగా చొరబడి ఈవీఎంలను ధ్వంసం చేసిన దృశ్యాలు కలకలం రేపాయి. రెంటచింతల మండలంలోని పాల్వాయి గేటులో ప్రశాంతంగా పోలింగ్ జరుగుతుండగా.. అక్కడ టీడీపీకే ఎక్కువ ఓట్లు పోలవుతున్నాయని.. తనకు ఓట్లు వేయడం లేదన్న అక్కసుతో పిన్నెల్లి బరితెగించారు. 202వ నంబర్ పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించి.. ఈవీఎంను ఎత్తి నేలకేసికొట్టారు. అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంటు శేషగిరిరావుపై, ఆయన అనుచరులు దాడి చేశారు. ఆ ఏజెంట్‌పై అదేరోజు బూత్ బయటే గొడ్డలితో దాడి చేశారు. మరోవైపు.. మాచర్ల నియోజకవర్గంలో పోలింగ్ రోజు, ఆ మర్నాడు జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో పిన్నెల్లి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిని 14న గృహ నిర్బంధం చేశారు. కానీ అదే రోజు అర్ధరాత్రి వారిరువురూ ఇంటి నుంచి పరారయ్యారు. కాగా పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రం అంత సమస్యాత్మకం అయినప్పటికీ ఇద్దరే పోలీసులు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.



పోలింగ్ రోజు ఈవీఎంలను పగలగొడుతున్న ఎమ్మెల్యే పిన్నెల్లి

ఆ అధికారి నివేదిక ఎందుకు ఇవ్వలేదు..

పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గానికి పర్యవేక్షణకు ఒక అధికారిని నియమించారు. మాచర్ల నియోజక వర్గానికి డీపీవో విజయ భాస్కరరెడ్డిని ప్రత్యేక అధికారిగా నియమించారు. మాచర్ల నియోజక వర్గంలో పోలింగ్ బూత్‌లలో ఈవీఎంల ధ్వంసం చేయడానికి వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఇందుకు సంబంధించిన నివేదికను సదరు అధికారి ఇవ్వలేదని తెలిసింది. ఎమ్మెల్యే పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేయడం కూడా కంట్రోల్ రూం నుంచి పరిశీలించిన అధికారులు ఏమీ తెలియనట్టు మిన్నకున్నారు. ఈ అంశంపై కూడా విచారిస్తున్నట్టు తెలిసింది.

దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్

రామకృష్ణారెడ్డి దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్ వేసుకున్నాడని, అయితే వ్యూహం బెడిసి కొట్టిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం 1.20 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నాడని, అయితే మధ్యా హ్నం 12 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకోవాల్సి ఉన్నప్పటికీ ఎయిర్ పోర్ట్‌లో ఏపీ పోలీస్ టీమ్ మాటు వేసిందని తెలుసుకొని వెళ్లలేదని టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది. కాగా పోలీసులు ఎయిర్ పోర్టులో ఉన్నారనే విషయం తెలుసుకున్న పిన్నెల్లి తప్పించుకునేందుకు రూట్ మార్చినట్టు తెలుస్తోంది.

పోలీసుల అదుపులో కారు డ్రైవర్

పిన్నెల్లి కదలికలను పోలీసులు ట్రాక్ చేస్తుండడంతో సంగారెడ్డి జిల్లా కంది వద్ద కారు, డ్రైవర్, మొబైల్‌ను వదిలేసి వేరే వాహనంలో పరారు అయ్యారని సమాచారం. దీంతో కారు డ్రైవర్, గన్‌మెన్‌లను పోలీసులు ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డికి ఆశ్రయం ఇచ్చినవారిని కూడా అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తునట్టు తెలుస్తోంది.

పోలింగ్ రోజున ఏం జరిగిందంటే..

13వ తేదీన ఎన్నికల పోలింగ్ రోజు రెంటచింతల మండలం పాల్వాయిగేటు 202 పోలింగ్ బూత్‌లో వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన విధ్వంసంపై శేషగిరిరావు మాటల్లో.. పోలింగ్ రోజున తాను టీడీపీ ఏజెంట్‌గా ఉన్నా, రామకృష్ణారెడ్డి పోలింగ్ బూత్‌లో జొరపడి దుర్భాషలాడుతూ ఈ బూత్‌లోనే కదా టీడీపీకి అనుకూల ఓట్లు పడుతుంది అంటూ ఈవీఎంను నేలకేసి కొట్టి ధ్వంసం చేశారు. నేను ధైర్యంగా ఎదురునిలిచి రామకృష్ణారెడ్డిని అడ్డుకునే ప్రయత్నం చేశానన్నారు. అదే రోజున రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ రౌడీ మూకలు నా తలపై వేటు వేశారు, అంతటితో ఆగకుండా చేయి, కాళ్లు, నడుముపై రాడ్లతో దాడి చేశారు. గాయాలపాలైన నేను రక్షించండి అంటూ కేకలు వేయడంతో ఓటు వేయడానికి వచ్చిన గ్రామస్తులందరూ ఎమ్మెల్యే పీఆర్కేను నిలదీశారు. అయినా అతను, అతని అనుచరులు జనంపై కూడా రాళ్ల దాడి చేశారు. ఆ రోజు నుంచి అజ్ఞాతంలోకి వెళ్లి బుధవారం బయటకు వచ్చానన్నారు. తీవ్ర గాయాలపాలైన నేను అదే రోజున పొలాల్లోకి వెళ్లి బిక్కుబిక్కుమంటూ జీవించానని చెప్పారు. ఆర్‌ఎంపీ డాక్టర్ సాయంతో చికిత్సను పొందా. తలకు కుట్లు కూడా పడ్డాయి. పీఆర్కేను అరెస్టు చేస్తారని తెలిసి అజ్ఞాతం వీడి బయటకు వచ్చా. పీఆర్కే నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, కనపర్తి శ్రీనివాసరావు సహకారంతో డీజీపీని కలిసి వాస్తవాలు వివరించి ప్రాణ రక్షణ కల్పించాలని కోరనున్నానని చెప్పారు. అనంతరం బ్రహ్మారెడ్డి, కనపర్తి, టీడీపీ నేతలతో కలిసి ఆయన ఎస్పీ తుషార్ డూడికి తన సమస్యను వివరించి, రక్షణ కల్పించాలని కోరారు.

ఈవీఎం ధ్వంసంపై నిర్లక్ష్యంగా ఎఫ్ఐఆర్ నమోదు

పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసినా ఇందుకు సంబంధించిన కేసుల నమోదులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. రెండ్రోజుల పాటు పోలీసులు కోరినా పీవో ప్రిసైడింగ్ అధికారి ఎమ్మెల్యే చంపుతారనే భయంలో ఫిర్యాదు చేయలేదంటున్నారు. 13న జరిగిన ఈవీఎం ధ్వంసం ఘటనపై 15న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీఆర్‌వో పిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తులు ఈవీఎం ధ్వంసం చేసినట్లు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించారని సెక్షన్లు నమోదు చేశారు. ఐపీసీ 448 పీపీడీపీ చట్టంలోని సెక్షన్ 3, ఐపీసీ 427 ఆర్‌డబ్ల్యూ 34 కింద కేసు పోలీసులు కేసు నమోదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు అని వీఆర్‌ఓ పేర్కొనడంతో వెబ్ కాస్టింగ్ ఫుటేజ్ కావాలని పోలీసులు ఈసీకి లేఖ రాశారు. పోలీసుల లేఖతో సీసీ టీవీ ఫుటేజ్ ఎన్నికల సంఘం ఇచ్చింది. ఈ ఫుటేజ్ వెలుగు చూడటంతో పిన్నెల్లి సాగించిన విధ్వంసకాండ, ఈవీఎంల ధ్వంసం వెలుగు చూసింది.

పోలా.. పరువు పోలా!

- ఏమీ జరగనట్టు నటించారు
- అరాచకాలను కప్పెట్టారు.. అడ్డంగా దొరికిపోయారు
- పిన్నెల్లి ప్రజలకు ఇప్పుడేమి సమాధానం చెబుతారు

నరసరావుపేట, మే 22: పోలింగ్ రోజు అరాచకాలు యథేచ్ఛగా జరిగాయి. వైసీపీ గుండాలు పేట్రేగిపోయాయి. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఓ వీధి రౌడీ మాదిరి ఏకంగా ఈవీఎంలనే ధ్వంసం చేశాడు. ఇంత పెద్దఎత్తున హింసాత్మక సంఘటనలు జరిగితే ఏమీ జరగనట్టుగా సంబంధిత అధికారులు వ్యవహరించారు. ఏమీ జరగనట్టు అంచా గప్‌చుప్‌గా ఉన్న ఎన్నికల యంత్రాంగం వైఖరిని వీడియో దృశ్యాలు వెలుగులోకి తెచ్చాయి. దీంతో అధికా రుల పరువు పోయినట్లయింది. పోలింగ్ నిర్వహణలో అడు గడుగునా సబంధిత అధికారులు పిన్నెల్లి లాంటి వ్యక్తులకు కొమ్ము కాశారన్న విమర్శలకు బలం చేకూరింది.

పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంకా తాను నిజాయితీ పరుడనని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నానని బుకాయిస్తున్నాడు. ఓ మీడియాలో మాట్లాడుతూ ఇదే ప్రయత్నం చేశారు. 14న పోలీసులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, తన సోదరుడు వెంకట్రామిరెడ్డిలను హౌస్ అరెస్టు చేసినట్టు పోలీసు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంటిలో ఉండాల్సి పిన్నెల్లి బ్రదర్స్ లేరు. ఇంటిలో ఉండాల్సి వ్యక్తులు బయటకు వెళ్లడాన్ని ఏం అనాలి. దీనిని పారిపోవడమే అంటారు.

అడుగడుగునా వైఫల్యం

అడుగడుగునా ఎన్నికల యంత్రాగం.. పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. పోలింగ్ రోజున వెబ్ కాస్టింగ్ కోసం పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి క్షణం పోలింగ్ బూత్‌లలో జరిగే సంఘటనలను రికార్డు చేస్తారు. ఈవీఎంలు ధ్వంసం చేస్తున్న దృశాలు రికార్డు అవుతున్న తరుణంలో లైవ్‌లో కూడా పరిశీలిస్తారు. అప్పుడే విధ్వంసాలకు సంబంధించిన వివరాలను నమోదు చేసి ఈసీకి నివేదించాల్సి ఉంది. ఈ ప్రక్రియ కూడా అమలు కాలేదు. ఈవీఎంలను ధ్వంసం చేశాక వాటిని సరిచేసేందుకు పోలింగ్ బూత్‌లకు సబంధిత సాంకేతిక సిబ్బంది, సబంధిత అధికారులు బూత్‌లను సందర్శించారు. ఈ సందర్భంలో ఏ బూత్‌లో ఎవరు ఈవీఎంల ధ్వంసంకు పాల్పడారు అన్న సమాచారాన్ని సేకరించారు. ఈ మేరకు పోలీసులకు పిర్యాదు చేయకుండా మిన్నకుండటంలో అంతర్యం ఏమిటి?. అరాచకాల గురించి ఫిర్యాదులో విషయం నమోదు చేశారా లేదా? సీసీ ఫుటేజ్ చూసే వరకు విషయం అంత గోప్యంగా ఎందుకు ఉంచారు? పోలింగ్ అధికారులు ఎవరికి కొమ్ము కాశారు? సిట్ బృందం జరిపిన పరిశీలనలో ఈ విషయాన్ని విచారణ నివేదికలో నమోదు చేశారా? వీటికి అధికారులు నివృతి చేస్తారో లేదో చూడాలి.



మాచర్లలో అలర్ట్

- ఎమ్మెల్యే అరెస్ట్ అయ్యారంటూ వదంతులు..

మాచర్ల రూరల్: ఈవీఎం ధ్వంసం కేసులో వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్ట్ అయ్యారంటూ సోషల్ మీడియాలో వదంతులు దావానలంలా వ్యాపించాయి. దీంతో పోలీసులు ముందస్తు జాగ్రత్తలో భాగంగా పట్టణంలో దుకాణాలను మూసివేయించారు. దీంతో ఒక్కసారిగా పట్టణమంతా నిర్మానుష్యంగా మారింది. అల్లర్లు జరుగుతాయని పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కాగా పట్టణంలో 144 సెక్షన్ కొనసాగుతూనే ఉంది. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేశారు.



మాచర్లలో దుకాణాలు మూయిస్తున్న పోలీసులు

పారదర్శకంగా ఓట్లలెక్కింపు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, మే 22: ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పగడ్బందీగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమంపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఈసీ సూచించిన మార్గదర్శకాలను విస్మరించరాదన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు 12 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కొరకు మరో రెండు కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో 14టేబుల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి మొబైల్ ఫోన్‌లో ఎట్టి పరిస్థితులలో అనుమతించరాదని హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ వస్తువుల సైతం లోపలికి అనుమతించరాదన్నారు. నాలుగు రోజులు ముందుగా అన్ని ఏర్పాట్లు చేయాలని వారికి మార్గనిర్దేశం చేశారు. ఓట్లలెక్కింపు ప్రక్రియకు సంబంధించిన విధినిర్వహణలో పొరపాట్లు జరగకుండా అధికారులు నిఘా ఉంచాలన్నారు. లెక్కింపు కేంద్రంలో గొడవలు జరిగితే కఠినచర్యలు ఉంటాయని, కేసులు నమోదు చేస్తామనే విషయాన్ని అభ్యర్థులకు తెలపాలన్నారు. ఈనెల 28వ తేదిన ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. 30వ తేదీన ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణలు ఉంటాయన్నారు. 3వ తేదిన రెండోవ దశ శిక్షణ ఇవ్వాలన్నారు. నిష్ణాతులైన మాస్టర్ ట్రైనర్‌ల ద్వారా సిబ్బందికి సమర్థంగా శిక్షణలు నిర్వహించాలన్నారు. ఎన్నికల పరిశీలకులు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్‌ల సమక్షంలో పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని ఆయన పలు సూచనలు చేశారు. ఓట్లలెక్కింపు ప్రక్రియకు అవసరమైన సామాగ్రి సమకూర్చుకోవాలని ఆర్‌వోలను జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ ఆదేశించారు. ఈసీఐ మార్గదర్శకాలు, నిబంధనలపై పిపిటి ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్.సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, ఆర్‌వోలు, ఏఆర్‌వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ శ్రీధర్

ప్రాణం తీసిన గుంతలు

- బైకు పైనుంచి పడి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి
- యద్దనపూడి పర్చూరు రోడ్డులో ఘటన

యద్దనపూడి(మార్టూరు) మే 22: తారు రోడ్లు పల్లెల్లో ఉన్న డొంక రోడ్లు కన్నా దారుణంగా తయారయ్యాయి. గుంతలు పడి రెండేళ్లయినా పట్టించుకోని ప్రభుత్వ వైఖరికి, అధికారుల నిర్లక్ష్యానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు నిండు ప్రాణం బలైంది. ఈ ఘటన బుధవారం ఉదయం పర్చూరు వెళ్లే రోడ్డులో యద్దనపూడి గ్రామ శివార్లో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మండలంలోని పోలూరు ఎస్సీ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తాళ్లూరి వినోద్ కుమార్ (37) మృతి చెందారు. అతను ఉమ్మడి ప్రకాశం దర్శి నియోజకవర్గం కురిచేడు మండలం అలవలపాడు గ్రామంలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో సెకెండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమార్‌కు భార్య స్వప్న, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రమాదం జరిగిందిలా...

పోలూరు గ్రామానికి చెందిన వినోద్ కుమార్ ఉద్యోగరీత్యా పెద దర్శిలో నివాసం ఉంటున్నారు. అతను ఎన్నికలు నిమిత్తం పోలూరు గ్రామానికి ఓటు వేయడానికి తన ఇద్దరు కుమారులతో వచ్చారు. అనంతరం సెలవులు కావడంతో అడపాదడపా పెద దర్శి వెళ్లి వస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఉదయం పెద దర్శి నుంచి ద్విచక్రవాహనంపై పోలూరు గ్రామానికి వస్తున్నారు. వినోద్ కుమార్ గమనించలేదో ఏమోగానీ యద్దనపూడి గ్రామ పొలిమేర దాటిన తర్వాత పర్చూరు రోడ్డులో గుంతలలో అదుపు చేయలేక బైక్‌తో సహా రోడ్డుపై పడి పోయాడు. దాంతో వెంటనే అతని తల వెనుక భాగాన బలమైన దెబ్బ తగలడంతో విపరీతంగా రక్తస్రావం అయింది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ విషయాన్ని అటుగా వెళ్తున్న కొంతమంది ద్విచక్రవాహనదారులు గమనించి పర్చూరు 108కి సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదంపై సమాచారం అందడంతో ఎస్ఐ జీవీఎస్ చౌదరి సిబ్బందితో వచ్చారు. అయితే అప్పటికే అతను చనిపోవడంతో మృతదేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వినోద్ సోదరుడు సామ్యేలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టు మార్టమ్ చేయించగా సాయంత్రం బంధువులు మృతదేహాన్ని పోలూరు గ్రామానికి తీసుకు వెళ్లారు.



వినోద్ కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

ఘటనపై స్పందించిన ఎస్ఐ

రోడ్లపై భారీగా గుంతలు ఉండడంతో ఉపాధ్యాయుడు మృతి చెందడం, కుటుంబ యజమానికి కోల్పోవడంపై ఎస్ఐ జీవీఎస్ చౌదరి వెంటనే స్పందించారు. మరోసారి ఈ రోడ్డుపై ఘటన జరుగకుండా ఉండేలా మార్టూరు మండలంలోని కోలలపూడి, వలపర్ల గ్రావెల్ క్వారీల నుంచి టిప్పర్లతో గ్రావెల్‌ను తెప్పించి గుంతలను పూడ్చివేయించారు. కిలో మీటర్‌కు పైగా గుంతల్లో మట్టిని పోసి చదును చేయించారు.

జిల్లాలో కొనసాగిన ఆరోగ్యశ్రీ సేవలు

ఒంగోలు(కలెక్టరేట్), మే 22 : జిల్లాలో బుధవారం నెట్‌వర్క్ హాస్పటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగాయి. ప్రభుత్వం బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఆస్పత్రుల యాజమాన్యాలు మరోసారి ఆరోగ్యశ్రీ ట్రస్టుకు సమ్మె నోటీసులు ఇచ్చాయి. అయితే బుధవారం నుంచి నెట్‌వర్క్ హాస్పటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తామని ప్రకటించినా ఆ ప్రభావం జిల్లాలో కనిపించలేదు. అన్ని ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగాయి. ఆరోగ్యశ్రీ సేవలను నిలుపుదల చేయాలంటే ముందస్తుగా జిల్లాలో కూడా సంబంధిత ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్‌కు సమ్మె నోటీసు ఇవ్వాల్సి ఉంది. కానీ బుధవారం సాయంత్రం వరకు కూడా ఎలాంటి నోటీసు ఇచ్చిన పరిస్థితి లేదు. దీంతో జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకున్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



రైజ్ కాలేజీలో కౌంటింగ్ ఏర్పాట్లు, భద్రతపై అధికారులతో మాట్లాడుతున్న దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 22: ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో వచ్చేనెల 4వతేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. బుధవారం సాయంత్రం రైజ్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతపై పోలీస్ అధికారులతో చర్చించారు. నిరంతరం స్ట్రాంగ్‌రూముల వద్ద నిఘా ఉంచాలన్నారు. ఇతరులు లోపలికి రాకుండా తనిఖీలు చేయాలని సూచించారు. అనంతరం కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు, స్ట్రాంగ్‌రూముల సీల్‌ను పరిశీలించి అక్కడి రిజిస్టర్‌లో సంతకం చేశారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్వో సుబ్బారెడ్డితోపాటు పలువురు అధికారులు ఉన్నారు.

పొగాకుకు మరో రూపాయి పెరుగుదల

ఒంగోలు-1లో కిలో రూ.323 గరిష్ఠ ధర

ఒంగోలు, మే 22 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్‌లో బుధవారం కూడా జోరు కొనసాగింది. మేలురకం, మీడియం, లోగ్రేడ్ ఇలా ఏ గ్రేడ్‌కు ఆ గ్రేడ్ బేళ్లను పలు కంపెనీల బయ్యర్లు పోటీపడి కొనుగోలు చేశారు. మేలురకం గరిష్ఠ ధర మరో రూపాయి పెరిగింది. మంగళవారం కిలో రూ.322 లభించగా బుధవారం మరో రూపాయి పెరిగింది. ఒంగోలు-1 వేలంకేంద్రంలో కిలో రూ.323 లభించింది. ఇతర కేంద్రాల్లోనూ గరిష్ఠ ధరలు రూ.320కి అటు ఇటుగా పలికాయి. ఇక మీడియం రకం బేళ్ల కిలో రూ.300పైనే ఉండగా లోగ్రేడ్‌లో నాణ్యమైన బ్రౌన్ ఇతర రకాలు కూడా కిలో రూ.270 పైనే ధరలు లభించాయి. దీనికి తోడు వారం క్రితం వరకు నోబిడ్‌లు కొంతమేర ఉంటుండగా ప్రస్తుతం అవి కూడా గణనీయంగా తగ్గిపోయాయి. మొత్తంగా ఇప్పటి వరకు సుమారు 53 మిలియన్ కిలోలు కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.243పైగానే ధర లభించింది.

పాము కాటుతో వ్యవసాయ కూలీ మృతి

బల్లికురవ, మే 22 : మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో వ్యవసాయ కూలీ భూక్యా రమేష్‌నాయక్ (44) పాము కాటుతో మృతి చెందారు. బుధవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బండి శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొప్పెరపాడు ఎస్టీ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీ రమేష్‌నాయక్ పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం పొలం వెళ్లి పశువులకు పచ్చి మేత తెస్తుండగా పాము కాటు వేసింది. ఇవేమి పట్టించుకోని అతను బైకుపై మేత తీసుకొని ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో ఒక్కసారిగా నురగులు కక్కుతూ పడిపోయాడు. వెంటనే బంధువులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలోపే మృతి చెందారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. రమేష్ నాయక్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

విషమంగా మాజీ సైనికుడు పరిస్థితి

గుంటూరుకు తరలింపు

ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఇద్దరు





అపస్మారక స్థితిలో శ్రీకాంత్, విషమంగా మాజీ సైనికుడు సుబ్బారెడ్డి

వేటపాలెం(చీరాలటౌన్), మే 22 : ద్విచక్ర వాహనం, స్కూటీ ఢీకొన్న ఘటనలో ఎక్స్ సర్వీస్ ఉద్యోగి పరిస్థితి విషమంగా ఉండగా, మరో ఇద్దరు తీవ్ర గాయలతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన బుధవారం వేటపాలెం మండలం అక్కాయిపాలెం సమీపంలోని జాతీయ రహదారిలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం చీరాల పాపరాజు తోటకు చెందిన విన్నకోట శ్రీకాంత్ అదే ప్రాంతంలోనే నెట్ సెంటర్ నడుపుతుంటారు. అలాగే కొత్తపేటకు చెందిన కేలా శ్రీకాంత్ కూలి పనులు చేస్తుంటాడు. వీరిద్దరూ మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. అలాగే బాపట్ల మండలం బేతపూడి గ్రామానికి చెందిన కావూరి సుబ్బారెడ్డి ఇటీవల ఆర్మీ సర్వీసు ముగించుకుని స్వగ్రామం వచ్చారు. ఇతను స్కూటీపై ఒంగోలు వైపు నుంచి చీరాల వస్తున్నారు. ఈ క్రమంలో రెండు వాహనాలు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. దీంతో స్థానికులు 108లో క్షతగాత్రులను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే ఎక్స్ ఆర్మీ సుబ్బారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. మిగిలిన ఇద్దరు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులను ఆదుకోవడం బాధ్యత



పండ్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

పర్చూరు, మే 22 : నిరాశ్రయులైన వృద్ధులను ఆదుకోవడం, చేయూతనందించడం బాధ్యతగా గుర్తించాలని పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు అన్నారు. పర్చూరు మండల పరిధిలోని నూతలపాడు ఆశ్రయ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నాగబైరు వంశీకృష్ణ, గాయత్రి దంపతుల ఆర్థిక సహాయంతో సమకూర్చిన దుస్తులు, దుప్పట్లు, చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలే లక్ష్యంగా రోటరీ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలకు దాతలు సహకారం అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, భవనం రాజుగుపాలరెడ్డి, కారుమూడి సుబ్బారెడ్డి, పాబోలు వెంకన్న, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

ఎవరెంత నొక్కారు...!

ప్రధాన పార్టీల్లో డబ్బుల పంపిణీపై సమీక్ష

అటు అధిష్ఠానం, ఇటు అభ్యర్థులు కూడా ఆరా తీస్తున్న పరిస్థితి

ఇరు పార్టీల్లో ఎనిమిది స్థానాల్లో

సరిగ్గా జరగలేదన్న అనుమానాలు

సీరియస్‌గా ఉన్న అధినేతలు



ఓట్ల కొనుగోలుకు నియోజకవర్గాల వారీ కేటాయించిన డబ్బు ఎంతమేరకు ఓటర్లకు చేరింది. ఎంత నేతలు నొక్కేశారనే అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఉన్నతస్థాయిలో వైసీపీ, టీడీపీ అగ్రనేతలు పరిశీలనలు ప్రారంభించగా మరోవైపు అభ్యర్థులు తాము ఇచ్చిన డబ్బును ఓటర్లకు ఎంతవరకు పంపిణీ చేశారనే దానిపై దృష్టిసారించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఆ నియోజకవర్గాలకు డబ్బులు కేటాయించే విషయంలో ప్రధానపార్టీల అధిష్ఠానాలు జాగ్రత్తలు తీసుకున్నాయి. రంగంలో ఉన్న అభ్యర్థులు కూడా అదేస్థాయిలో పనిచేశారు. అయినప్పటికీ అనేకచోట్ల ఓటర్లకు మొత్తం డబ్బులు అందలేదనే ప్రచారం ఉంది. కొందరు పంచకుండా మధ్యలోనే నొక్కారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఇటు వైసీపీ అటు టీడీపీ అధిష్ఠానాలు ప్రత్యేక పరిశీలన చేపట్టాయి. ప్రధానం అధికార పార్టీలో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. మొత్తంగా డబ్బు స్వాహాపర్వం జిల్లావ్యాప్తంగా అలజడి రేపుతోంది

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉండగా ఇరుపార్టీల అధిష్ఠానాలు ఆయా పార్టీల తరఫున కనీసం నాలుగేసి నియోజకవర్గాల్లో డబ్బు పంపిణీ సక్రమంగా జరగలేదనే అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. గతం కన్నా డబ్బుతో ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఈ పర్యాయం ఇరుపార్టీలు అధిక ప్రాధాన్యత ఇచ్చిన విషయం తెలిసిందే. అంతేకాక ఉమ్మడి జిల్లాలో ఒకరిద్దరు మినహా ఇరు పార్టీల అధిష్ఠానాలు ఆయా అభ్యర్థులకు డబ్బును కూడా సమకూర్చారు. వైసీపీ ముందుగా అభ్యర్థులకు నిర్దేశించిన టార్గెట్ ప్రకారం డబ్బు డిపాజిట్ చేయించుకొని వారు డిపాజిట్ చేసిన డబ్బుతోపాటు పార్టీ పరంగా ఇవ్వాల్సినంత ఇచ్చేశారు. పార్లమెంట్ అభ్యర్థులు ఇవ్వాల్సిన డబ్బును కూడా వైసీపీ అధిష్ఠానం తీసుకొని అభ్యర్థులకు చేర్చింది. ఒకటి అర చోట్ల ప్రత్యేక సమస్యలు ఎదురైతే ఎక్కడ ఎలా ఆర్థిక సహకారం ఇవ్వాలో పార్లమెంట్ అభ్యర్థులకు తెలియజేశారు. టీడీపీ మాత్రం నియోజకవర్గాల వారీగా ముందస్తు అవగాహనతో ముందుకు సాగింది. పార్లమెంట్ అభ్యర్థులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఆయా నియోజకవర్గాలకు వారి ద్వారా ఆర్థిక చేయూతను అందించారు. అధికార వైసీపీ ప్రతి నియోజకవర్గంలో ఓటుకు రూ.2వేలు తగ్గకుండా ఇవ్వమని అభ్యర్థులపై వత్తిడి చేసినట్లు సమాచారం. స్థానికంగా అవకాశం ఉన్న వారు అదనంగా ఇచ్చినా సంతోషమని సంకేతం ఇచ్చి ఆ రకంగా వత్తిడి కూడా పెంచారు. అయితే ఇరుపార్టీల్లో కొందరు అభ్యర్థులు పార్టీ నిర్దేశించిన ప్రకారం ఓటర్ల కొనుగోలుకు డబ్బులు ఇవ్వలేదనే అనుమానాలతో పరిశీలన ప్రారంభించటం విశేషం. దీనికితోడు నియోజకవర్గాల్లో ఎంతమంది ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయాలనే విషయాన్ని అధిష్ఠానాలే నిర్దేశించాయి. ప్రస్తుతం ఆ ప్రకారం ఓటు రేటు అమలు చేశారా, అవసరమైన సంఖ్యలో ఓటర్లకు డబ్బులు అందించారా లేదా అన్న విషయంపై పార్టీ పెద్దలు దృష్టిసారించటం విశేషం.

నాలుగైదు చోట్ల డబ్బులందలేదు

అధికార వైసీపీ విషయాని కొస్తే కనిగిరి, సంతనూతలపాడుతో పాటు మార్కాపురం, అద్దంకి పర్చూరు లాంటి నియోజకవర్గాల్లో ఆశించిన మేరకు డబ్బులు పంపిణీ జరగలేదనే అనుమానంతో వైసీపీ అధిష్ఠానం పరిశీలన చేపట్టినట్లు తెలిసింది. అలాగే గిద్దలూరు, కొండపి తదితర చోట్ల ఓటర్లందరికీ డబ్బుల విషయంలో కొంత వైఫల్యం చోటుచేసుకున్నదనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ప్రతి నియోజకవర్గంలో ఓటుకు రూ.2వేల ప్రకారం పంపిణీ చేయాలని వైసీపీ అధిష్ఠానం నిర్దేశించింది. ఆ ప్రకారం అభ్యర్థులు ముందుగా డిపాజిట్ చేయగా వాటితోపాటు పార్టీ నుంచి డబ్బులు అందించినట్లు కూడా తెలుస్తోంది. కనిగిరి, ఎస్ఎన్‌పాడులాంటి చోట్ల ఓటుకు రూ.1500 ప్రకారం వైసీపీ అభ్యర్థులు పంపిణీ చేశారు మార్కాపురంతోపాటు మరికొన్ని నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లకు అదేస్థాయిలో డబ్బులు అందలేదని తెలుస్తోంది. దీంతో వైసీపీ అధిష్ఠానం ఈ విషయంపై ప్రత్యేక పరిశీలన చేపట్టింది. ఓటుకు రూ.1500 ప్రకారం ఇచ్చినట్లుగా కనిగిరి, ఎస్ఎన్‌పాడులపై నిర్ధారణకు వచ్చిన పార్టీ పెద్దలు అన్నీ ప్రాంతాల్లో సమానంగా డబ్బులు అందించటంలో వెనుకడుగు వేసినట్లు కొన్ని నియోజకవర్గాలపై అనుమానాతో పరిశీలనలు చేపట్టారు. ఒంగోలు, దర్శి, వైపాలెం ఆ తర్వాత కందుకూరు, కొండపి, అద్దంకి, చీరాల, పర్చూరు, గిద్దలూరులాంటి చోట్ల ఓటుకు రూ.2వేలు ప్రకారం వైసీపీ పక్షాన డబ్బులు పంపిణీ జరిగినా నిర్దేశించిన సంఖ్యలో ఓటర్లకు డబ్బులు అందలేదనే అనుమానం నెలకొంది. గిద్దలూరులో 60శాతం లోపే డబ్బులు పంపిణీ జరిగినట్లు తేల్చారు. కొండపిలో ఎంపీ అభ్యర్థి సహకరించకపోయినా అసెంబ్లీ అభ్యర్థి ఓటుకు రూ.2వేలు లెక్కన పంపినా కిందిస్థాయిలో పంపిణీలో లోపం జరిగినట్లుగా గుర్తించారు. అదేరకమైన పరిస్థితి చీరాల, పర్చూరు, అద్దంకిల్లో జరిగినట్లుగా పార్టీ అధిష్ఠానం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. వైపాలెం, దర్శి ఒంగోలు, చీరాలలో మాత్రం వైసీపీ పక్షాన ఈ విషయంలో ఎలాంటి లోపం జరగలేదనే భావనకు వచ్చినట్లు సమాచారం.

కొన్నిచోట్ల వెనకడుగు

టీడీపీ చాలావరకు ఓటుకు రూ.1500 ఇచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో పంపిణీ చేశారనే అభిప్రాయం ఆ పార్టీలో నెలకొంది. ఒంగోలు, అద్దంకి, చీరాలలో ఓటుకు రూ.2వేలు ప్రకారం టీడీపీ శ్రేణులు కూడా డబ్బులు పంపిణీలో ముందున్నారనే భావనలో ఆ పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. పర్చూరులో కొన్నిచోట్ల రూ.1500 మరికొన్నిచోట్ల రూ.2వేలు ప్రకారం ఇచ్చారు. అదీ ఎక్కువసంఖ్యలో పంపిణీ జరిగినట్లుగా భావిస్తున్నారు. గిద్దలూరులో ఓటుకు రూ.1500 ప్రకారం పంచినప్పటికీ మొత్తం ఓటర్లకు డబ్బులు చేరలేదనే అనుమానం ఉంది. వైపాలెంలో ఓటుకు రూ.1000 పంపిణీ చేయటంపై ఆ పార్టీ అధిష్ఠానం ప్రత్యేక పరిశీలన చేపట్టింది. మార్కాపురంలో ఓటుకు రూ.1500 ఎక్కువమందికి ఇవ్వగలిగినప్పటికీ ఆ పార్టీ చేయూతనిచ్చిన రీతిలో పంపిణీకి అభ్యర్థి ప్రాధాన్యత ఇవ్వలేదనే అనుమానం నెలకొంది. పార్టీ తగు రీతిలో సహకారం ఇవ్వకపోయినప్పటికీ దర్శిలో టీడీపీ అభ్యర్థి ప్రత్యర్థి కన్నా మిన్నగా ముందడుగు వేశారనే అవగాహనకు ఆ పార్టీ వచ్చింది. కందుకూరులోను పార్లమెంట్ అభ్యర్థి ద్వారా ఇచ్చిన చేయూతకు తగిన రీతిలో అసెంబ్లీ అభ్యర్థి డబ్బులు పంపిణీలో వెనకడుగు వేశారనే అనుమానం ఆ పార్టీ అధిష్ఠానంలో నెలకొన్నట్లు తెలిసింది.

స్థానిక నేతల వైఖరిపై కన్ను

అనేక నియోజకవర్గాల్లో రెండు పార్టీల తరుపున పోటీల్లో ఉన్న అభ్యర్థులు వారు నియమించుకున్న సొంత మనుషల ద్వారా డబ్బు పంపిణీ జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అయినప్పటికీ సమస్య ఎదురైన నియోజకవర్గాల వారు స్థానిక నేతలకు అవసరమైన ప్రాధాన్యత ఇచ్చారు. కొన్నిచోట్ల పూర్తిగా స్థానిక నేతలకే ప్రాధాన్యత ఇచ్చారు. అయితే ఈ విషయంపై అధిష్ఠానం పలు అనుమానాలతో ప్రత్యేక పరిశీలన చేపట్టిన నేపథ్యంలో కిందిస్థాయిలో మండల, గ్రామనేతల వైఖరిపై చర్చ మొదలైంది. తాము పంపిన డబ్బులు ఎంతమేరకు ఓటర్లకు చేరాయి. ఎంతమేరకు దారి మళ్లాయి అనే విషయంపై అభ్యర్థులు నిశితమైన పరిశీలన చేపట్టడం విశేషం. అటు ఇరుపార్టీల అధినేతలు ఇటు నియోజకవర్గ స్థాయిలో అభ్యర్థులు డబ్బు పంపిణీ వ్యవహారాలపై పరిశీలనలు చేపట్టడంతో భవిష్యత్తులో ఈ వ్యవహారం ఆయా పార్టీల్లో ఏ స్థాయిలో కలకలం సృష్టించబోతుందనే అంశం చర్చనీయాశంగా మారింది.

ఇంటర్ స్పాట్‌లో భారీ సంస్కరణలు

డిజిటల్ ఆన్‌లైన్ విధానంలో జవాబుపత్రాల మూల్యాంకనం

స్పాట్ వాల్యువేషన్ విధానానికి ఇక స్వస్తి

ఒంగోలు(విద్య), మే 22: ఇంటర్మీడియేట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనంలో భారీ సంస్కరణకు బోర్డు శ్రీకారం చుట్టింది. ఇంటర్ బోర్డు చరిత్రలో ప్రప్రథమంగా డిజిటల్ ఆన్‌లైన్ విధానంలో జవాబుపత్రాల మూల్యాంకనాన్ని ప్రవేశపెట్టింది. ఈ డిజిటల్ ఆన్‌లైన్ విధానం అమలుకు రాష్ట్రంలో ఆరు ప్రాంతీయ రిసెప్షన్ అండ్ స్కానింగ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. అందులోభాగంగా ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో ఒక సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇది ప్రకాశం, బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాలకు ప్రాంతీయ రిసెప్షన్ అండ్ స్కానింగ్ సెంటర్‌గా పనిచేస్తుంది. పరీక్షా కేంద్రాల నుంచి వచ్చిన జవాబుపత్రాలను ఆయా సెంటర్లకు నియమితులైన అధికారులు స్కానింగ్ చేస్తారు. డిజిటల్ అన్‌లైన్ విధానంలో జవాబుపత్రాలను మూల్యాంకనం చేసేందుకు అధ్యాపకులను ఇంటర్ బోర్డు ఎంపిక చేస్తుంది. ఈ అధ్యాపకుల మెయిల్, పాస్‌వర్డ్ వివరాలు కూడా ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ ఉంచుతారు. ఆర్ఆర్ఎస్‌సీ సెంటర్లలో స్కానింగ్ చేసిన జవాబుపత్రాలు క్లౌడ్‌లోకి వెళ్తాయి. అక్కడి నుంచి ర్యాండమ్‌గా ఇంటర్ బోర్డు ఎంపికచేసిన అధ్యాపకుల లాగిన్‌కు అప్‌లోడ్ చేయడం ద్వారా జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుంది. ఒక జిల్లాలోని ఎగ్జామినర్‌కు ఇతర జిల్లాల విద్యార్థుల జవాబుపత్రాలు వచ్చేవిధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎగ్జామినర్లు రోజుకు 60 జవాబుపత్రాలు మూల్యాంకనం చేయాలి. ఒక జవాబుపత్రం మూల్యాంకనం పూర్తయి సబ్మిట్ కొట్టగానే కంప్యూటర్/ల్యాపటాప్ తెరపై మరో జవాబుపత్రం ప్రత్యక్షమవుతుంది. వెబ్ కెమెరా నిఘాలో ఈ మూల్యాంకనం జరగాలి. ఆయా కళాశాలల్లో ఎగ్జామినర్ల మూల్యాంకనాన్ని సంబంధిత ప్రిన్సిపాల్స్ పర్యవేక్షించాలి. ఎగ్జామినర్లు ఒకరి బదులు మరొకరు మూల్యాంకనం చేసే అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఈ విధానంతో ఎగ్జామినర్లు వ్యయ ప్రయాసాలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి మూల్యాంకన కేంద్రానికి వచ్చి అక్కడ పేపర్లు దిద్దే శ్రమ లేకుండాపోతుంది. అధ్యాపకులు తాము పనిచేస్తున్న కళాశాలల్లోనే మూల్యాంకనం చేస్తారు. నూతన విధానంపై అధ్యాపకులకు బుధవారం ఏకేవీకే కళాశాలలో శిక్షణ ఇచ్చినట్లు ఆర్ఐఓ సైమన్ విక్టర్ తెలిపారు.

మార్టూరులో రోటరీ కళా పరిషత్ నాటిక పోటీలు

27 నుంచి 29 వరకు నిర్వహణ



పోటీల వివరాలను తెలియ చేస్తున్న రోటరీ శ్రీకారం సభ్యులు

మార్టూరు, మే 22 : శ్రీకారం స్వచ్ఛంద సేవా సంస్థ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మార్టూరులో ఈ నెల 27, 28, 29వ తేదీలలో 14వ ఉభయ రాష్ట్రాల నాటికల పోటీలను మార్టూరు మద్ది సత్యనారాయణ కంపెనీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు శ్రీకారం సంస్థ అధ్యక్షుడు కందిమళ్ల సాంబ శివరావు, రోటరీ అధ్యక్షుడు తాళ్లూరి సాంబశివరావు తెలిపారు. అందుకు సంబంధించి బుధవారం స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో శ్రీకారం రోటరీ ప్రతినిధులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కందిమళ్ల సాంబశివరావు మాట్లాడుతూ మార్టూరులో రోటరీ కళా పరిషత్ నాటిక పోటీలను నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రోటరీ చరిత్రలోనే మార్టూరు రోటరీ కళా పరిషత్ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. రోటరీ ప్రజా సేవా కార్యక్రమాలతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించాలనే సదుద్దేశంతో కళా పరిషత్ నాటికల పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. దాదాపుగా 125 మంది కళాకారులు, సాంకేతిక నిపుణులతో ఈ నాటికల ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ పోటీలలో పాల్గొనే నాటికలలో ఉత్తమ ప్రదర్శన, ద్వితీయ ఉత్తమ ద్వితీయ ప్రదర్శన, తృతీయ ఉత్తమ ప్రదర్శన ప్రత్యేక ప్రదర్శనా బహుమతులతో పాటు 15 మంది కళాకారులకు వ్యక్తిగత బహుమతులను అందజేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కనిగిరి సమీపంలో డీసీఎం వ్యాన్, మినీ లారీ ఢీ

ఈ ఘటనలో మరో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాద ఘటనలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కనిగిరి, మే 22 : ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్‌ను మినీ లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం పట్టణ సమీపంలోని పామూరు హైవే రోడ్డుపై డిగ్రీ కళాశాల వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన రోజువారీ భవన నిర్మాణ కార్మికులు 15 మంది స్లాబ్ వేసేందుకు సామగ్రితో డీసీఎం వ్యాన్‌లో కనిగిరి వెళ్తున్నారు. అదేవిధంగా విజయవాడ నుంచి కనిగిరి మీదుగా కడప వైపు వెళ్తున్న మినీ లారీ వస్తుంది. ఈ క్రమంలో మినీ లారీ డ్రైవర్ కునుకు తీయటంతో రోడ్డుకు మరో వైపు ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ వెనుకు భాగాన్ని ఢీకొట్టింది. దీంతో వ్యాను వెనుక చక్రాలు ఊడి స్లాబ్ సామగ్రితో సహా తిరగబడింది. దీంతో అవన్నీ పైన పడడంతో ఉప్పు రమాదేవి(51) తీవ్ర గాయాలపాలైంది. స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందింది. అదేవిధంగా మాచవరం గ్రామానిక చెందిన సుశీలకు, మినీ లారీ డ్రైవర్ సురేష్‌కు గాయాలయ్యాయి. వీరిరువురు స్థానిక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సంఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు.

ప్రదర్శనకు పది నాటికలు ఎంపిక

మార్టూరు, మే 22 : మార్టూరులో జరగనున్న కళా పరిషత్ నాటికల పోటీలలో ప్రదర్శించడానికి 10 నాటికలను ఎంపిక చేశారు. నాటికల పోటీలు ప్రారంభం రోజున 27వ తేదీ సోమవారం రాత్రి మూడు నాటికలను ప్రదర్శిస్తారు. వాటిలో తొలుత శ్రీ అమృత లహరి ఆర్ట్స్ విజయవాడ వారిచే నాన్నా నేనొచ్చేస్తా నాటిక తరువాత తెలుగు కళా సమితి విశాఖ వారిచే నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక, అనంతరం కళా నికేతన్ వీరన్నపాలెం వారిచే రాజుగారి గోచీ నాటికను ప్రదర్శిస్తారు. ఇక 28 వతేదీ మంగళవారం రాత్రి మొదటిగా శ్రీకారం రోటరీ కళా పరిషత్ వారితో ప్రత్యేక ప్రదర్శనగా రైతు భారతం నాటికను ప్రదర్శిస్తారు. అనంతరం రసఝురి పొన్నూరు వారితో కాపలా నాటికను, తరువాత కళాంజలి హైదరాబాద్ వారిచే రైతే రాజు నాటికను, మైత్రి కళా నిలయం విజయవాడ వారిచే బంధం నాటికను ప్రదర్శిస్తారు. చివరగా 29 వతేదీ బుధవారం రాత్రి తొలుత అభినయ గుంటూరు వారిచే ఇంద్రప్రస్థం నాటిక, చైతన్య కళా భారతి కరీంనగర్ వారిచే చీకటి పువ్వు నాటిక, శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారితో కౌసల్యా సుప్రజారామ నాటిక, తరువాత వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారిచే రాత నాటికను ప్రదర్శిస్తారు. సమావేశంలో చెన్నుపాటి బసవరాములు, జాష్టి సాంబ శివరావు, రావి అంకమ్మ చౌదరి, దొడ్డా రమేష్, చెరుకూరి నాగేశ్వరరావు, షేక్ కాజా హుస్సేన్, ఇంటూరి ఆంజనేయులు, చెరుకూరి అంజిబాబు, ఎం.ఈశ్వర ప్రసాద్, గరిమిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రభ అదుర్స్

పంగులూరు, మే 22 : పంగులూరులో జరుగుతున్న శ్రీ భీమ లింగేశ్వరస్వామి దేవస్థాన 20వ వార్షిక బ్రహ్మోత్సవాలలో బుధవారం రాత్రి జరిగిన కోలాట ప్రదర్శన అలరించింది. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ కమిటీ వారు గ్రామస్థుల సహకారంతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులకు వినోదాన్ని కలిగించాయి.



విద్యుత్ ప్రభ

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

పంప్‌బాయ్స్ కావలెను

■ సాయిరత్న ఫిల్లింగ్ స్టేషన్, ఒంగోలు, కర్నూలు రోడ్డు RTC బస్టాండ్ ప్రక్కన, పెట్రోలు బంకు నందు ఆయిల్ ఫిల్ చేయుటకు పంప్‌బాయ్స్ & గర్ల్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సెల్: 9177124567

AJO-183918

PLOTS FOR SALE

■ ప్లాట్ పర్ సేల్, నూతన వెంచర్స్ ఒంగోలు కార్పోరేషన్‌లో BMR అర్జున్ విల్లాస్ వెనుక, 100% క్లియర్ టైటిల్‌తో రెసిడెన్షియల్ ప్లాట్స్ అందుబాటులో... సంప్ర॥ సెల్: 89852 86627, 98497 60806

AJO-183725

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥
Asst-Cir-Manager. 9985411484

నిద్రలో జారి కింద పడి వృద్ధుడు మృతి

వెలిగండ్ల, మే 22 : ప్రమాదవశాత్తు వృద్ధుడు నిద్రలో బెంచీ మీద నుంచి జారి కింద పడి మృతి చెందిన సంఘటన హుస్సేన్‌పురంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... హుస్సేన్‌పురానికి చెందిన ఈర్ల గురవయ్య(60) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. మంగళవారం సాయంత్రం రోడ్డు పక్కన రావి చెట్టు దగ్గర ఉన్న బల్లపై పడుకొని నిద్రిస్తున్న సమయంలో దొర్లి కింద పడటంతో తలకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతనిని కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య ముగ్గురు సంతానం ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

నేడు స్వామివార్ల కల్యాణ మహోత్సవం

చెరుకూరు(పర్చూరు), మే 22: పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీ త్రివిక్రమస్వామి వారి దేవాలయంలో గురువారం స్వామివార్ల కల్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి కె.నాగయ్య తెలిపారు. కల్యాణ కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధిక సం ఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల కల్యాణ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు

ఇంకొల్లు, మే 22 : పావులూరు పొలిమేర వీరాంజనేయ స్వామి సన్నిధిలో భక్తులకు పలు సేవా సంస్థలు సేవా కార్యక్రమాలను చేపట్టాయి. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. కాకతీయ అన్నదాన సత్రం, నాయీబ్రాహ్మణుల అన్నదానం సత్రంలో తిరునాళ్ల చివరి రోజు గురువారం వచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు సత్రం నిర్వాహకులు తెలిపారు. తిరునాళ్ల రెండవ రోజు బుధవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో సేవలు అరకొర

- డాక్టర్లు, సిబ్బంది కొరత
- అందుబాటులో లేని మందులు
- రోగుల ఆందోళన



ఏరియా వైద్యశాలలోని చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్లు (ఫైల్)

చీరాల, మే 22 : చీరాల ఏరియా వైద్యశాల కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఉంటుంది. అధునాతనమైన భవన సముదాయం. అందులో పలు విభాగాలకు వైద్యసేవలు అందించేందుకు అన్ని వనరులు ఉన్నాయి. అయితే కొంతమేర వైద్యులు, సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఇదిలావుంటే ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులలో కొన్ని అందుబాటులో లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మారిన వాతావరణంతో జెట్ట జలుబులు, జ్వరాలతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగింది. చీరాల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు చీరాల ఏరియా వైద్యశాల ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రధాన వనరు. ఈ ప్రాంతంలో పేద, బడుగు, బలహీనవర్గాల వారు అధిక సంఖ్యలో ఉంటారు. వారికి చిన్న సుస్తీ చేసినా, పెద్ద వ్యాధి వచ్చినా వైద్య సేవలు పొందేందుకు ఏరియా వైద్యశాలకు పరుగులు పెడతారు. వైద్యశాలలో అన్ని విభాగాలకు సంబంధించిన వైద్య సేవలు అందించేందుకు వనరులు ఉన్నాయి. ఒక్క గుండెకు సంబంధించి తప్ప మిగిలిన వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి. డయాలసిస్ నుంచి సీటీ స్కాన్ వరకు అన్ని రకాల వైద్యపరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అన్నీఉన్నా ఆసుపత్రిలో నెలకొనే చిన్న, చిన్న సమస్యలతో ఏరియా వైద్యశాల అంటే ప్రజల్లో చిన్నచూపు కలుగుతోంది. ప్రధానంగా కొంతమేర వైద్యులు, సిబ్బంది కొరత అందుకు కారణంగా చెప్తున్నారు. ఇదిలావుంటే రోగులకు అవసరమైన మందులలో కొన్ని రకాలు అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. కొందరు ఆసుపత్రిలో వైద్యం, మందులు, వైద్య పరీక్షలు అన్నీ ఉచితం. అయినప్పటికీ పేదరికంలో ఉన్నవారు కూడా కొన్ని సందర్భాల్లో ఏరియా వైద్యశాలలో వైద్యసేవలు అందక ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నామని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు వైద్యశాల మెడికల్ షాప్‌లో అన్ని రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు కూడా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వెంకట్రావుకు సాయమందిస్తున్న రావినూతల టీడీపీ నేతలు

కార్యకర్త కుటుంబానికి టీడీపీ సాయం

మేదరమెట్ల, మే 22 : రావినూతల గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త ఓరుగంటి వెంకట్రావు గత కొంతకాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతూ కిమోథెరపీ చేయించుకుంటున్నారు. బుధవారం రావినూతల తెలుగుదేశం పార్టీ నాయకులు లక్షా50వేల రూపాయలు వెంకట్రావుకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కారుసాల నాగేశ్వరరావు(బాబు), మోపర్తి లక్ష్మీనారాయణ, కారుసాల గురుబాబు, చెబ్రోలు నాగేశ్వరరావు, కారుసాల సుబ్బయ్య, అనుబ్రోలు ప్రభాకరరావు, రామినేని శ్రీనివాసరావు, కావూరి వరప్రసాద్‌రావు, పిన్నక రవి, కృష్ణపురపు ఆంజనేయులు, నాగూరి అంజనేయులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించాలి



సర్వేని పరిశీలిస్తున్న ఎంఈవో సుధాకరరావు

అద్దంకిటౌన్, మే 22 : మండల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి వివిధ లోపాలు కలిగిన 0 నుంచి 18 సంవత్సరాలలోపు ప్రత్యేక అ వసరాలు గల చిన్నారులను గుర్తించి సమీపంలోని పాఠశాలలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈవో-1 గంగాధరరావు, ఎంఈవో-2 బి. సుధాకరరావు సూచించారు. బుధవారం మండలంలోని వేలమూడుపాడు ఎస్సీ కాలనీలో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఎంఈవో పరిశీలించారు. మే 1వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించడంలో భాగంగా ప్రభుత్వం స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటింటి సర్వే ద్వారి వినికిడి లోపం, దృష్టి లోపం, బుద్ధి మాంద్యం, ఆటిజం, శారీరక వైకల్యం వంటి 21 రకాల లోపాలు ఉన్న చిన్నారులను గుర్తించి వారి సమాచారాన్ని సేకరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు మండలంలో 25 మంది చిన్నారులను కొత్తగా గుర్తించినట్లు తెలిపారు. 2024-25 సంత్సరానికి గాను చిన్నారులను గుర్తించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు సహకరించాలని, గుర్తించిన చిన్నారులను సాధారణ పాఠశాలలోనే చేర్పించి పేరు నమోదు చేయించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోను నమోదైన ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల వివరాలను యూడైస్‌లో తప్పని సరిగా నమోదు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 9849960723, 9100996459 నెంబర్లును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ కొంగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్వేను జాగ్రత్తగా చేయండి

చినగంజాం : గ్రామాల్లో ప్రత్యేక అవసరాలున్న పిల్లల సర్వేని జాగ్రత్తగా నిర్వహించాలని ఎంఈవో-2 ఎస్.కోటేశ్వరావు అన్నారు. మండలంలోని చినగంజాం గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక అవసరాలున్న పిల్లల సర్వేని బుధవారం ఎంఈవో-2 బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో గ్రామాలన్నింటినీ రెండు క్లస్టర్లుగా విభజించి, సహిత విద్య రిసోర్సు పర్సన్‌లతో ప్రతిరోజు సర్వే నిర్వహించి, సర్వే నివేదికను ప్రతి రోజు జిల్లా కార్యాలయానికి పంపుతున్నట్లు తెలిపారు. సర్వే నమోదు వలన ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ట్రాన్స్‌పోర్టు అలవెన్స్, ఎస్కార్ట్, రీడర్, బాలకిల స్టైఫండ్, ఉపకరణాలు, బోధనాభ్యాస సామగ్రి, ఫిజియోథెరపీ సేవలు, ప్రత్యేక విద్య ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. సర్వేని పరిశీలించి రిసోర్స్ పర్సన్‌లకు ఆయన పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు టి.బాలకృష్ణ, డి.నాగార్జున పాల్గొన్నారు.

బాలికల వేసవి వాలీబాల్ శిక్షణ ప్రారంభం



వాలీబాల్ శిక్షణను ప్రారంభిస్తున్న అధికారులు

పంగులూరు, మే 22 : మండలంలోని బూదవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన బాలికల వేసవి శిక్షణ శిబిరాన్ని బుధవారం పాఠశాల హెచ్ఎం బంగారుకొండ ప్రారంభించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో నిర్వహించనున్న ఈ బాలికల వాలీబాల్ శిక్షణ శిబిరం మూడు వారాల పాటు కొనసాగుతుందని జిల్లా కోఆర్డినేటర్ పాఠశాల ఫిజికల్ డైరక్టర్ ఎం.వెంకటరావు తెలిపారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుం చి ఎంపికైన 30 మంది బాలికలు శిక్షణ పొందనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఎం. ఆంజనేయులు తెలిపారు. ఈ శిబిరంలో శిక్షణ పొందే బాలికలు క్రీడలో మెలకువలు తెలుసుకుని శిక్షణ ద్వారా క్రీడలో ఎదిగి రాణించాలని అంజనేయులు ఆకాంక్షించారు. ఈ శిక్షణ శిబిరానికి కోచ్‌గా స్పోర్ట్ అథార్టీ ఆఫ్ ఇండియా కోచ్ కేవీ రమణలు వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి నరసింహారావు ఉప సర్పంచ్ గాదె బ్రహ్మారెడ్డి, పీసీ చైర్మన్ ఈమని శ్రీరాములురెడ్డి, గ్రామ పెద్దలు కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, బలరామిరెడ్డి, బుల్లిరెడ్డి, రాఘవరెడ్డి శ్రీనివాస రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

ఇంకొల్లు, మే 22 : ఇంకొల్లులోని పావులూరురోడ్డులో ఉన్న పోలేరమ్మ ఆలయంలో చోరీ జరిగిన సంఘటన బుధవారం వెలుగు చూపింది. బుధవారం గుడికి కరి నాగేంద్రమ్మ అనే మహిళ శుభ్రం చేయడానికి వచ్చి చూడగా విగ్రహానికి ఉన్న వెండి, బంగారు వస్తువులు అపహరించినట్లు గుర్తించి ఆలయకమిటీ సభ్యులకు తెలిపింది. వీటి విలువ సుమారు రూ.2.20లక్షలు ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

బస్సు మారిన మహిళ

పోలీసుల జోక్యంతో క్షేమంగా చేరిక

మార్టూరు, మే 22 : మండలంలోని ఇసుక దర్శి గ్రామానికి చెందిన మారెళ్ల మల్లీశ్వరి అనే మహిళ సుమారు 40 మంది గ్రామస్థులతో కలిసి ఈ నెల 18వ తేదీన ప్రైవేటు బస్సులో కాశీకి వెళ్లారు. బుధవారం ఉదయం జార్ఖండ్‌లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి బస్సు నుంచి గ్రామస్థులతో పాటు దిగిన మల్లీశ్వరి తిరిగి బస్సు ఎక్కే క్రమంలో బస్సును గుర్తించలేక ఇతర రాష్ట్రానికి చెందిన మరో బస్సు ఎక్కారు. అయితే మల్లీశ్వరికి తమ బస్సు వివరాలు, గ్రామస్థుల ఫోన్ నంబర్లు కూడా తెలియకపోవడంతో సమాచరం చెప్పలేకపోయింది. భాష సమస్య కూడా ఎదురైంది. అదే సమయంలో ప్రొద్దుటూరుకు చెందిన మరో బస్సులోని ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి, మల్లీశ్వరితో మాట్లాడి గూగుల్ ద్వారా మార్టూరు పోలీస్ స్టేషన్ సీఐ రాజ శేఖర్ రెడ్డికి సమాచారం ఇచ్చారు. దాంతో వెంటనే సీఐ ఇసుకదర్శి గ్రామంలోని మహిళా పోలీస్ ఎం.నిర్మలకు సమాచారం ఇచ్చారు. ఆమె మల్లీశ్వరి కుటుంబ సభ్యులతో మాట్లాడడంతో వారు వెంటనే ఆమె వెళ్లిన బస్సులోని గ్రామస్థులు, డ్రైవర్‌తో మాట్లాడారు. అనంతరం బస్సు డ్రైవరు మల్లీశ్వరి ఉన్న ప్రాంతానికి వెళ్లి ఆమెను తమ బస్సులోకి ఎక్కించుకోవడంతో కథ సుఖాంతమైంది.



మాట్లాడుతున్న ఐక్య వేదిక నాయకులు

అధికారులపై వివక్ష తగదు

- కుల వివక్ష చూపుతూ బదిలీలు దారుణం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

అద్దంకిటౌన్, మే 22 : ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ అధికారులపైనే వివక్ష పూరింతంగా వ్యహరిస్తూ వారిని మాత్రమే సస్పెండ్, బదిలీలు చేయడం దారుణమని, వాటిని ఆపాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు అన్నారు. బుధవారం అంబేడ్కర్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం వారిని మాత్రమే బదిలీ చేయడం ఓసీ అధికారులను సమర్థిస్తున్నట్లు, వారిని వెనకేసుకొస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డి నివేదికలు పంపడం, సీఈసీ దానిని అమలు చేస్తూ విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. పల్నాడు కలెక్టర్ శివశంకర్‌ను ఏ తప్పు చేయకపోయినా కేవలం ఎస్సీ అనే భావనతో విధులకు దూరం చేయడం దుర్మాగమని, దినిని ఐక్య వేదిక ఖండిస్తుందని, వారిని వెంటనే విధులలోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్.నాగేశ్వరరావు, జె.శ్రీమన్నారాయణమూర్తి, రాధాకృష్ణమూర్తి, బుజ్జిబాబు, హనుమంతరావు, విశ్వతేజ ఉన్నారు.

నిబంధనల మేరకు ధ్రువ పత్రాలివ్వాలి

మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి



వైద్యులతో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాలటౌన్, మే 22 : జనన, మరణ ధ్రువపత్రాలను అక్టోబర్ - 2023 నుంచి అమలులోకి వచ్చిన పద్ధతి మేరకు అందజేయాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. కార్యాలయంలో బుధవారం పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలల వైద్యులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు జనన, మరణ వివరాలు సీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియలో జాప్యం చేయడం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి ఉంటుందని సూచించారు. అనంతరం పట్టణంలో డెంగ్యూ ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ సెక్రటరీలకు, వార్డు సెక్రటరీలకు సూచించారు. విధిగా చెత్త సేకరణ జరగాలని, పారిశుధ్య నిర్వహణలో అశ్రద్ధ ఉండకూడదని సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుతంగా జీవించండి



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ

చీరాలటౌన్, మే 22 : ప్రజలు వ్యక్తిగత లేక రాజకీయాల నేపథ్యంలో అసూయ అపోహలు వీడి శాంతియుతంగా జీవించాలని వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, టూటౌన్ సీఐ సోమశేఖర్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం వన్‌టౌన్ పరిధిలోని ఉజిలీపేట, హరిప్రసాద్‌నగర్, టూటౌన్ పరిధిలోని శృంగారపేట, రూరల్ పరిధిలో గవినివారి పాలెంలో ఎస్సై రత్నకుమారి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులు ఆయా ప్రాంతాల్లో మారణాయుధాలను ఇంటి సమీపంలో ఉంచకూడదని హెచ్చరించారు. లూజు పెట్రోల్ వంటి వాటిని నిశితంగా పరిశీలించారు. రౌడీ షీటర్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాల్లో భాగస్వాములయి శిక్షలు అనుభవించడం అవివేకమని హితవు పలికారు. కుటుంబాలతో శాంతియుతంగా జీవించాలని సూచించారు. భిన్నంగా వ్యవహరిస్తే కేసులతో పాటు జిల్లా బహిష్కరణ ఉంటుందని సీఐ హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఆయా స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

చినగంజాం, మే 22 : చినగంజాం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యూటీ వరప్రసాద్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియామావళికి లోబడి సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ, గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు తప్పనిసరిగా పాల్గొన్నాలని ఎంపీడీవో కోరారు.

ఉచిత మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

అద్దంకిటౌన్, మే 22 : అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ ప్యాకెట్లను బుధవారం పంపిణీ చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయిని యనమండ్ర వరలక్ష్మి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్టీసీ డీఎం రామ్‌మోహనరావు, అసిస్టెంట్ మేనేజర్ మహబూబీ ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లేవి ప్రసాద్, మహమ్మద్ రఫీ, సెక్రటరీ వీరయ్య, డాక్టర్ యూ దేవపాలన, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుని జయంతి



ఉత్సవమూర్తులను కల్యాణ వేదిక వద్దకు తీసుకువస్తున్న భక్తులు

అద్దంకిటౌన్, మే 22 : శింగరకొండలోని శ్రీ లక్ష్మి నరసింహస్వామి జయంతి మహోత్సవ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు స్వామివారిని విశేషంగా అలంకరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, కల్యాణం తిలకించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్. కోటిరెడ్డి, పాలక మండలి చైర్మన్ ఎస్.కొండలరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శాంతి కల్యాణం.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పంగులూరు : మండలంలోని రామకూరు గ్రామంలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి జయంతి వే డుకలు ఘ నంగా జరిగాయి. శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి జయంతి సందర్భంగా బుధవారం ఆలయంలో పుణ్యాహవాచనం, అభిషేక కార్యక్రమం, శాంతి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పా ల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి ఆత్మకూరి లక్ష్మీ తులసిరావు నేతృత్వంలో శా స్త్రోక్తంగా జరిగిన జయంతి వేడుకలలో ఒంగోలు మున్సిపల్ మాజీ చైర్మన్ యక్కల తులసీరావు దంపతు లు, యక్కల వంశస్తులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు లక్ష తమలపాకుల పూజ

పౌర్ణమి సందర్భంగా గురువారం శింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారికి లక్ష తమలపాకుల పూజ వేదపండుతులు, అర్చకులచే జరుగుతుందని ఆలయ ఈవో టీ సుభద్ర బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 7:30 గంటల నుంచి పూజా కార్యక్రమం జరుగుతుందని భక్తులు అందరు పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి దర్శించుకోవాలని ఆమె కోరారు.



బొల్లాపల్లి కొండపై నిర్వహిస్తున్న లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కనులపండువగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

మార్టూరు : మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో బుధవారం కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామి వారి కల్యాణానికి గ్రామంలోని 25 మందికిపైగా జంటలు పీటలపై కూర్చున్నారు. మరికొంత మంది భక్త లు స్వామి వారికి తలంబ్రాలు, తాళిబొట్టు, నూతన వస్త్రాలను అంద చే శారు. ఆలయ అర్చకులు ముప్పాళ్ల హరిప్రసాద్ బాబు గ్రామస్థుల సహకారంతో దేవదాయ జూనియర్ అసిస్టెంట్ సందీప్ పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణం కనులపండుగగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిల కించడానికి వచ్చిన భక్తులు మొదటిగా దేవస్థానంలోని మూలవిరాట్ లక్ష్మీ నరసింహస్వామి విగ్రహాలను దర్శించుకున్నారు. అనంతరం ధ్వజ స్తంభం వద్ద కొబ్బరి కాయలు కొట్టి పంచ ముఖ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కల్యాణం కించడానికి బొల్లాపల్లి, కోనంకి, కోలలపూడి, తాటివారిపాలెం గ్రామస్థులు హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి గ్రామంలో గరుడ వాహనంపై లక్ష్మీ నరసింహస్వామి దంపతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు చేశారు. ప్రధాన వీధులలో ఊరేగింపుగా వచ్చిన స్వామి వారిని దర్శించుకొని ప్రజలు పులకరించారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

శోభాయమానంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు



విశేష అలంకరణలో పార్వతీమాత

పంగులూరు, మే 22 : మండల కేంద్రమైన పంగులూరులో శ్రీ భీమలింగేశ్వరస్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి. మూడవ రోజు బుధవారం బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వా మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. బ్రహ్మశ్రీ శైవగామ పండితులు పేటేటి ఉదయభాస్కర శర్మ నేతృత్వంలో నిత్యోపాసన, ఆలయ బలిహరణ, గ్రామోత్సవం, బలిహరణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ అవధూతేంద్ర భక్త మండలి వారు శివ నామాన్ని జపిస్తూ ఏకాహ కార్యక్రమం చేపట్టారు. ఈవో శ్రీనివాసరావు కార్యక్రమాలను ప ర్యవేక్షించారు. శాస్త్రోక్తంగా జరిగిన పూజా కార్యక్రమాలలో ఆలయ అర్చక స్వాములు చందలూరి సునీల్ కుమార్ శర్మ, కారంచేటి సాంబశివరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

30 నుంచి శింగరకొండలో హనుమత్ జయంతి

అద్దంకిటౌన్, మే 22 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు హనుమత్ జయంతి మహోత్సవాలు జరుగుతాయని ఆలయ సహాయక కమిషనర్ టి.సుభద్ర బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. 30 తేదీ ఉదయం 8 గంటల నుంచి స్వామివారి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, 31వ తేదీ ఉదయం 9 గంటలకు మన్యుసూక్త హోమం, పూజా కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే జూన్ 1వ తేదీ శనివారం హనుమత్ జయంతి సందర్భంగా ఉదయ 4.45 నిమిషాల నుంచి పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కావున భక్తులందరూ స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందాలని ఆమె కోరారు.

పంట కాలువలో పూడికతీత

- పనులు చేయించిన ఉత్తర అమెరికా సంఘం
- మన గ్రామం.. మన బాధ్యత కింద అభివృద్ధి
- నాట్స్ అధ్యక్షుడు బాపయ్యను సన్మానించిన గ్రామస్థులు




పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న నాట్స్ అధ్యక్షుడు బాపయ్య

బల్లికురవ, మే 22 : వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేలా ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో పంట కాలువలలో పూడి కతీ పనులు చేపట్టారు. మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన మాదాల రాజేంద్ర ఉత్తర అమెరికాలో స్థిరపడ్డారు. పలు సమస్యలను రైతులు నాట్స్ సంఘం దృష్టికి తీసుకు వెళ్లగా ఆ సంఘ అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరి మన గ్రామం. మన బాధ్యత అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం గుంటుపల్లి గ్రామంలో పంట కాలువలో పూడిక తీత పనులను రైతుల సమక్షంలో చేపట్టారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్ఆర్ఐ ఉద్యోగులు ఎక్కడ స్థిరపడినా పుట్టిన గ్రామాలపై మమకారం ఉంటుందన్నారు. తెలుగు సంఘం నాట్స్ ఆధ్వర్యంలో కొంతకాలంగా గ్రామీణ ప్రాంతాలలో సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. గుంటుపల్లి నుంచి కొత్తపాలెం వరకు సాగర్ నీరు వచ్చే పంట కాలువను అభివృద్ధి పరిచి 250 ఎకరాలకు సక్రమంగా నీరు అందిచేలా చర్యలు చేపట్టి రైతులకు సాగు నీటి ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు. గతంలో కూడా రోడ్ల వెంబడి ఉన్న తుమ్మ చెట్లను తొలగించామన్నారు. దేవాలయాల అభివృద్ధికి నిధులు అందించామన్నారు. ఈ సందర్భంగా గుంటుపల్లి గ్రామానికి వచ్చిన తెలుగు సంఘం అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరికి రైతులు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, గ్రామ పెద్దలు మాదాల సాంబయ్య, గొల్లపూడి పూర్ణయ్య, రైతులు చల్లగుండ్ల రాంబాబు, దూళిపాళ్ల పున్నారావు పాల్గొన్నారు.



నమో.. నారసింహా!

నృసింహ జయంతి సందర్భంగా బుధవారం పెంచలకోన, నెల్లూరు రూరల్ మండలం నరసింహ కొండ తదితర క్షేత్రాల్లో లక్ష్మీనరసింహస్వామికి బంగారు గరుడ వాహనసేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే నెల్లూరులోని రంగనాయకులస్వామికి కూడా గరుడసేవ జరిగింది. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఎండలు మండిపోతున్నప్పటికీ చిన్నారులు, మహిళలు, వృద్ధులు పెద్దసంఖ్యలో ఆయా క్షేత్రాలకు చేరుకుని స్వామిసేవలో తరించారు.



సింహ వాహనంపై శ్రీవారు



కొండకోనల్లో నుంచి అమ్మవారి గుడికి వస్తున్న ఉత్సవం

కమనీయం నృసింహుడి కల్యాణం

- ఆదిలక్ష్మి, చెంచులక్ష్మిలను పెళ్లాడిన వేద గిరీశుడు
- వీక్షణకు తరలివచ్చిన భక్తులు
- జనసముద్రంలా నరసింహకొండ

నెల్లూరు రూరల్, మే 22 : వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలోని స్వామి, అమ్మవార్లను ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఆశీనులు చేసి, అలంకరణ మండపానికి తోడ్కొని వచ్చారు. అక్కడ అర్చక బృందం విశేష పూజలు, అభిషేకా లు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పెళ్లికుమారుడిగా పెళ్లి కుమార్తెలుగా అలంరించి, కల్యాణ మండపంపైకి తీసుకువచ్చారు. అనంతరం ఆలయ అర్చక బృందం వివాహతంతును నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పోటీపడ్డారు.కల్యాణ ఘట్టం అనంతరం స్వామి,అమ్మవార్లను గజవాహనంపై ఆశీనులను చేసి ఊరేగించారు. రాష్ట్ర నలుమూల నుంచి తరలివచ్చిన భక్తులతో నరసింహపురంతోపాటు కొండపైన రద్దీ నెలకొంది. భారీగా వాహనాలు చేరుకోవడంతో పార్కింగ్ సమస్య ఏర్పడింది. స్వామి, అమ్మవార్లకు ముందుగా ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను దేవదాయ శాఖ తరఫున ఆలయ ఈవో గిరికృష్ణ అందచేశారు.

- **స్వర్ణ గరుడుడిపై విహారం**

బుధవారం వేకువ జామున ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ఆలయ పుర వీధుల్లో స్వామివారు బంగారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకను తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి.



వేదగిరిపై స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- కొండకోనల్లో మారుమోగిన గోవింద నామస్మరణ
- ఇష్టవాహనంపై ఇలవేల్పు వైభోగం
- వైభవంగా సింహ, గరుడ వాహన సేవలు
- నృసింహ జయంతి సందర్భంగా కోనకు పోటెత్తిన భక్తులు

రాపూరు(డక్కిలి), మే 22 : కొండాకోనా ఎటు చూసినా కనుచూపు మేర భక్తులే భక్తులు.... ఎవరినోట విన్నా పెంచలో ...పెంచలా... గోవిందా...గోవిందా... నమో.. లక్ష్మీ నారసింహా... అనే నామ స్మరణే. భక్త కోటి పిలుపుతో పెనుశిల నరసింహుడు పరవశించి పోయాడు. పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వర్ణమయ కాంతులతో మెరిసి పోతున్న గరుడ్మంతుడిపై నరసింహస్వామి కొలువుదీరి భక్తులను కటాక్షించాడు. తమ ఇలవేల్పు దివ్యస్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనంద డోలికల్లో మునిగి తేలారు.

- **కిక్కిరిన కోన**

రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో పెంచలకోన క్షేత్రం కిక్కిరిసిపోయింది. ముందుగా పలువురు భక్తులు తలనీలాలు సమర్పించుకుని, పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు వివిధ సత్రాల్లో అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో జనం తరలి రావడంతో కోనలో ఈ ఏడాది వ్యాపారాలు ఊపందుకొన్నాయి. కాగా పెంచలస్వామి బుధవారం ఉదయం సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అలంకార మండపంలో సింహవాహనాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవమూర్తులను కొలువు దీర్చారు. అర్చకుల విశేష పూజల అనంతరం క్షేత్రోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం,విశేష పూజలు, హోమాలు కొనసాగించారు. రాత్రికి స్వామివారిని తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి సహస్ర దీపాలంకరణ మండపానికి తరలించా రు. ఉభయ దేవరులతో కలిపి ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం స్వర్ణ గరుడుడిపై స్వామి వారు కోనలో మూడ వీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాల్లో ఏసీ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, డీసీ కే విజయసాగర్ సాగరబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరీష్, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, శశికుమార్‌స్వామి, గుండ్లూరు సీతారామయ్య, పెంచలయ్య, బాలాజీ, మధుస్వామితో పాటు టీటీడీ అర్చకులు పాల్గొన్నారు. కాగా, కోనలో గురువారం ఉదయం శ్రీవారి కల్యాణం వేడుకగా నిర్వహించనున్నారు. ఇందుకుగాను మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. రాత్రి 6 గంటలకు రథోత్సవం, అనంతరం గజవాహన సేవ నిర్వహిస్తారు.



గరుడవాహనంపై పెంచల స్వామి



బంగారు గరుడుడిపై రంగడి చిద్విలాసం

నెల్లూరు (సాంస్కృతికం) మే 22: నృసింహ జయంతి సందర్భంగా నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి బంగారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. గరుడోత్సవం గోపురం వీధి మీదుగా శెట్టిగుంటరోడ్డు, లక్ష్మీపురం వరకు సాగింది. ఉభయదాతలుగా రాజా హజరత్‌బాబు, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. నగరవాసులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సహాయ కమిషనర్ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్...

- టీడీపీ ఏజెంట్లపై దాడులు
- ఓటర్ల జాబితాల చించివేత

మరో మాచర్ల!

- అంతు చూస్తామని విజయసాయి, ఆదాల బెదిరింపులు
- రూరల్ ఎన్నికల అధికారికి బాధితుల ఫిర్యాదు
- వెబ్ కెమెరాల్లోని దృశ్యాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని వినతి
- ఆలస్యంగా వెలుగు చూస్తున్న వైసీపీ అరాచకాలు

నెల్లూరు, మే22 (ఆంధ్రజ్యోతి): ఓటమి భయంతో వైసీపీ అభ్యర్థులతోపాటు ఆ పార్టీ నాయకులు పోలింగ్ రోజున చేసిన అక్రమాలు, అరాచకాలపై ఎన్నికల అధికారులకు ఆలస్యంగా ఫిర్యాదులు అందుతున్నాయి మాచర్ల ఘటనపై ఎన్నికల కమిషన్ స్పందించిన నేపథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో సైతం ఇలాంటి దౌర్జన్యాలు జరిగాయంటూ ఆరుగురు టీడీపీ ఎన్నికల ఏజెంట్లు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మలోలాకు టీడీపీ ఏజెంట్లు అందచేసిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నగరంలోని 21వ డివిజన్‌లో కార్పొరేటర్ మోయిల్ల గౌరీ, మోయిళ్ల సురేష్‌రెడ్డి తదితరులు టీడీపీ బూత్ ఏజెంట్లపై దౌర్జన్యం చేయడంతో పాటు ఓటరు జాబితాను చించివేశారని, మీ అంతు చూస్తామని బెదిరించారని ఫిర్యాదు చేశారు. అలాగే నెల్లూరు రూరల్ పరిధిలోని వెంగళరావునగర్ బూత్ నెంబరు 148లో కూడా నెల్లూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి తనపై దౌర్జన్యం చేశారని, ఓటరు జాబితా చించివేశారని, పరుష పదజాలంతో బెదిరించారని ఆ బూత్ టీడీపీ ఏజెంటు ఆర్వోకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బొల్లినేని ఆసుపత్రి ఎదురుగా ఉన్న మున్సిపల్ యూపీ స్కూలు బూత్‌లో టీడీపీ ఏజెంటుగా ఉన్న శివపై వైసీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డి దౌర్జన్యం చేశారని, ఓటర్ల జాబితా చించివేశారని, నీ అంతు చూస్తామని బెదిరించారని బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ దౌర్జన్యాలు, బెదిరింపులు అన్నీ కూడా పోలింగ్ కేంద్రాల్లోని వెబ్ కెమెరాల్లో రికార్డు అయ్యాయని బాధితులు తెలియచేస్తున్నారు. ఎన్నికల అధికారులు తక్షణం స్పందించి పోలింగ్ బూత్‌లోని వెబ్ కాస్టింగ్‌ను పరిశీలించి దౌర్జన్యం చేసిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

- **మాచర్ల ఘటనతో టీడీపీ శ్రేణుల్లో ధైర్యం**

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ నాయకులు చేసిన దాడులు, ఈవీఎం మిషన్ల ధ్వంసం సంఘటనలను వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించిన ఎన్నికల కమిషన్ చర్యలకు ఆదేశించింది.ఈ క్రమంలో నెల్లూరు జిల్లా టీడీపీ శ్రేణుల్లో ధైర్యం వచ్చింది. పోలింగ్ రోజు దౌర్జన్యాలను, బెదిరింపులను ఎదుర్కొన్న టీడీపీ ఏజెంట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి మొదలైన ఈ ఫిర్యాదులు త్వరలో జిల్లా వ్యాప్తంగా పలు నియోజకవర్గాల నుంచి కూడా అందే సూచనలు కనిపిస్తున్నాయి.

వైసీపీ నేతలపై చర్యలు తీసుకోండి

నెల్లూరు (వెంకటేశ్వరపురం): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని మూడుబూత్‌ల్లో వైసీపీ నాయకులు ఎన్నికల నియమావళి విరుద్ధంగా ఇష్టానుసారంగా ప్రవర్తించారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ బూత్ ఏజెంట్లు శరవణ, మహేష్, శివకుమార్, పవన్, శ్రీనివాసులు, రహీమ్ బుధవారం సాయంత్రం రూరల్ ఆర్‌వో మలోలకు ఫిర్యాదు చేశారు. ఈనెల 13న పోలింగ్ రోజు నియోజకవర్గంలోని 102, 103 బూత్‌ల్లోకి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, 148వ బూత్‌లోకి వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, 184, 185, 186వ బూత్‌ల్లోకి వైసీపీ 21 డివిజన్ కార్పొరేటర్ ఎం గౌరి, ఆమె భర్త సురేష్ రెడ్డి ప్రవేశించి తమ వద్ద ఉన్న ఓటరు జాబితాలను లాగేసి చించి వేశారన్నారు. తమ అంతు చూస్తానని బెదిరించారని, పోలింగ్ బూత్‌లో భయానక వాతావరణం కల్పించి. ప్రజలనుభయభ్రాంతులకు గురి చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారించి వారందరిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



సమాజ సేవ విద్యావంతుల బాధ్యత

- విజ్ఞానం, నైపుణ్యం దేశాభివృద్ధికి సోపానాలు
- న్యాక్ ఏ గ్రేడ్ పొందడం వీఎస్‌యూకి గర్వకారణం

- వీఎస్‌యూ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

వెంకటాచలం, మే 22 : విద్యావంతులు సమాజసేవకు తమవంతు సహకారం అందించాలని,పేదరిక నిర్మూలనకు వారి సహకారం ఎంతో అవసరమని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ 8,9వ స్నాకోత్సవం బుధవారం అట్టహాసంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని అది నేరవేరేందుకు సంకల్పం, పట్టుదల కలిగి ఉండాలన్నారు. పదిహేనేళ్లుగా వీఎస్‌యూ సమాజానికి సేవ చేయడంలో విశేషమైన పురోగతి సాధించిందన్నారు. అత్యుత్తమ న్యాక్ ఏ గ్రేడ్ వర్సిటీ పొందడం గర్వకారణమన్నారు.

- **మౌలిక వసతులు భేష్**

వీఎస్‌యూలో అత్యాధునిక భవనాలు, ఆధునిక హాస్టళ్లు, ఆకట్టుకునే మెయిన్‌గేట్ ఆర్చ్, చక్కగా నిర్వహిస్తున్న అంతర్గత రహదారులతోసహా మౌలిక సదుపాయాలు చాలా బాగున్నాయని గవర్నర్ పేర్కొన్నారు. బుధవారం వర్సిటీ భవన సముదాయాన్ని ఆయన పరిశీలించారు. లైబరీలోని దీపాలు, వాటర్ హీటర్లు, కంప్యూటర్ల కోసం సౌరశక్తిని ఉపయోగించడం, స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటు, ఆర్‌ఎఫ్ఐడీ, ఐఎల్ఎంఎస్‌తో లైబ్రరీని డిజిటలైజేషన్ చేయడం వంటివి చేయడం ప్రశంసనీయమన్నారు.

- **ఆశావహ ధోరణిలో విద్యార్థులు : సతీష్‌రెడ్డి**

మరో ముఖ్య అతిథి, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జీ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థుల్లో ఆశావహ ధోరణి, ఆత్మవిశ్వాసం పెరిగాయని అన్నారు. దేశంలో 1,168 యూనివర్సిటీలు ఉన్నాయని, వాటిల్లో 12.3 కోట్లమంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టార్టప్, ఆత్మనిర్భర భారత్ వంటి పథకాలను నేటి యువత వినియోగించుకుంటున్నారన్నారు. ప్రముఖ కవితిక్కన ఈ జిల్లాకు చెందినవారేనని, అలాగే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కూడా జిల్లాలో చదువుకున్నారని వివరించారు. పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు జిల్లా వాసేనని గుర్తు చేశారు. నెల్లూరు జిల్లాలో ఎంతోమంది ప్రముఖులు చదువుకున్నారని ఆయన చెప్పారు.



ఈఎన్‌టీ వైద్యుడు వినయ్‌కుమార్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ నజీర్, చిత్రంలో ఏరోనాటికల్ సొసైటీ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, వీఎస్‌యూ వీసీ సుందరవల్లి తదితరులు



అధ్యాపకులతో సమావేశమైన గవర్నర్, వీసీ, సతీష్‌రెడ్డి తదితరులు

- **గవర్నర్‌కు ఘనస్వాగతం**

వీఎస్‌యూ 8, 9వ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు వర్సిటీకి విచ్చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వీసీ సుందరవల్లి, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జేసీ సేతు మాధవన్, రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డిలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వర్సిటీ ప్రొఫెసర్లతో గవర్నర్ సమావేశమై, గ్రూప్ ఫొటో దిగారు.

29 మందికి బంగారు పతకాల ప్రదానం

స్నాతకోత్సవంలో 29 మంది విద్యార్థులకు గవర్నర్ బంగారు పతకాలు, డిగ్రీ పట్టాలను అందించారు. అలాగే హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఈసీ వినయ్‌కుమార్‌కు డాక్టరేట్ అందచేశారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం 275 మందికి ప్రత్యక్షంగా డిగ్రీ పట్టాలు, పోస్టు ద్వారా 3,361 మందికి డిగ్రీ పట్టాలు అందిస్తున్నట్లు వీసీ సుందరవల్లి తెలిపారు. తెలుత వీసీ వర్సిటీ ప్రగతి, కార్యాచరణ ప్రణాళిక నివేదికను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జేసీ సేతుమాధవన్ తదితరులు పాల్గొన్నారు.



బంగారు పతకంతోపాటు గవర్నర్ నుంచి పట్టాలు అందుకుంటున్న విద్యార్థినులు



హుర్రే... పట్టాలు పొందిన ఆనందం

గవర్నర్‌కు వీడ్కోలు

నెల్లూరు(హరనాథపురం): విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొని, విజయవాడకు బయలు దేరిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు.



గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్

కనుల పండువగా సీతారాముల కల్యాణం



సీతారామపురం : సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కొండాపురం: గుడవళ్ళూరులో హనుమంత వాహనంపై ఊరేగుతున్న సీతారాములు

సీతారామపురం, మే 22: మండలంలోని దేవిశెట్టిపల్లి గ్రామంలో సీతా సమేత ప్రసన్న కోదండ రామస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కొండాపురం: నృసింహ జయంతిని పురస్కరించుకొని మండలంలోని పలుగ్రామాల్లో ఆలయాల వద్ద గ్రామస్థులు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం పార్లపల్లి, నేకునాంపేట, గుడవళ్ళూరు, కొమ్మి, వెలిగండ్ల తదితర గ్రామాల్లో రామాలయాల వద్ద జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామాల్లో ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నసంతర్పణ కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసు శాఖ ఆదేశాల మేరకు ఆలయాల వద్ద ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించకుండా కేవలం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉదయగిరి రూరల్: మండలంలోని పప్పులవారిపల్లి గ్రామంలో శ్రీకోదండరామస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికకు తీసుకొచ్చారు. అనంతరం శాస్త్రోక్తంగా స్వామివార్ల కల్యాణ తంతు నిర్వహించారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వెంగయ్యగారిపాలెంలో పోలీసుల తనిఖీలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు, రాడ్లు

కావలి రూరల్, మే 22: కావలి పట్టణం వెంగయ్యగారిపాలెంలో బుధవారం 1వ పట్టణ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ఉన్నతాధికారుల ఆదేశానుసారం ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు 1వ పట్టణ సిఐ రాజేష్ తెలిపారు. ఈ తనిఖీలలో ఎలాంటి పత్రాలు లేని 8 బైకులు, 2 కత్తులు, 9 రాడ్లు స్వాధీనం చేసుకుని విచారిస్తున్నట్లు సిఐ తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మరుగుదొడ్ల పనులు పరిశీలిస్తున్న ఎంఈవోలు

ఉదయగిరి రూరల్, మే 22: మనబడి నాడు-నేడు పథకం రెండో విడత జరుగుతున్న పాఠశాలల మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. వారు బుధవారం మండలంలోని కుర్రపల్లి, బోడబండ, జీ.చెరువుపల్లి హరిజనవాడ ప్రాథమిక, బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టీ వెంటేశ్వర్లు, షేక్ ఖాదర్‌బాషా, టీ సుభాషిని, మాల్యాద్రి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

546 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 22: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు మొత్తం 601 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 15కంపెనీ ప్రతినిధులు పాల్గొని 546 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-10, సీఆర్-23, జంపింగ్ లాట్స్-22 కారణాలతో 55 బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.320, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.269.71గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

లింగసముద్రం, మే 22 : మండలంలోని వీఆర్‌కోట గ్రామ సమీపంలోని మన్నేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను లింగసముద్రం పోలీసులు పట్టుకున్నారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు అందిన సమాచారం మేరకు ఎస్‌హెచ్‌ఓ ఎ మల్లికార్జునరావు సిబ్బందితో దాడిచేసి మన్నేరులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను, నలుగురు డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నలుగురు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Atmakur బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన [illegible]

SCHEDULE

ఐటం నెం.1: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు డి. వింజమూరు [illegible] ... 1.004 హె.లు గల భూమిన్ని, మామూలు దారి హక్కులు, యావత్ ఈజ్‌మెంట్ హక్కులతోటి.

ఐటం నెం.2: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు డి. వింజమూరు [illegible] ... 0.251 హె.లు గల భూమిన్ని, మామూలు దారి హక్కులు, యావత్తు ఈజ్‌మెంట్ హక్కులతోటి.

Perepi Venugopal, B.Com., B.L.,
Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528


పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, మే 22: పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశం కోసం జూన్ 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ సుబ్బారెడ్డి తెలిపారు. 6 నుంచి 23 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన తెలివితేటలు లేని పిల్లలు, పుట్టుక నుంచి మాటలు రానివారు, స్వంతంగా పనులు చేసుకోలేనివారికి ఉచితంగా విద్యాభ్యాసంతో పాటు ప్రత్యేక శిక్షణ, మాటలు నేర్పించటం జరుగుతుందని తెలిపారు. పెద్దపిల్లలకు వృత్తివిద్య శిక్షణలో భాగంగా స్పైరల్ బైండింగ్ నేర్పిస్తామని తెలిపారు. చెవిటి, మూగ పిల్లలకు 1నుంచి 9వ తరగతి వరకు విద్యను అందించటం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతితో పాటు పట్టణ పరిసర గ్రామాలవారైతే ఉచిత వ్యాన్ సౌకర్యం కూడా ఉందని ఆయన తెలిపారు. వివరాలకు 9492119828 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రతిభా పురస్కారాలకు పేర్లు నమోదు చేసుకోండి

కావలిటౌన్, మే 22: యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన నెల్లూరులో యాదవ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల మహోత్సవం జరగనున్నట్లు ఎపా కావలి డివిజన్ కన్వీనర్ గోరంట్ల రమణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా కందుకూరు డివిజన్ పరిధిలో పది పరీక్షల్లో ప్రతిభ చాటి 475 ఆపైన మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు నెల్లూరు అపోలో హాస్పిటల్ ఎదురుగానున్న జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి ప్రతిభా పురస్కార మహోత్సవం జరగనుందన్నారు. ఆసక్తిగల యాదవ విద్యార్థులు 9492007309 నెంబర్‌కు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రేపే బ్రహ్మాండమైన విడుదల



నెల్లూరు	-	వినాయక
కావలి	-	మానస
విడివలూరు	-	జనార్ధన మాల్
పోకూరు	-	జివిఎస్ సినిమా
పులిచేడు	-	వెంకట్రామ

HOUSEFUL CINEMA-8885299777

30వ వార్డులో సమస్యలు పరిష్కరించాలి


● మున్సిపల్ కమిషనర్‌కు టీడీపీ నేతల వినతి



వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

కావలి, మే 22: కావలి పట్టణ 30వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని ఆ వార్డు ఇన్‌చార్జి గాదంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు బుధవారం కావలి మున్సిపల్ కమిషనర్ ఐ శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఆ వార్డులోని కోటావారివీధిలోని నరేంద్ర భారతి స్కూల్ పక్కన రెండు ఖాళీ స్థలాలలో పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉందని, దీంతో విష పురుగులు సమీప ఇళ్లలోకి వెళ్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ తగు చర్యలు తీసుకుంటానని చెప్పినట్లు వారు తెలిపారు.

వర్షాలతో పులకరిస్తున్న వెలుగొండ అడవులు



పచ్చదనం సంతరించుకున్న వెలుగొండ అడవులు

ఉదయగిరి రూరల్, మే 22: వర్షాలు కురుస్తుండడంతో వెలుగొండ అడవులు పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణాన్ని పంచుతున్నాయి. ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు, వెంకటగిరి ప్రాంతాల్లో వెలుగొండ అడవులు విస్తరించి ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో వెలుగొండ అడవుల గుండా వాహనాల్లో వెళ్తున్న ప్రయాణికులు ఆ సోయగాలను చూసి ఆనందపరవశులవుతున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావత్ మందికి తెలియజేయడమేమనగా నా కక్షిదారుడు నెల్లూరుజిల్లా, కావలి టవున్, మాకనవారివీధి, పెద్ద పావని బస్టాండ్ సమీపం, డోర్ నెంబరు: 09-3-2 కాపురస్తుడు **మాకన రజనీకాంత్ S/o. లేట్ నాగేశ్వరరావు** రెండవ కుమారుడు సంజాయిషీ మేరకు తన తండ్రి **మాకన నాగేశ్వరరావు** తేదీ:02-05-2007 సంవత్సరంలో నెల్లూరు సబ్ రిజిస్ట్రార్ వీలునామా చేసి వున్నారు. ఆయన ఇటీవల తేదీ: 14-02-2024న స్వర్గస్థులైనారు. ఆయన రాసిన వీలునామాలో తన రెండవ కుమారుడు కుమారుడైన **మాకన జగదీష్ లేట్ మాకన నాగేశ్వరరావు** గారి మనవడు ఆ నాటి మైనర్ అయినందున గార్డియన్‌గా తండ్రి **మాకన రజనీకాంత్**ను నియమించారు. ఆ రోజూ నుంచి సదరు వీలునామాలో పొందుపరిచిన షెడ్యూల్ B ఆస్తి నా క్లయింట్ స్వాధీనంలో వుంది. కావున ఈ దాఖలు ఆస్తిపై ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు వున్న ఈ రోజు నుంచి ఏడు రోజులలో ఈ క్రింది అడ్రస్సుకు లిఖిత పూర్వకముగా సరియైన ఆధారాలతో తెలుపుకోవలసినదిగా తెలియజేయడమైనది. తదుపరి వచ్చే ఆక్షేపణలు నా క్లయింట్‌కు బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, కావలి సబ్ రిజిస్ట్రేషన్, కావలి. కావలి టౌన్ వార్డ్ నెంబర్ 9, మాకన వారి వీధి, డోర్ నెంబర్ 9-3-2రు గల 8 1/2 అంకణాల స్థలం ఇందులోని పెంకుటిల్లు. **హద్దులు: తూర్పు:** మున్సిపాలిటీ రోడ్డు, **పడమర:** మాకన సుబ్బరత్నమ్మ గారి ఇల్లు, **దక్షిణం:** మాకన సూరిబాబు గారి ఇల్లు, **ఉత్తరం:** మాకన శంభుప్రసాద్ గారి ఇల్లు. ఈ హద్దులలోని 8 1/2 అంకణాలు లేక 56,856 చదరపు మీటర్లు స్థలం అందులోని పెంకుల ఇల్లు, ఇందుకు సంబంధించిన యావత్తు ఈజ్‌మెంట్ హక్కులతోటి.

కె.శిఖివాహన్, అరిగెల ఇందిర
అడ్వకేట్, కలెక్టర్ ఆఫీసు ఎదురుగా, ఆచారివీధి, నెల్లూరు. సెల్: 99599 56566.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పడకేసిన పారిశుధ్యం

● పట్టణంలో పేరుకుపోయిన చెత్తాచెదారం



సాయిబాబా ఆలయం వీధిలో ఉన్న చెత్తా చెదారం

కావలి, మే 22: అధికారుల పర్యవేక్షణ లోపంతో కావలి పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. రోడ్లపై చెత్తా చెదారాలు సకాలంలో తొలగించకపోవడం, కాలువలలో మురుగు కూడా సక్రమంగా తీయకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రతగా ఉండటమే కాక దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయిబాబా గుడికి వెళ్లే వీధిలో ఫారెస్ట్ కార్యాలయం పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర చెత్తాచెదారం కుప్పగా వేసి ఉంది. పొరపాటున ఎవరైనా ఆ చెత్త కుప్పకు నిప్పంటిస్తే ట్రాన్స్‌ఫార్మర్ కూడా కాలిపోయే ప్రమాదం ఉంది. అలాగే కొత్త మసీద్ వీధిలో డ్రైనేజి చెత్తతో పూడిపోవటంతో మురుగు నీరు ముందుకు సాగక దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన అవసరం



ఉదయగిరి: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

ఉదయగిరి, మే 22: రసాయనిక ఎరువుల నుంచి పంటను, భూమిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ తెలిపారు. బుధవారం గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం ఆర్‌బీకేల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఈనెల 28వ తేదీ వరకు భూసార పరిరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, పచ్చిరొట్ట, నానో జీవ సంబంధిత ఎరువుల వాడకంతో భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. దీంతో ఆరోగ్యంతోపాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. రైతులు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేసే ఎరువులు, విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జీవ వైవిధ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: చోర్లేయడవల్లి రైతుభరోసా కేంద్రం పరిధిలోని రైతులకు పీఎం ప్రణం పథకం క్రింద సమగ్ర పోషక యాజమాన్యంతో పాటు, భూసార పరిరక్షణపై బుధవారం ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలయకులు దేవసేనమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పంటల సాగులో రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడకుండా, భూసార పరీక్షలకు అనుగుణంగా వాడటంతో పాటు సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులైన పీఎస్‌బీ అజోస్పైరిల్లంలను తప్పనిసరిగా వాడాలన్నారు. ఇలా చేసే సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారి కిషోర్ మాట్లాడారు. నేల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి రైతు తప్పనిసరిగా సబ్సిడీతో అందించే పచ్చిరొట్ట ఎరువు అయిన జీలుగ, జనుము, పిల్లిపెసర సాగు చేసి పూత దశలో కలియ దున్నితే భూమి సారవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీహర్ష, రైతులు పాల్గొన్నారు.

లింగసముద్రం: పంటల సాగులో రైతులు సేంద్రీయ ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి టి అబ్రహాంలింకన్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని పెదపవని-2, చినపవని రైతు భరోసా కేంద్రాలలో పీఎం ప్రణామ్ కార్యక్రమం కింద రైతులకు సేంద్రీయ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. రైతులు భూసార పరిరక్షణకై జీవన ఎరువులతో పాటు సేంద్రీయ ఎరువులు వాడాలన్నారు. రైతులు రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడటం వలన భూమిలో పండించే పంటల ద్వారా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, పర్యావరణం దెబ్బతింటుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, వీఏఏలు షేక్ ఇమ్రాన్ నజీర్, అఫ్రిన్ పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఆర్వో, ఎస్ఐ

ఉదయగిరి రూరల్, మే 22: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో వివాదాలకు పాల్పడి అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చేనెల 4న ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున 6వ తేదీ వరకు కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించడంతోపాటు గ్రామాల్లో శాంతియుతంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలు తలెత్తినా సమాచారం అందించాలన్నారు. అలాగే స్థానిక బీసీ కాలనీలో ఎస్ఐ కార్డన్‌సర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

సంగం, మే 22: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీ సుకోవాలని తహసీల్దారు రమదేవి వీఆర్వో, వీఆర్‌ఏలకు ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆమె వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ రోజు చెన్నవరపాడులో మహిళ ఓటు విషయంపై ఇరువర్గాలు ఘర్షణ పడ్డారని, కౌంటింగ్ పూర్తైయ్యే వరకు అలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా గొడవలు జరుగుతాయని ముందస్తు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'హంస' కార్యవర్గం ఎంపిక

ఉదయగిరి రూరల్, మే 22: స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్, జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్‌ల అధ్యక్షతన జిల్లా ఉపాధ్యక్షులు కప్పా నారాయణరాజు, షేక్ జలీల్‌అహ్మద్‌ల ఆధ్వర్యంలో బుధవారం ఉదయగిరి తాలుకా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. తాలుకా యూనిట్ అధ్యక్షుడిగా కె వెంకటసుబ్బయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా ఓంకారం శేఖర్‌రాజు, తాలుకా సెక్రటరీ, ట్రెజరర్‌లుగా షేక్ నౌషాద్‌బాబు, పిక్కిలి హసనయ్య, ఆర్గనైజింగ్, పబ్లిసిటి సెక్రటరీలుగా షేక్ బీబీజాన్, ఆకుమల్ల శ్రీనివాసులను ఎంపిక చేశారు. అనంతరం ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలు, వీసీ మెంబర్లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వినీత, షంషుద్దీన్, సల్మా, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● నలుగురికి తీవ్ర గాయాలు ● బాధితులు ప్రకాశం జిల్లా వాసులు



మృతిచెందిన వెంకటేశ్వరరెడ్డి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), మే 22: మండలంలోని చింతలకుంట గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకొంది. ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు కారులో తిరుమల వెళ్లారు. అక్కడ స్వామివారి దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా చింతలకుంట గ్రామ సమీపానికి రాగానే మార్కాపురం నుంచి చిత్తూరుకు వెళుతున్న పాల లారీని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పాలగిరి వెంకటేశ్వరరెడ్డి(30) అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న మృతుని భార్య మంజులత, తండ్రి సుబ్బారెడ్డి, తల్లి నారాయణమ్మ, అక్క కుమారుడు అభిరూప్‌నందన్‌రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. మృతునికి గత కొన్ని నెలల క్రితమే వివాహమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కారు వేగంగా ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయ్యింది. వెంకటేశ్వరరెడ్డి డ్రైవింగ్ సీట్లోనే ఇరుక్కునిపోయాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ ఉమాశంకర్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానికుల సహకారంతో అతికష్టం మీద బయటకు తీశారు. తీవ్ర గాయాలైన క్షతగాత్రులను ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి ఉదయగిరి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి దగ్గరుండి ప్రథమ చికిత్స చేయించి అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళా దొంగ అరెస్టు

● రూ.2లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం

కోదాడ, మే 22 : సూర్యాపేట జిల్లా కోదాడతోపాటు పలు బస్‌స్టేషన్లలో దొంగతనాలకు పాల్పడుతున్న మహిళను పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నెల్లూరు జిల్లా కావలి మండలం బుడంగుంట గ్రామానికి చెందిన కర్రెద్దుల లలిత దొంగతనాలకు చేసేది. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీన మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెంకి చెందిన మహిళ, కోదాడ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు సిద్ధంగా ఉండగా, ఆమె మెడలో ఉన్న చంద్రహారం, చెవి దిద్దులు, ముక్కుపొడుక, ఉంగరం, రూ.30 వేల నగదు అపహరించింది. బుధవారం కోదాడ పట్టణంలోని ఓ బంగారు ఆభరణాల దుకాణంలో దొంగిలించిన బంగారం అమ్మేందుకు తిరుగుతుండగా అనుమానం వచ్చిన పోలీసులు ఆమె విచారించారు. బంగారం, నగదు, దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రెండు రాష్ట్రాల్లో మహిళపై 50కి పైగా కేసులు ఉన్నాయని తెలిపారు. పలుమార్లు జైలు శిక్ష, అనుభవించినట్లు తెలిపారు. ఆమె వద్ద నుంచి రూ.రెండు లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నిరుపయోగంగా బస్‌స్టేషన్



నిరుపయోగంగా ఉన్న బస్ స్టేషన్

వలేటివారిపాలెం, మే 22: మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో లక్షలు వెచ్చించి నిర్మించిన బస్‌స్టేషన్ ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని రూ. 10 లక్షలతో వలేటివారిపాలెంలో ప్రయాణికులకు అవసరమైన మరుగుదొడ్లు, తాగునీరు, కూర్చోవడానికి వసతి తదిర సదుపాయాలతో బస్‌స్టేషన్ నిర్మించారు. రెండేళ్లపాటు బస్సులు బస్‌స్టేషన్‌లోకి వెళ్లేవి. తదనంతరం ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వలన బస్సులు బస్‌స్టేషన్‌లోకి వెళ్లకపోవడంతో ప్రయాణికులు కూడా బస్‌స్టేషన్‌లోకి వెళ్లడం మానేశారు. దీంతో బస్‌స్టేషన్ నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో సంచార జాతులకు నిలయంగా మారింది. బస్‌స్టేషన్‌లో మరుగుదొడ్లు వినియోగం లేక శిథిలావస్థకు చేరాయి. విద్యుత్ మోటారు అపహరణకు గురైంది. అయినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ప్రయాణికులు పాత బస్టాండు మూడు రోడ్ల కూడలిలో వసతులు లేక ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్ స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకురావల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలి

● బోర్డు అధికారులకు రైతుల మొర



పొగాకు మండెలను పరిశీలిస్తున్న రైతు

కలిగిరి, మే 22: పొగాకు కొనుగోళ్ళు వేగవంతం చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు. పొగాకు వాణిజ్య పంట. ఈ ఏడాది సాగు చేసిన రైతులకు ఈపంట పచ్చ బంగారంగా మారిపోయింది. గతేడాది కేజీ పొగాకు గరిష్ఠ ధర రూ.280 పలకగా ఈ ఏడాది బంగారం ధరలు పెరిగిపోతునట్లు, ఇప్పటికే కేజీ పొగాకు రూ. 230 నుండి రూ. 320 మార్కు దాటేసింది. కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలో ఈ ఏడాది పంట సాగుకు 1200 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. బోర్డు అధికారులు 4.5మిలియన్ కేజీల అమ్మకాలకు అనుమతి ఇవ్వగా ధరలు పెరుగుతాయనే ఉద్దేశ్యంతో అధిక విస్తీర్ణంలో సాగుచేయడం ద్వారా 7.5 మిలియన్ కేజీల దిగుబడి రావచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 3.2మిలియన్ కేజీలు మాత్రమే పొగాకు అమ్మకాలు జరిగాయి. ఇందులో 1మిలియన్ కేజీలు మాత్రమే బ్రైట్, మీడియం రకం పొగాకు అమ్మకాలు జరుగగా, మరో 2.2 మిలియన్ కేజీలు లోగ్రేడ్ పొగాకు అమ్మకాలు జరిగాయి. ఈ కారణంతో రైతులవద్ద అధిక మొత్తంలో బ్రైట్, మీడియం 2 మిలియన్ కేజీలు ఉండగా, అదే మొత్తంలో లోగ్రేడ్ పొగాకు కూడా 2.5 మిలియన్ కేజీలు ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. దీంతో సుమారు 4.5 మిలియన్ కేజీల పొగాకు నిల్వలు రైతుల ఇళ్ళ వద్ద ఉన్నాయి. ప్రస్తుతం రోజురోజుకి పొగాకు ధర పెరిగిపోతూ ఉండటంతో ఇంకా ఎక్కువ మద్దతు ధర అందుతుందనే ఆశతో రైతులు ఇళ్ళ వద్ద మొదటి రకం పొగాకు ఎక్కువ శాతం నిల్వ ఉంచినట్లు అధికారులు తెలియజేస్తున్నారు. అనుమతి ఇచ్చిన వరకు కొనుగోళ్ళకు మరో మూడువారాల సమయం చాలని అధికారులు పేర్కొనగా, రోజులు జరిగేకొద్దీ పొగాకు నాణ్యతలో తేడా వచ్చి రంగు మారే పరిస్థితి ఉందని, తమవద్ద ఉన్న పొగాకు బేళ్ళను పరిశీలించి కొనుగోళ్ళు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

వెలగని వీధిలైట్లు

● అంధకారంలో ఆర్వోబీ వంతెన



అంధకారంలో ఉన్న ఆర్వోబీ వంతెన

కావలి, మే 22: కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులోని ఆర్వోబీ వంతెనపై గత వారం రోజులుగా వీధిలైట్లు వెలగకపోవటంతో అంధకారం నెలకొంది. లైటింగ్ స్తంభాల కోసం ఫుట్‌పాత్ కింద అమర్చిన కేబుల్ వైర్లు దెబ్బతినటంతో వాటి స్థానంలో కొత్త కేబుల్ వైర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వంతెనపై లైట్లు వెలగక అంధకారం నెలకొంది. నిత్యం రద్దీగా ఉండే వంతెన మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. అయితే రాత్రి సమయంలో అక్కడ అంధకారం నెలకొనటంతో ఎదురుగా వచ్చే వాహనాలు పెద్దగా కనపడకపోవటం వలన వంతెన మార్గంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. కేబుల్ వైర్లు ఏర్పాటు మరో ఐదారు రోజులు పట్టే పరిస్థితులు కనిపిస్తుండటంతో వంతెనపై రాకపోకలకు వాహన చోదకులతో పాటు పాదచారులు సైతం రాత్రి సమయంలో భయపడుతున్నారు. అధికారులు స్పందించి వంతెనపై కేబుల్ వైరు ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసి లైట్లు వెలిగించి అంధకారం నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్నారు.